సోమవారం
14 జనవరి
2019

పేజీలు 12
సంపుటి 1, సంచిక 296

www.vijayakranthinews.com

విజయ క్రాంతి

నిజం నిర్భయం నిష్పక్షం

హైదరాబాద్ | PUBLISHED SIMULTANEOUSLY FROM HYDERABAD, NIZAMABAD, KHAMMAM | VIJAYAKRANTHINEWS | రూ. 3.00



అమెరికాలో అనుష్క సినిమా 10

సీఎం సంక్రాంతి శుభాకాంక్షలు..

విజయక్రాంతి, హైదరాబాద్: రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ పండగల పరమార్థాన్ని తెలుసుకుని సుఖ సంతోషాలతో కలిసిమెలిసి ఉండాలని ఆకాంక్షించారు. ఈ సంక్రాంతి ప్రతి ఇంట వెలుగులు నింపాలని, ప్రజలు పాడిపంటలతో తులతూగాలని కోరారు.

పొత్తుతో ఎవరు చిత్తు..?



- యూపీ పొత్తు బీజేపీకి నష్టమేనా..?
- ఒంటరి పోటీకి కాంగ్రెస్ రెడీ
- తగ్గిన మోదీ, యోగి కరిష్మా
- మూడు రాష్ట్రాల ఓటమితో బీజేపీ డీలా
- త్రిముఖ పోటీతో మాకే లాభమంటున్న కమలనాథులు
- ఈబీసీ, రామమందిరంపై బీజేపీ ఆశలు

విజయక్రాంతి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికలు మరో నాలుగు నెలలుండగానే.. దేశ రాజకీయాలు వేడెక్కాయి. జాతీయ స్థాయిలో కూటములు ఏర్పాటు చేస్తామంటూ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేసీఆర్, చంద్రబాబు ప్రకటనలు చేస్తూనే ఉన్నారు. వీరిద్దరి కూటములు ప్రకటనల్లోనే ఉండగానే ఈలోపు రెండు బలమైన పార్టీలైన సమాజ్‌వాదీ(ఎస్పీ), బహుజన సమాజ్‌వాదీ పార్టీ(బీఎస్పీ)లు ఉత్తరప్రదేశ్‌లో కూటమిగా ఏర్పాడ్డాయి. ఈ కూటమి ఏర్పాటుతో ఆ రాష్ట్రంలో బీజేపీకి చెక్ పెట్టినట్టేనని రాజకీయవర్గాలు భావిస్తున్నాయి.

మోడీ కరిష్మాతో బీజేపీకి యూపీ

దేశంలో 543 లోక్‌సభ స్థానాలున్నాయి. వీటిలో ఒక్క ఉత్తరప్రదేశ్‌లోనే 80 స్థానాలున్నాయి. ఈ లెక్కన దాదాపు 15 శాతం ఎంపీ సీట్లు యూపీలోనే ఉన్నాయి. 2014 ఎన్నికల్లో నరేంద్రమోడీ కరిష్మా కారణంగా బీజేపీ 42.20 శాతం ఓట్లు సాధించి 71 సీట్లు గెలిచింది. ఆ పార్టీ మిత్రపక్షమైన అప్నాదళ్ ఒక్కశాతం ఓట్లు సాధించి రెండు సీట్లు గెలిచి విజయం ఏకపక్షంగా నిలిచింది. 2017లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో యోగి ఆదిత్యనాథ్ కరిష్మా కారణంగా అత్యధిక మెజారిటీతో బీజేపీ గెలిచింది. ఇప్పుడు వీరిద్దరి కరిష్మాలు ఆ రాష్ట్రంలో అంతగా పనిచేసే అవకాశాలు కన్పించడం లేదు. ఈ సమయంలోనే బీజేపీ దెబ్బకొడితే.. ఆ పార్టీ అధికారానికి దూరమవుతుందని గతేడాది నుంచే ప్రతిపక్షాలు వ్యూహాలు రచిస్తున్నాయి. ఇందులో భాగంగానే.. ప్రస్తుత ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ఉప ముఖ్యమంత్రి కేశవప్రసాద్ మౌర్య రాజీనామా చేసిన గోరఖ్‌పూర్, ఫుల్‌పుర్ ఎంపీ స్థానాల్లో పోటీ చేసిన ఎస్‌పీ అభ్యర్థులకు బీఎస్పీ మద్దతిచ్చింది. దీంతో ఈ రెండు స్థానాల్లో బీజేపీ ఓడి, ఎస్పీ అభ్యర్థులు గెలిచారు. ఆ తరువాత ఖైరానా స్థానానికి జరిగిన ఎన్నికల్లో అన్ని పార్టీల మద్దతుతో రాష్ట్రీయ లోక్‌దళ్ గెలిచింది. దీంతో ప్రతిపక్షాలు ఏకమైతే బీజేపీని ఓడించవచ్చన్న నమ్మకం ప్రతిపక్షాల్లో కలిగింది. ఈ ఎన్నికల అనంతరం బీఎస్పీ, ఎస్పీ కలిసి పలుమార్లు చర్చలు జరిపిన తరువాత లోక్‌సభ ఎన్నికల్లో కలిసి పోటీ చేయాలని నిర్ణయం తీసుకొని కూటమిగా ఏర్పడ్డాయి. ఇందులో భాగంగా ఈ రెండు పార్టీలు చెరి 38 స్థానాల్లో పోటీ చేయాలని నిర్ణయం తీసుకున్నాయి. తమ కూటమిలో కాంగ్రెస్‌కు చోటు లేదని కూడా తేల్చి చెప్పాయి.

సైకిల్, ఏనుగు పొత్తుతో నష్టమెవరికి..?

యూపీలో ఏర్పడిన ఎస్పీ, బీఎస్పీ పొత్తుతో నష్టమెవరికన్న చర్చ తీవ్రస్థాయిలో జరుగుతోంది. గతేడాదిలో జరిగిన ఉప ఎన్నికల ఫలితాల ప్రకారం చూస్తే.. బీజేపీకి తీవ్ర నష్టం జరిగే అవకాశం కన్పిస్తోంది. గతేడాది జరిగిన ఉప ఎన్నికల్లో ఎస్పీ అభ్యర్థులు పోటీ చేస్తే.. బీఎస్పీ మద్దతిచ్చింది. ఆనాడు ఓట్లు కూడా బదిలీ అయ్యాయి. పైగా ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ కూడా మద్దతివ్వడంతో ఎస్పీ అభ్యర్థుల గెలుపు సులువైంది. ఎస్పీ, బీఎస్పీ రాష్ట్ర వ్యాప్తంగా 40 నుంచి 50కి పైగా స్థానాల్లో బలం కలిగి ఉన్నాయి. ఇప్పుడు ఈ రెండు పార్టీలు పొత్తు కుదుర్చుకోవడం వల్ల సమాన బలమున్న రెండు శక్తులు బరిలో దిగాయి. ఇక్కడ ఈ రెండు పార్టీలకు ఇబ్బంది పరిచే అంశం కూడా ఉంది. ఈ స్థానాల్లో రెండు పార్టీలకు సమాన బలముంది. అయితే ఈ నియోజకవర్గాల్లో ఏ పార్టీ నుంచి అభ్యర్థి పోటీ చేసినా.. మరో పార్టీకి చెందిన ఆశావహులు ఊరుకుంటారా..? ఓట్లు వేస్తారా.? అన్నదే ఇప్పుడు ప్రశ్న. ఉప ఎన్నికల్లో జరిగిన ఓట్ల బదిలీ మేలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో సాధ్యమవుతుందా.? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఎన్నికలకు మరో నాలుగు నెలల సమయమున్నందున ఆ లోపు అన్ని సమస్యలను ఈ రెండు పార్టీలు అధిగమిస్తాయని బీజేపీ వ్యతిరేక రాజకీయ పక్షాలు భావిస్తున్నాయి. అయితే రాష్ట్రంలో 15 నుంచి 20 స్థానాల్లో బలమున్న కాంగ్రెస్ ఈ కూటమిలో లేక పోవడం వల్ల కొంత నష్టం జరిగే అవకాశాలున్నాయని ప్రచారం జరుగుతోంది. అదే బీజేపీ మాత్రం రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో బలం కలిగి ఉండి, పొత్తుల బెడద లేకున్నా.. ఎస్పీ, బీఎస్పీ కూటమి ఏర్పడడం కలవర పరుస్తోంది.

త్రిముఖ పోటీతో మాకే లాభమంటున్న కమలనాథులు..?

కూటమిలో కాంగ్రెస్ లేక పోవడం వల్ల త్రిముఖ పోటీ జరిగితే.. తమకు లాభిస్తుందని బీజేపీ ఆశపడుతోంది. 2014 లోక్‌సభ ఎన్నికల్లో చతుర్ముఖ పోటీ. (తరువాయి 4లో)

నేటి నుంచి నామినేషన్ల పరిశీలన

- 16వ తేదీన విజ్ఞప్తుల పరిష్కారం

విజయక్రాంతి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలోని గ్రామ పంచాయతీ ఎన్నికల్లో రెండో విడత నామినేషన్ల పరిశీలన ప్రక్రియ పూర్తయింది. సోమవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం దాకా అయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో పరిశీలన ప్రక్రియ పూర్తి చేసినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. ఈ షెడ్యూల్ ప్రకారం రెండో విడతలో 4137 గ్రామ పంచాయతీలకు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. గ్రామ పంచాయతీల్లో సర్పంచు, వార్డు సభ్యులకు నామినేషన్ల ప్రక్రియ పూర్తయింది. నామినేషన్ల ప్రక్రియ పూర్తికాగానే నిబంధనల మేరకు సోమవారం నాడు నామినేషన్ల పరిశీలన అధికారులు చేపట్టనున్నారు. అదే విధంగా 15న రెవెన్యూ డివిజన్ అధికారుల (ఆర్డీఓ)కు పోటీ చేసే అభ్యర్థులు అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుంది. 16వ తేదీన అభ్యర్థుల అప్పీల్‌ను ఆర్డీఓలు పరిష్కరించనున్నారు. 17న అభ్యర్థులు తమ నామినేషన్లను ఉప సంహరించుకునేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం గడువు విధించింది. 25వ తేదీన పోలింగు ఉదయం 7గంటల నుంచి 1గంటల వరకూ కొనసాగనున్నది. అదే రోజు కౌంటింగ్ పూర్తి చేసి సాయంత్రం వరకూ ఫలితాలను ఆయా రిటర్నింగ్ అధికారులు ప్రకటించనున్నారు. రాష్ట్రంలో 12,732 గ్రామ పంచాయతీలు, 1,13,170 (తరువాయి 4లో)

ఒంటరిగా 80 స్థానాల్లో పోటీ

- యూపీపై కాంగ్రెస్ క్లారిటీ
- గులాంనబీ ఆజాద్ వెల్లడి



లక్నో: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లో ఒంటరిగా పోటీచేసేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమైంది. ఎస్పీ, బీఎస్పీ కూటమి ప్రకటన అనంతరం తన వైఖరిని పార్టీ స్పష్టం చేసింది. యూపీలోని మొత్తం 80 స్థానాల్లో పోటీ చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత గులాంనబీ ఆజాద్ వెల్లడించారు. ఆదివారం లక్నోలోని పార్టీ కార్యాలయంలో ఆ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు రాజ్ బబ్బర్‌తో పాటు పార్టీ ముఖ్య నేతలతో ఆయన చర్చించారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. (తరువాయి 4లో)

పంచాయతీ ఎన్నికలపై టీఆర్ఎస్ ఫోకస్

- అత్యధిక స్థానాల్లో గెలుపు కోసం యత్నం
- ఎమ్మెల్యేలకు బాధ్యత



విజయక్రాంతి, హైదరాబాద్: తెలంగాణలో జరుగుతున్న గ్రామ పంచాయతీల్లో అత్యధిక పంచాయతీలను కైవసం చేసుకునేందుకు అధికార టీఆర్ఎస్ పార్టీ కసరత్తు చేస్తున్నది. ఆదివారం సాయంత్రం నాటికి తొలి విడత నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ పూర్తికానున్నది. గడువులోగా వీలైనన్ని సర్పంచుల అభ్యర్థులను ఏకగ్రీవం చేసేందుకు ప్రయత్నాలు చేయాలని అయా నియోజకవర్గ ఎమ్మెల్యేలకు బాధ్యత అప్పగించినట్లు తెలిసింది. దీంతో ఇప్పటికే సుమారు 500లకు పైగా గ్రామ పంచాయతీల్లో సర్పంచులు ఏకగ్రీవమైతే, వాటిలో 370 పంచాయతీలకు పైగా టీఆర్ఎస్ పార్టీ దక్కించుకున్నట్లు తెలిసింది. దీన్నిబట్టి అధికార పార్టీ పంచాయతీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నట్లు తెలుస్తుంది. టీఆర్ఎస్ పార్టీ రెండోసారి అధికారంలోకి వచ్చినప్పటికీ సంస్థాగతంగా ఆ పార్టీకి పట్టులేదు. దీంతో పంచాయతీ ఎన్నికల్లో పూర్తి స్థాయిలో పట్టుసాధించి పార్టీని బలోపేతం చేయాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భావిస్తున్నారు. (తరువాయి 4లో)

ఇక యుద్ధ ప్రాతిపదికన.. అభివృద్ధి కార్యక్రమాలు



- హామీల అమలుపై సీఎం దృష్టి
- అధికారులతో సమీక్ష
- బడ్జెట్‌లో తగిన ప్రాధాన్యత
- సమగ్ర ప్రణాళికపై కసరత్తు

విజయక్రాంతి, హైదరాబాద్: రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలును యుద్ధ ప్రాతిపదిక పై అమలు చెయ్యాలన్న కృత నిశ్చయంతో ముఖ్యమంత్రి ఉన్నట్లు తెలుస్తోంది. నీటి పారుదల ప్రాజక్టులను సకాలంలో పూర్తి చెయ్యటానికి నడుం బిగించిన ఆయన రైతులు ,కార్మికులకు మేలు చేసేందుకు గతంలో ఇచ్చిన హామీల అమలుకు శ్రీకారం చుడుతున్నారు. అభివృద్ధి కార్యక్రమాలపై సీఎం కేసీఆర్ స్పష్టమైన వైఖరి ఉండటంతో వాటి అమలుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. రెండోసారి అధికారంలోనికి వచ్చిన తరువాత ప్రవేశపెడుతున్న బడ్జెట్‌లో తన ప్రాధాన్యతలను తెలియచెప్పాలని, దానికి అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని ఆయన అధికారులు ఆదేశించారు. అభివృద్ధి కార్యాక్రమాల అమలు లో అలసత్వం ఉండకూడదని, అధికారుల నియామకం, ఇతర విషయాలలో రాజకీయ జోక్యం కూడా ఉండదని, అధికారులు నిబద్ధతతో పనిచేయాలని ఆయన దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. ఉద్యమ సమాయాలలోను, ప్రభుత్వం ఏర్పాటైన తరువాత రైతులకు, కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చెయ్యటంపై ముఖ్యమంత్రి దృష్టి సారించినట్లు తెలిసింది. రాష్ట్రంలో మూత పడ్డ పరిశ్రమలును తిరిగి తెరిపించటం, వ్యవసాయదారులకు, చేనేత కార్మికులకు మేలు చెయ్యటానికి అవసరమైన చర్యల పై సమగ్ర ప్రణాళికలు తయారు చెయ్యాలని ఆయన అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. ముఖ్యంగా చేనేత కార్మికులకు మేలు చేసేవిధంగా మెగా పార్కులు ఏర్పాటు చెయ్యటం, మూతపడ్డ అజాంజాహీ మిల్లుల పునరుద్ధరణ. ఇది సాధ్యం కాకపోతే స్పిన్నింగ్ మిల్లులు కొత్తగా ఏర్పాటు చెయ్యడం,నిజామ్ చక్కర కర్మాగారం పునరుద్ధరణ, బయ్యారం ఉక్కు కర్మాగారం ఏర్పాటు, ఫార్మా రంగంలో కొత్త పెట్టుబడులకు గల అవకాశాలపై నివేదికలను తయారు చేయాలని ఆయన అధికారులకు సూచించినట్లు తెలిసింది. రెండోసారి అధికారంలోనికి వచ్చిన తరువాత ప్రవేశపెడుతున్న రాష్ట్ర బడ్జెట్లో వీటిపై స్పష్టమైన విధానం ప్రకటించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి ఉన్నారని సీనియర్ అధికారులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యమంత్రి సూచనలకు అనుగుణంగా అవసరమైన ప్రణాళికలను తయారు చెయడానికి అధికారులు చర్యలు ప్రారంభిస్తున్నారు. ముఖ్యంగా రైతులు, కార్మికులకు మేలు చేసే పథకాలు, విద్య, వైద్య, ఆర్యోగ్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలనే ఆలోచనలో ముఖ్యమంత్రి ఉన్నారని, దానికి అనుగుణంగా బడ్జెట్ రూపకల్పన జరుగుతుందని ఆర్థిక శాఖ (తరువాయి 4లో)

ఆమె స్థానంలో ఎవరున్నా ఇలాంటి వ్యాఖ్యలే చేసేవాడ్ని



- సీతారామన్‌పై ‘ స్త్రీ ద్వేషం’ వ్యాఖ్యలన్న విమర్శలపై రాహుల్ స్పందన

న్యూఢిల్లీ: రఫేల్ ఒప్పందం నేపథ్యంలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సమర్థించుకున్నారు. ‘స్త్రీ ద్వేషం’ చాటుకుంటూ ఆమెపై వ్యాఖ్యలు చేశారన్న విమర్శలను ఆయన కొట్టివేశారు. నిర్మలా సీతారామన్ స్థానంలో ఎవరున్నా ఇలాంటి వ్యాఖ్యలే చేసే వాడినని దుబాయ్ లో జరిగిన మీడియా సమావేశం సందర్భంగా రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. సీతారామన్‌కు బదులుగా ప్రధాని మోదీ రఫేల్ ఒప్పంద పత్రాలను పార్లమెంటులో సమర్పించాలని డిమాండ్ చేశారు. మోదీ స్వయంగా లోక్‌సభకు వచ్చి తనను తాను డిఫెన్స్ చేసుకుని ఉండవచ్చని, అయితే ఆయన తనకు బదులుగా మరొక వ్యక్తిని పంపారని, ఆ వ్యక్తి మహిళ కావడం యాదృచ్ఛికమని రాహుల్ అన్నారు. ఆమె బదులు అక్కడ మగవాళ్లున్నా తాను అదే తరహా వ్యాఖ్యలు చేసి ఉండేవాడినని అన్నారు. ‘ప్రధాని ఈ ఒప్పందం ద్వారా రూ.30 వేల కోట్లు దోచుకొనేలా అనిల్ అంబానీకి సహకరించారు. పార్లమెంటులో ఇతరులతో మాట్లాడించకుండా మోదీ స్వయంగా లోక్‌సభకు వచ్చి రఫేల్ అంశంపై మాట్లాడాలి. సీతారామన్ స్థానంలో మరో వ్యక్తి ఉన్నా నేను ఇలాంటి వ్యాఖ్యలే చేసేవాడిని. అసలు విషయాన్ని పక్కదోవ పట్టిస్తున్నారు. రఫేల్ ఒప్పందంపై మాట్లాడటానికి ప్రధానికి ధైర్యంలేదు.’ అని తీవ్రంగా రాహుల్ గాంధీ మండిపడ్డారు. గత బుధవారం రాజస్థాన్‌లోని జోథ్‌పూర్‌లో ర్యాలీ సందర్భంగా కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ప్రధాని మోదీపై విమర్శలు చేశారు. ‘56 అంగుళాల ఛాతీ ఉన్న కాపలాదారు తప్పించుకు తిరుగుతూ ఓ మహిళతో (సీతారామన్) నన్ను మీరే కాపాడాలి. నన్ను నేను కాపాడుకోలేకపోతున్నాను. నన్ను కాపాడాలి’ అని వేడుకున్నారు..’ అంటూ రాహుల్ ఎద్దేవా చేశారు. కాగా ఈ వ్యాఖ్యలపై బీజేపీతో పాటు ప్రధాని మోదీ కూడా తీవ్రంగా స్పందించారు. ‘మొదటి సారి భారత పుత్రిక రక్షణ మంత్రి హోదాలో పనిచేస్తున్నారు. ఆమె పార్లమెంటులో రఫేల్ ఒప్పందం మీద ప్రతిపక్షాల నోర్లు మూయించారు. కానీ వారు మాత్రం మహిళా శక్తిని అవమానించారు’ అని ఆగ్రా పర్యటన సందర్భంగా ప్రధాని మండిపడ్డారు. మరోవైపు రాహుల్ వ్యాఖ్యలపై జాతీయ మహిళా కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆయన వ్యాఖ్యలు మహిళలను కించపరచేలే ఉన్నాయంటూ నోటీసులు పంపింది. ఈనేపథ్యంలో దుబాయ్‌లో పర్యటన సందర్భంగా నిర్మలా సీతారామన్‌పై తన వ్యాఖ్యలను రాహుల్ గాంధీ సమర్థించుకున్నారు.

దిమాక్ ఖరాబ్



న్యాయం పక్షమే మనమంతా ఉండాలి

- సిక్కుల గురువులు ఇదే బోధించారు
- మన్మోహన్ సింగ్ పై ప్రధాని ఎత్తిపొడుపులు
- గురు గోవింద్ స్మారక నాణేలు విడుదల చేసిన మోదీ

4



ప్రపంచ బ్యాంకు అధ్యక్ష రేసులో ఇవాంక !



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ గారాలపట్టి ఇవాంక ట్రంప్ ప్రపంచ బ్యాంక్ అధ్యక్ష పదవి రేస్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ఈమేరకు ఓ ఆంగ్లపత్రిక వెల్లడించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ కుమార్తె ఇవాంక ట్రంప్, యునైటెడ్ నేషన్స్ మాజీ అంబాసిడర్ నిక్కీ హేలీ రేస్‌లో ప్రధానంగా కనిపిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో అమెరికాయేతరులకు ఈ పదవి అప్పగించేందుకు అగ్రరాజ్యం ఆసక్తి చూపకపోవచ్చు.

మన సంస్కృతిని కాపాడుకుందాం

- కైట్స్, స్వీట్స్ ఇంటర్నేషనల్ ఫెస్టివల్ ప్రారంభం
- రాష్ట్రప్రభుత్వానికి అభినందనలు తెలిపిన ఉపరాష్ట్రపతి

4






శుభోదయం

ఓం శ్రీ గురుభ్యోనమః

శ్రీ విళంబి నామ సంవత్సరం	సూర్యోదయం	: ఉ. 06:49	కరణం	: విష్టి 12:15 బవ 24:37	
దక్షిణాయణం	సూర్యాస్తమయం	: సా. 06:00	రాహుకాలం	: ఉ. 08:16, 09:39	
హేమంత ఋతువు	పక్షము	: శుక్ల పక్షం	యమగండం	: ప. 11:02, మ. 12:25	
పుష్య మాసం	తిథి	: అష్టమి 24.37	వర్జ్యం	: లేదు	
	నక్షత్రం	: రేవతి 12.53	అమృతకాలం	: ప. 10:18, మ. 12:01	
	యోగం	: శివ 07:31			



సూక్తి సుధ



శ్రద్ధ ఉన్నవాడే సర్వం ఉన్నవాడు. కానీ శ్రద్ధ లేనివాడు ఏమీ లేనివాడే...

-షిర్డీ సాయి



తిరుప్పావై పాశురం-30

వఙ్గక్కడల్ కడైన్ద మాధవనై క్కేశవనై
త్తిఙ్గళ్ తిరుముగత్తు చ్చేయిళైయార్ శెన్ఱిఱైఞ్జి
అఙ్గప్పఱైకొణ్ణవాత్తై, యణపుదైవ
పెఙ్గమలత్తణ్డెరియల్ పట్టర్‌పిరాన్ కోదైకొన్న
శఙ్గత్తమిళ్ మాలై ముప్పదుమ్ తప్పామే
ఇఙ్గప్పరిశురై ప్పా రీరిరణ్డు మాల్వరైత్తోళ్
శెఙ్గణ్ తిరుముగత్తు చ్చెల్వ త్తిమాలాల్
ఎఙ్గుమ్ తిరువళుమ్ పెత్తిమ్బుఱున రెమ్బావాయ్



'చెక్కతో చేయబడిన ఓడలు గల పాల సముద్రం మధించి దేవతలకు అమృతాన్ని ప్రసాదించిన వాడు, బ్రహ్మరుద్రులకు ప్రభువగు శ్రీమన్నారాయణుని, పూర్ణచంద్రుని పోలిన అందమైన ముఖం, చక్కని ఆభరణాలు ధరించిన గోపికలు వెళ్ళి మంగళాశాసనం గావించి, గోకులంలో పరయను సాకుతో కైంకర్యాన్ని పొందిన విధానాన్ని, భూమండలానికి అలంకారంగా ఉన్న శ్రీవిల్లిబుత్తూరులో అవతరించి చక్కని తామర పూసలతో గూర్చబడిన మాలలను ధరించిన బ్రాహ్మణోత్తములగు పెరియాళ్వారుల(విష్ణుచిత్తుల) పుత్రిక అగు ఆండాళుతల్లి సాయించినది. గోపికలు సంఘాలుగా చేరి అనుభవించినది ప్రబంధంగా ద్రవిడ భాషలో మాలారూపంగా ఉన్న 30 పాశురాలను ఒక్కదానిని కూడా వదలక అన్ని పాశురాలను ఈ సంసారంలో అనుసంధించువారు, గొప్ప పర్వతాల వలె ఉన్న నాలుగు భుజాలు, ఆశ్రితుల విషయంలో తనకు గల వాత్సల్యంతో ఎఱ్ఱబడిన కన్నులు, అందమైన ముఖం, ఉభయ విభూతులకు అధినాయకత్వం గల శ్రియఃపతిచే దృష్టాదృష్టాల విషయంలో సాటిలేని కృపను, బ్రహ్మానందం గలవారుగా ఉందురు.'

మనం పొందవలసిన ముఖ్యమగు పురుషార్థం మోక్షం. ఇదియే అమృతం. శాస్త్రమే మహాసముద్రం. శాస్త్రంను మధించిన వారికే మోక్ష స్వరూపం తెలియును. తెలిసిన వారికే లభించును. మన బుద్ధియే మందరం. అనుకూల ప్రతికూల శక్తులు దైవీ, అసురీ సంపదయే దేవదానవులు. మందరంను గొనివచ్చి సముద్రంలో గరుడునితో వేయించింది స్వామియే. 'దదామి బుద్ధియోగం తం' అని 'మత్త స్మృతిర్జ్ఞాన మపోహనం చ' అని చెప్పటంతో స్వామియే బుద్ధిని ప్రసాదించాలని, అది ఆచార్య ముఖతః కలుగును కావున ఆచార్యుడనగా గరుడుడు కావున ఆచార్యుని ద్వారా స్వామి బుద్ధిచ్చును అని మందర పర్వత వృత్తాంతాన్ని తెలుపుచున్నది.

పూర్వాచార్యులు ఇట్లు వ్యాఖ్యానం గావించిరి.

సంసారం మహాసముద్రం. శరీరాలు నావ, భగవత్సంకల్పం మందరం, భగవత్కృప తాడు, భగవత్కటాక్షం చేతులు, పిరాట్టి(లక్ష్మి) ఆత్మవస్తువు. ఇట్లు పరమాత్మ తన సంకల్పాన్ని మందరంకు కృప అను తాడుకట్టి, కటాక్షాలనే చేతులతో సంసార సాగరాన్ని మధించి, తనకు ప్రియమైన ఆత్మను పొందెను. చేతనులు, పరమాత్మకు కౌస్తుభమణి వంటివారు. తాము చేసుకున్న పుణ్య పాపాల వల్ల, సంసార సాగరంలో పడిరి. అట్లు పడిన వారు గత్యంతరం గానక అలమటిస్తుండగా భగవంతుని నిర్హేతుక కృపాకటాక్షమాతనిపై పడును. దానికి సత్త్వముద్బుద్ధమై భగవత్ప్రాప్తికి అరలు చాస్తుండెను. ఇదే సముద్ర ఘోష. పరదుఃఖం సహించలేని పరమాత్మకు ఈ ఘోషతో కృపకలుగును. ఈ కృపయే భగవత్సంకల్పం వైపు తిప్పును. అట్లు వారి హృదయంలో జ్ఞానజ్యోతిని వెలిగించి అజ్ఞానాంధకారం నుండి తొలగించు జీవులు తమను పొందుటకు ఉపకరించు భక్తియోగాన్ని తానే అనుగ్రహింటాన్ని అమృత మథనం అని, ఆ విధంగా భగవత్ప్రాప్తి అనే అమృతం లభించును. ఇదే మోక్షం. ఇట్లు మోక్షాన్ని ప్రసాదించమని పరమాత్మను ప్రార్థించుట, ఈ తిరుప్పావు వ్రతం నాచరించిన వారికి ఈ అమృతం లభించునని ఫలశ్రుతిగా అమ్మవారు అనుగ్రహిస్తున్నారు.

వేదం సముద్ర జలంలా స్వతస్సిద్ధమైంది. తిరుప్పావై ప్రబంధం గోదాదేవి ముఖారవిందం నుండి వెలువడింది కావున మేఘ జలం వంటిది. మేఘం సముద్రం నుండి ఉప్పునీటిని తీసుకొని అత్యంత మధురజలాన్ని మనకు కురియును. ఈ గోదామేఘం సకలోపనిషత్సిద్ధమగు అర్థాలను గ్రహించి సకల జనులకు అర్థమగు రీతిని సరళ శైలిలో అమృతోపమానంగా వర్ణించింది. ఇదే తిరుప్పావు ప్రబంధ వైభవం.

ఈ ముప్పది పాశురాలు తప్పక అనుసంధానం చేసిన తెలియనగు అంతరార్థమిది.

1. పరమాత్మపై మనకు అభిముఖ్యంను కలిగించు బ్రాహ్మీ ముహూర్త ప్రభావాన్ని తప్పక తెలియవలెను.
2.చేయవలసిన దానిని చేయకూడని దానిని తెలియవలెను.
3. 'లోకాస్సమస్తాః సుఖినో భవంతు' అని సకలలోక కళ్యాణంను త్రికరణశుద్ధిగా కాంక్షించుచుండాలి.
4. జ్ఞానులగు పరమ భాగవతోత్తములు, దేవతలను కూడా శాసించగలరని తెలియాలి.
5. 'భగవంతుని ఉపాయంగా ఆశ్రయించిన క్షణానే సకల పాప నివృత్తి జరుగును' అని తెలియాలి.
6. భగవద్విషయంలో అప్పుడే ప్రవేశించినవారైననూ
7. భగవద్విషయంలో ప్రవేశించి కూడా కొరత తీరని వారైనను
8. కీర్తిని ప్రధానంగా కోరువారననూ
9. విడువదగినది కొద్దిగా మాత్రమే తెలిసిన వారైనను
10. నిరంతరానుభవనన్న వారైనను
11. భాగవతవంశ సంబంధం గలవారైనను
12. కైంకర్య నిష్ఠలతో, సంబంధం కలవారిని
13. స్వరూపాన్ని, జ్ఞానంలోని వైలక్షణ్యాన్ని సంధాన పూర్వకంగా కార్యశూన్యులుగా ఉన్నవారిని
14. భక్తిపరాకాష్ఠతో కలత చెందుతున్న వారిని
15. భాగవత పారతంత్ర్య నిష్ఠనే ముఖ్యంగా పాలించు వారైనను, ఇట్టి వారంతా మనకు ప్రాప్యులే అను దృఢ నిశ్చయం లోపించరాదు. ఇవి అన్ని తెలియాలి.
16. భగవంతుని సమీపించు విధానం తెలియాలి.
17. 18,19,20 – పాశురాలలో పురుష కారణభూతుల స్వరూప స్వభావాలను బాగా తెలిసిన వారి విషయాన ప్రవర్తించు విధిని తెలియాలి.
21. భగవంతుని కళ్యాణగుణాలను తెలిసి ఆనంద పారవశ్యం చెందాలి.
22. అభిమానం పూర్తిగా విడిచి భగవత్కటాక్షైక పాత్రులు కావాలి. ఆ కటాక్షమే తారకంగా భావించాలి.
23. భగవంతుని మాకు అభిముఖుడవు కావలసిందిగా ప్రార్థించాలి.
24. మంగళాశాసన తత్పరులు కావలి.
25. మేము వచ్చింది నిన్ను పార్థించుటకే అని తెలిసేట్లు నైచ్యాన్ని కనబరచాలి.
26. మోక్షాపేక్ష ఉన్నప్పుడు కావలసిన వానిని కోరాలి.
27. ముక్తుడైన యవస్థలో అనుభవించదగిన పదార్థాలను కోరాలి.
28. ఆ ఫలాన్ని పొందటానికి మాకు అభ్యంతరం లేదని తెలియజేయాలి.
29. నిత్యకైంకర్యంలో తమకున్న అనన్యాపేక్షను విడువకుండా ఉండాలి.
30. ఈ స్థితిని పొందిన భాగవతోత్తముల శ్రీసూక్తి ఆనందదాయికంగా భావించుచుండును.

ఇవి 30 దినముల ప్రణాళిక – లేదా 30 పాశురాల భావం. ఈ వ్రతానికి అంతరార్థ పరమార్థం కూడా అందుకే 30 పాశురాలను తప్పకుండా అనుసంధానం చేయాలి. అనగా ఈ 39లో ఏ ఒక్క సోపానంను తప్పినా వ్రతభంగమైనదే. కావున ఈ విధానాన్ని అనుసరించిన స్వామి అనుగ్రహాన్ని పొందుతాము అని ఫలశ్రుతిగా పేర్కొనబడింది..

ఇట్లు అన్ని ఫలాలు సిద్ధించుటచే ఈ ప్రబంధాన్ని అధ్యయనం చేసినవారు ఆనంద నిర్భరులగుదురు. ఈ లోకంలో ఉండు సంసారులందరి కంటే విశిష్ఠమగు స్థితి అనుభవింతురు. ఇక ఈ లోకాన్ని విడిచి పరమపదానికి వెళ్ళిన, సర్వకాలంలో భగవత్సంశ్లేషాన్ని చెంది పరమానందాన్ని పొందెదరు. శ్రీమన్నారాయణ కృపాపాత్రులై ఆనందాన్ని అనుభవించుటకు, సాధనాంతరాలను విడిచి ఈ వ్రతాన్ని ఆచరించుట ఈ ప్రబంధం అధ్యయనం చేయుటచే కావలసింది అన్ని వయస్సుల వారు, అన్ని ఆశ్రయముల లోని వారు అన్ని వర్ణాలవారు, స్త్రీలు, పురుషులు కూడా భగవంతుని శరణు పొందినవారై ఈ వ్రతాన్ని ఆచరించినవారు కోరిన ఫలాన్నంతటినీ పొందగలరు.

అవివాహితలగు కన్యలు ఈ వ్రతాన్ని ఆచరించిన లేదా ఈ 30 పాశురాలను చదువినా గోపికలు శ్రీకృష్ణుని, గోదాదేవి రంగనాథుని పొందినట్లు యోగ్యుడగు భర్తను పొందెదరు.

కర్మయోగులకు కర్మనిష్ఠ, జ్ఞాన యోగులకు జ్ఞాన యోగ నిష్ఠ, భక్తులకు భక్తినిష్ఠ. ఈ వ్రతాచారంలో లేదా ఈ ప్రబంధాధ్యయనంతో ఏర్పడును. భగవంతుని పొందాలనే కోరిక కలవారికి, భగవత్కైంకర్యం చేయు కోరిక కలవారికి ఈ వ్రతమందే లేదా అప్రబంధాధ్యయనంతో భగవత్ ప్రాప్తి భగవత్కైంకర్యం కూడా లభించును.

ఇట్లు అన్ని ఫలాలను ప్రసాదించు ఈ వ్రతాన్ని గోదాదేవి తానాచరించిన విధానాన్ని ముప్పది పాశురాలుగా జీవులను తరింపచేయుటకు అనుగ్రహించింది. మనం గోదాదేవివలె, వ్రతం చేయజాలకున్ననూ స్వచ్ఛమైన మనస్సుతో ముప్పది పాశురాలు విడువక చదువువారికి గోదాదేవికి లభించిన ఫలమంతా లభించును. ఇక ఈ తిరుప్పావునందు తిరుమంత్రార్థ వివరణ కూడా కలదు. చూడుడు:–'ఊళిముదల్వాన్' అనునది ఆకారార్థమగు కారణత్వం. 'ఉనక్కే' అనుదానివల్ల ఉకారార్థమగు అనన్యార్హ శేషత్వం. 'నమక్కే' అనుదాని వల్ల మకారార్థం ప్రకృతి విలక్షణమగు శేషభూతుడగు ఆత్మస్వరూపం చెప్పబడింది కావున ఇట్లు ప్రణవార్థం సూచించబడింది.

'తూయోమాయ్ వందునామ్', తూయోమాయ్ వందోమ్, 'అభిమాన భంగమాయ్ నందు' మత్తైనంకా ముంగళ్ మాత్తు' ఇత్యాది వాక్యాలతో నమశ్శబ్దార్థమగు పారతంత్రం సూచించబడింది.

'కదిర్ మదియంబోల్ ముగత్తాన్' 'నారాయణనే' 'నారాయణన్ మూర్తి' అని చెప్పటంతో నారాయణ శబ్దార్థం సూచించబడింది. 'ఉరవేల్ నమక్కు' 'ఇంగొళిక్కవళియాదు' అని చెప్పటంతో నారాయణ శబ్దార్థంగా పేర్కొనబడిన సకల విధబంధుత్వం 'ఎత్తూక్కుం, ఏళేళుపిరవిక్కుం ఉందన్నోడుత్తేమే యావోం, ఉనక్కేనా మట్చెయ్ వోం' అను వాటివల్ల నారాయణ పదంలో ఉన్న చతుర్థీ విభక్తి అర్థమగు కైంకర్యం కూడా సూచిస్తే తిరుప్పావు తిరుమంత్రార్థ వివరణమవుతుంది.

ఇట్లే 'కరవైగళ్ పిన్ శొన్ను' అను పాశురాన 'సర్వధర్మాన్ పరిత్యజ్య' అని ప్రపత్తికి అంగంగా చెప్పబడిన కర్మయోగాదులందలి ఉపాయబుద్ధి పరిత్యాగాన్ని, 'ఉన్నేయరుత్తిత్తు వందోమ్' అను దానివల్ల 'శిత్తుం శిరుకాలే వందున్నైసేవిత్తు' అను దానివల్ల 'మామేకం శరణం వ్రజ' అను వాక్యార్థం సూచిస్తోంది. 'వాయినాల్పాడి మనత్తివాల్ శిందిక్క' 'పోయ్ పిళయుం పుగుదరువా నిన్ననవుం' అను వాక్యం వల్ల 'అహంత్వా సర్వపాపేభ్యోమోక్ష యిష్యామి' అను వాక్యార్థం. 'వరుత్తముంతవిరిన్దు ముగిళిన్దు' అను దానివల్ల 'మాశుచః' అను అర్థం సూచించింది. కావున తిరుప్పావు చరమమంత్ర సారంగా బోధించిందని తెలియాలి.

ఇట్లే ఈ తిరుప్పావు ద్వయమంత్ర వివరణ అనునది సంప్రదాయార్థం.

'వప్పిన్న నంగాయ్ తిరవేతయిలెళాయ్' అనుదానిలోని 'తిరవే' అను పదంతో శ్రీశబ్దార్థం, 'ఎత్తనయేలుంపిరి వాత్త గిల్లాయాల్' అనుటచే మతుప్ ప్రత్యర్థామైన నిత్య సంబంధం, 'ఓంగియుళగళంద' అను పాశురాన స్వామి, సౌశీల్యం తెలియచేసింది. 'తాయైక్కుడల్ విళక్కుంసెయ్‌ద దామోదారనై' అను దానితో సౌలభ్యం 'దేవాదిదేవనై శెన్నునాం సేవిత్తాల్' అనుదానితో స్వామిత్వం 'శెప్పముడయామ్ తిరలుడయామ్' అను పదాలతో ఆర్జవం చెబుతోంది.

'ఆలినిలయాయ్' అను దానివల్ల అఘటిత ఘటనా సామర్థ్యం 'కుఱైవొన్ను మిల్లాద గోవిందా!' అను దానితో వాత్సల్యం తెలుపుట వల్ల నారాయణ పదార్థం వివరిస్తోంది. 'పాల్కడలుల్ వయత్తుయిన్న పరమావడిపాడి', 'ఓంగియుళగళంద', 'అంబర మూడరుత్తో', 'అన్నివ్వలుగ మళందాయ్' అను వాక్యాల వల్ల చరణ శబ్దార్థం వివరిస్తోంది. 'కార్మేనిచ్చెంగణ్ కదిర్ మదియంబోల్ ముగత్తాన్' 'ఊళిముదల్వ నురువంబోలః మెయ్‌కరిత్తు' 'ముగిల్ వణ్ణన్ పేర్ పాడి' 'శంగోడు శక్కరమేందుంత డక్కైయన్' 'పంగయక్కణ్ణానై' అను వాక్యాల వల్ల దివ్యమంగళ విగ్రహ విశిష్టత్వం వివరిస్తోంది. 'కురెవొన్ను మిల్లాద గోవిందా అనుదాని వల్ల కళ్యాణ గుణ విశిష్టుడగు నారాయణుని ఉపాయత్వపరిపూర్తి, అరివొన్ను మిల్లాద వాయర్‌క్కులత్తు, అరియాదపిళ్ళైగలోం' అను వాటి వల్ల అధికారి స్వరూపమగు ఆకించన్యం వివరిస్తోంది.

'తూయోమాయ్ వందునాం', 'తీయినిల్ తూ శాగుం' అని 'వందుతలైప్పెయ్‌దోం' అను వాటివలన అనిష్టనివృత్తిని ఇష్టప్రాప్తిని కలిగించు ఉపాయంగా స్వీకరించుట అను ఉపాయ వరణం 'ఆవావేన్నారా యందరుల్' 'అంగణిరండుంగొండు', 'ఎంగళ్ మేల్ నోక్కదియెల్' అని 'ఇఱైవానీతారాయ్ వఱై' అని పరగత స్వీకార వైభవం వివరిస్తోంది. 'నాత్తత్తుళాయ్‌మొడి నారాయణన్' అని, 'దేవాది దేవనై', అని 'ఉంబర్ కోమానై' అని ద్వయ మంత్రం లోని ఉత్తరార్థమందలి నారాయణ పదంతో తెలిపే శేషిత్వం వివరిస్తోంది. ఉక్కముంతట్టొళియుంతందుణ్మణాళనై, ఇప్పోదేవీరాట్టు', 'మాలే మణివణ్ణా', 'కూడారై వెల్లుంశీర్' అను వాటివల్ల ఉత్తర వాక్యంలో నారాయణ పదంలోని చతుర్థీ విభక్తిచే తెలిపే కైంకర్యోపకరణాలు తెల్పుతున్నాయి. 'ఉనక్కేవామాట్చెయ్ వోం', 'మత్తనంకా మంగళ్‌మాత్తు' అనువాటి వల్ల నమః పదం తెలిపే కైంకర్య విరోధి నిరసన ప్రార్థన వివరిస్తోంది. ఇట్లు తిరుప్పావు ప్రబంధం సమగ్రంగా ద్వయమంత్రార్థ వివరణమని బోధపడుతున్నది. ఇట్లు గురపరంపరానుసంధాన పూర్వకంగా ద్వయమంత్ర తిరుమంత్ర చరమంత్రార్థాలను ఈ ప్రబంధం ఉపదేశిస్తోంది. అందువల్లే ఉడయవరులు ఈ ప్రబంధాన్ని ప్రతినిత్యం అనుసంధానం గావిస్తూ 'తిరుప్పావై జీయర్' అను తిరునామాన్ని పొందారు.



అందువల్ల ఈ తిరుప్పావై ప్రబంధాన్ని పొందారు. అందరూ ప్రతి నిత్యం, అనుసంధానం గావిస్తూ గోదా రంగనాథుల రామానుజుల ఆళ్వారుల అనుగ్రహం పొంది తరించెదరు.

– డా|| బాలుశర్మ పన్నాల
(వేద పండితులు)



భోగి.. భాగ్యవైభోగి..!

''మనసులోని మాలిన్యాన్ని దహించి జ్ఞానాన్నిచ్చి భగవంతునిలో ఐక్యమయ్యేందుకు దోహదపడే జ్ఞానాగ్నే భోగి''

'భుజ్' అనే సంస్కృత ధాతువు నిష్పన్నమే భోగి అని, ఇది ఇంద్రుని ప్రీతికోసం చేస్తారని చెప్తారు. ప్రముఖ పరిశోధకులు శ్రీ తిరుమలరామచంద్ర మాత్రం పోగు, పొంగు అనే ద్రావిడధాతుల సంస్కృతీకరణమే భోగి అయ్యిందని అభిప్రాయపడ్డారు. నిఘంటువులు 'భోగి' అనే మాటకు 'పండుగ తొలినాడు' అని అర్థాలను చెప్తున్నాయి. "రైతులకు పంట పర్యాయాలు ముగిసి, వాళ్లకు వ్యవసాయ పనుల రద్దీ తగ్గి సుఖంగా కాలక్షేపం చేయటానికి కావలసిన విశ్రాంతి చేకూరుతుంది. చేతికందిన పంటను అనుభవానికి తెచ్చుకొని భోగభాగ్యాలు అనుభవించే కాలం కాబట్టి దీనికి భోగి పండుగ అనే పేరు వచ్చి ఉంటుంది" అని ప్రముఖ పండితులు శ్రీ జగదీశ్వర అయ్యరు అభిప్రాయపడ్డారు.



భోగిమంటలు – బోడలు పోయడం

భోగి పండుగరోజు ఉదయాన్నే అందరూ లేచి అభ్యంగన స్నానం చేస్తారు. ఈ స్నానంతో భోగి పీడ వదిలినట్లు భావిస్తారు. ఇంట్లో అందరూ భగవంతుని అర్చిస్తారు. ఇంట్లో వ్యర్థంగా పడివున్న పేడ ముక్కల(పిడకలు)తో "భోగిమంటలు" వేస్తారు. ఉత్తరభారతంలో ఈ మంటల్ని 'లోడి' అంటారు. ఆ మంటల్లో మనలోని అరిషడ్వర్గాలను కాల్చివేస్తున్నట్లుగా భావిస్తారు. చలిని భోగిమంటల ద్వారా కాచుకుంటారు. పంటల నుంచి లభించే కంకులతో గృహాన్ని అలంకరిస్తారు. సాయంత్రం రేగిపండ్లు, చెరుకు ముక్కులతో చిన్న పిల్లలను కూర్చోబెట్టి తలపై నుంచి పోస్తారు. దీనిని 'బోడలు పోయడం' అని పిలుస్తారు. 5 సంవత్సరాల వయస్సు నిండని పిల్లలను సాయంకాలంవేళ కొత్తవస్త్రం పరచి దానిపై పీటలు వేసి కూర్చోబెట్టాలి. రేగిపండ్లు, నానినశనగలు, పసుపుబియ్యం(అక్షతలు), పూలు, చెరుకు ముక్కలు, నాణేలు, పళ్లంలో పోయాలి. దీనివల్ల పిల్లలకు వచ్చే 'దృష్టిదోషాలు'(దిష్టి) పోతాయని నమ్మకం. భోజనం చేసిన తరువాత రేగుపండ్లు తినడం వల్ల ఈ పండులోని పీచు పదార్థం మలబద్ధకాన్ని తొలగిస్తుంది. ఈ విజ్ఞానం పిల్లలకు కలిగించడం, 'గురుబలం' పెరగడం కోసం శనగలను ఈ బోడలు పోయడంలో చేర్చారని జ్యోతిశ్శాస్త్రవేత్తలు అభిప్రాయం.

భగవంతునిలో ఐక్యం



తమిళనాడులోని వళ్ళిపుత్తూరులో గోదాదేవి రంగనాథుడికి గొప్ప భక్తురాలు. ఆమె చెప్పిన పాశురాలను 'తిరుప్పావై' అని పిలుస్తారు. వాటితో ఆమె ధనుర్మాసంలో రంగనాథుణ్ణి ఉపాసించింది. ఆమెకు స్వామివారి అనుగ్రహం లభించి, సశరీరంగా స్వామిలో ఐక్యం అయింది. ఇలాంటి మహామహిమాన్వితమైన భోగభాగ్యాలు నడిచిన ఈ రోజు 'భోగి' అని పండితుల అభిప్రాయం. శ్రీ వళ్ళిపుత్తూరులోని ఆండాళ్ దేవి గుడిలో ఈ మార్గశిర మాసం అక్కడ ఎంతో వైభవంగా ఆండాళ్ వివాహం జరుగుతుంది. శ్రీ వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవంలో, ఈ మార్గశిర మాసంలో కూడా ఆండాళ్ దగ్గర నుంచి పూలమాలలు, రామచిలుక బొమ్మలు పంపిస్తారు. వాటినే శ్రీవారికి అలంకరిస్తారు.కేరళలోని త్రివేండ్రంలో పద్మనాభ స్వామి గుడిలో సుదర్శన చక్రం ఉంది ఎప్పుడూ బగబగ మంటలను ఎగజిమ్మేదట, తురకల దండయాత్ర లో ఆ చక్రాన్ని శ్రీ వళ్ళిపుత్తురు అమ్మ వారి ప్రక్కన ఉంచారట అంతే చక్రం ప్రశాంతంగా మారిందట, అక్కడ నుంచి తీస్తే మళ్ళీ యదా స్థితి అయ్యిందని అక్కడే ఉంచేశారట, ఇది ఆండాళ్ అమ్మ మహత్యమే

భోగి నువ్వులు

నువ్వులు మన సాంప్రదాయంలో ఎక్కువగా అశుభానికి వాడతారు. కాని ఉత్తరాయన పుణ్యకాలంలో వచ్చే సంక్రాంతి సమయంలో మాత్రం శుభసూచకమైన వస్తువుగా భావిస్తారు. నువ్వులు ఉష్ణాన్ని కలిగిస్తాయని ఆయుర్వేదం చెబుతుంది. వైద్యశాస్త్రంలో చలిని తగ్గించుకోవడానికి నువ్వులు, నూనె, దూది ప్రధాన సాధనాలుగా పేర్కొనబడింది. ఇందులో నువ్వులకు అత్యంతప్రాధాన్యం ఉంది.

తిలస్నాయీ తిలోద్ధర్తీ! తిలోహౌమీ తిలోదకీ!
తిలభుక్ తిదాతాచ షట్‌తిలాః పాపనాశనాః!!

నువ్వులతో కూడిన నీటితో స్నానం, నువ్వులతో చేసే హవనం, నువ్వుల నీళ్లు, నువ్వులతో భోజనం, తిలాదానం – అనేవి పాపాలను తొలగిస్తాయి అని పురాణాలు పేర్కొన్నాయి. కాబట్టి నువ్వుల వంటకాల ఉపయోగం అనేది ఈ పండుగలో ప్రశస్తికెక్కాయి. మనదేశంలోనే కాదు ప్రాచీన గ్రీకు సంప్రదాయంలో సంతాన వృద్ధికోసం 'నువ్వుల వంటకాలు' పంచుకొనేవారట. శరీరంలో చర్మం, కళ్ళు, ఎముకలు బలంగా ఉండడానికి ఆధునికి వైద్యశాస్త్రంలో కూడా ఎ, బి విటమిన్లు అధికంగా కావాలని చెబుతుంది. ఇవి కొవ్వుపదార్థాల్లో లభిస్తాయి. తిలలు– అనగా నువ్వుల్లో ఈ విటమిన్లు అధికం. అందుకే నువ్వులు తీసుకోవాలని మన పూర్వు లు నియమం చేశారు. నువ్వులు – బెల్లం, సూర్యకర్మలలోని 'సామాజిక దృక్పథం' 'మన పండుగలు' గ్రంథం ఇలా వివరించింది.




దీనిని స్ఫురింపజేయడానికి కాబోలు సంక్రాంతి నాడు బెల్లం, నువ్వులు కలిపి దంచిన చిమ్మిలి పంచుకుంటారు. బెల్లం మాధుర్యానికి లక్షణం. నువ్వుల నుండి నూనె వస్తుంది. నూనెకు స్నేహమని పేరు. జీవనంలోని మధురమైన వ్యవహారం, స్నేహం ఎంతో అవసరం కదా! నువ్వులు తీసుకోవడం గురించి జ్యోతిశ్శాస్త్ర దృష్టిని ఆయుర్వేదానికి జోడించిన పాటిల్ నారాయణరెడ్డి గారి వివరణ. "నవగ్రహాలకు నవధాన్యాలు చెప్పారు. అందు నువ్వులు శనిగ్రహానికి చెప్పారు. కేవలం నువ్వులు మాత్రమే తినుట రుచికే కాదు, ఆరోగ్యానికి కూడా పిత్తమధికమగును, అందుచే పిత్తహరమైన బెల్లాన్ని జతలో చేర్చి తిన్నా శరీరంలో కొరత ఏర్పడిన కొవ్వు అంశం సరిపోవును. పచ్చినువ్వుల యందుండు దోషాలను నివారించు ఉద్దేశంతో వేయించిన నువ్వులను సేవించవలెను. దీంతో తినుటకు రుచికూడ వచ్చును. దీని జతకు రుచికి కొవ్వ పదార్థాలు ఉండు శనగలు, కొబ్బరి మొదలగు వానిని కలిపి తినుటకు ఏర్పాటు చేసారు.

ఆయుర్వేదరీత్యా నువ్వులు ఉష్ణగుణం కలవి. బలకరం, కేశాలకు మంచిది. చర్మానికి చాల మంచిది. స్తన్యంను వృద్ధిచేయును. వ్రణాలను పోగొట్టును. దంతపాటవమునిచ్చును. అగ్నిని, బుద్ధిని వృద్ధిచేయును. వీనిలో నల్లనువ్వులు హీనగుణం కలిగియుండును. ఈ గుణాలు (నల్లనువ్వులకు చెప్పబడినవి) అన్ని ఈ కాలంలో మన దేహానికి అత్యంత ఆవశ్యకమై ఉన్నవి.

పుష్యమాసం శనిమాసం. ఈ నెలలో శనిప్రభావం విక్కుటంగా నుండును. జ్యోతిశ్శాస్త్రం ప్రకారం శని శరీరమందలి జీవనాడి కారకుడై ఉండును. ఈ జీవనాడి ఒక శాఖ హృదయస్పందనంను, రక్తప్రసరణాన్ని నిర్ణయించును. (వైద్యశాస్త్రానుసారంగా) ధనుర్మాసం అయిపోవునప్పటికే శరీరంలో రవి ప్రభావం (ఎండవేడిమిని) ఎదుర్కొనుటకై శరీరంలో ముఖ్యమైన జీవనాడి ఆరోగ్యంగా పనిచేయటంతో హృదయ స్పందనం సక్రమంగా ఉండునట్లు చేయగల నువ్వులు – బెల్లం సేవించాలనే నియమం చేసారు. ఈ నెలలో శనిప్రభావం ఉంటుం ది. పుష్యమి నక్షత్రం శని నక్షత్రం. ఈ నక్షత్రానికి బృహస్పతి అధిదేవత. శనికి యముడు అధిదేవత. యమం అనగా సంయమం అని అర్థం. పుష్యనక్షత్ర అధిపతి శని. భగవంతుని ప్రతినిధి, దర్మదర్శి, న్యాయం, సత్యం, ధర్మాలను ఎత్తి చూపించేవాడు. సర్వప్రాణుల సమస్త విశ్వప్రేమను, పవిత్రతను ఉద్ధరించువాడుగా ఉన్నాడు. మానవుడు ఈ నెలలో నువ్వులు సేవించి నియమనిష్ఠలను పాటించిన శనికి పైన చెప్పబడిన గుణాలన్నింటినీ పొందవచ్చు. అనగా దైహికంగా, మానసికగా బలాన్ని పొందవచ్చును. ఎప్పుడు మానవుడు వీనిని పొందునో అప్పుడు అతడు బృహస్పతిలా అగును. అందుచే పుష్యమి నక్షత్రానికి బృహస్పతి అధిదేవతగా చెబుతున్నారు.

డా|| పి. భాస్కరయోగి

ఉప్పుగప్పురంబు నొక్కపోలికనుండు
చూడచూడ రుచుల జాడవేరు
పురుషులందు పుణ్య పురుషులువేరయ
విశ్వదాభిరామ వినుర వేమ

భావం: ఉప్పూ, కర్పూరం రెండూ చూడటానికి ఒకేలా ఉంటాయి.కానీ వాటి రుచులు మాత్రం వేరు వేరు. పురుషుల్లో పుణ్యపురుషులు వేరుగా ఉంటారు.

సౌమ్య శక్తి

వికాసమే విజయం

- లావో ట్సూ అంటారు.. లోకంలో మృదువైన, బలహీనమైన వస్తువుల్లో నీటి కంటే బలహీనమైంది ఏదీ లేదు. కానీ బలంగా, స్థిరంగా ఉండే వస్తువులను అధిగమించడంలో సైతం దానికి సమానమైంది ఏదీ లేదు. మృదువైనది కఠినమైన దాన్ని జయిస్తుంది. కాఠిన్యం, కర్కశత్వాలు మృత్యువుకు అనుచరులైతే, మృదుత్వం, కారుణ్యాలు అమృతత్వానికి సహచరులు.
- సౌమ్యత కంటే శక్తిమంతమైంది ఏదీ లేదు, నిజమైన శక్తి ఉన్నంత సౌమ్యంగా ఏదీ ఉండదు!
- బలహీనులు ప్రతీకారం తీర్చుకుంటారు, బలవంతులైన వారు క్షమిస్తారు కానీ వివేకవంతులేమో పట్టించుకోరు! నిజమైన బలం ఎక్కడ ఉన్నట్లు?
- సంఘర్షణ లేని చోట శక్తి పెరగదు. కేవలం సుఖం, సౌలభ్యం మాత్రమే ఉండే చోట మిగిలేది శక్తిహీనతే!

రాక్షసులకు ఉండేంత బలాన్ని కలిగి ఉండడం మంచిదే కానీ, దాన్ని రాక్షసుడిలా ఉపయోగించడమే దారుణం!

– స్వామి పార్థసఖానంద

కుశనాభుడి కుమార్తెల వివాహ వృత్తాంతం



రామలక్ష్మణులు విశ్వమిత్రునితో ప్రయాణిస్తూ శోణానది ఉన్న ప్రాంతానికి చేరుకున్నారు,ఆ ప్రాంతం ఫలాలు, పుష్పాలతొ చాలా శోభాయమానంగా కనబడింది.ఈ ప్రాంతం ఇంత ఆనందంగా, అందంగా ఉండడానికి కారణమేంటనిరాముడు అడగగా విశ్వామిత్రుడు ఇలా చెప్పాడు ‘ పూర్వకాలంలొబ్రహ్మ కుమారుడైన కుశుడు రాజ్యపాలన చేసేవాడు. ఆయనకికుశాంబుడు, కుశనాభుడు, అధూర్తరజసుడు, వసురాజు అనేనలుగురు కుమారులు కలిగారు. ఆ నలుగురుయవ్వనవంతులయ్యాక కుశుడు వాళ్ళని పిలిచి, ‘ మీరు నలుగురూనాలుగు నగరాలని నిర్మాణం చెయ్యండి, వాటిని మీరు ధార్మికంగాపరిపాలన చెయ్యండి ‘ అని ఆదేశించాడు. అప్పుడు వాళ్ళు కౌశాంబీ,మహోదయము, ధర్మారణ్యము, గిరివ్రజపురము అనే నాలుగునగరాలని నిర్మించుకొని పరిపాలించారు. ప్రస్తుతం మనం ఉన్నదిగిరివ్రజపురములొ. ఈ పట్టణాన్ని వసురాజు నిర్మించాడు. ఈ నగరం 5పర్వతాల మధ్యలొ ఉంది, శోణానది ఈ 5 పర్వతాల మధ్యలొప్రవహిస్తుంది, అందుకే ఇక్కడి ప్రాంతం సస్యశ్యామలంగా ఉంటుంది.

కుశుడి రెండవ కుమారుడైన కుశనాభుడికి 100 మంది కుమార్తెలుకలిగారు. వాళ్ళందరుకుడా ఘ్రుతాచి అనే అప్సరసకి, కుశనాభుడికిజన్మించారు. వాళ్ళందరూ విశేషమైన సౌందర్య రాసులు,మెరుపుతీగల వలె చాలా అందంగా ఉండేవారు. ఒకనాడు ఆకుశనాభుడి కుమార్తెలు కొండ మీదకి వెళ్లి పాటలు పాడుకుంటూ,వీణలు వాయిస్తూ సంతోషంగా ఉన్న సమయంలొ అక్కడికివాయుదేవుడు వచ్చాడు. వాయువు వాళ్ళని చూసి మీరు చాలాఅందంగా ఉన్నారు, కాని మీరు మనుషులు కావడం చేత మీరు ఇలాయవ్వనంలొ ఎంతోకాలం ఉండలేరు, కొంత కాలానికి మీ యవ్వనంతొపాటు మీ అందం కూడా నశిస్తుంది, కాబట్టి మీరు నన్ను పెళ్లిచేసుకోండి, నన్ను పెళ్ళిచేసుకుంటె మీరు కూడా నిత్య యవ్వనంలొఉంటారు అని ప్రలోభ పెట్టాలని ప్రయత్నించాడు. వెంటనే ఆ 100కన్యలు ఏక కంఠంతొ.........

కుశనాభ సుతాః దేవం సమస్తా సుర సత్తమ |
స్థానాత్ చ్యావయితుం దేవం రక్షామః తు తపో వయం ||
మా భూత్ స కాలో దుర్మేధః పితరం సత్య వాదినం |
అవమన్యస్వ స్వ ధర్మేణ స్వయం వరం ఉపాస్మహే ||
పితా హి ప్రభుర్ అస్మాకం దైవతం పరమం చ సః |
యస్య నో దాస్యతి పితా స నో భర్తా భవిష్యతి ||

మాదెగ్గర అపారమైన తపఃశక్తి ఉంది, కావున మమ్మల్ని మేమురక్షించుకోగలము, మేము తలుచుకుంటె నువ్వు గర్వంగాచెప్పుకుంటున్న నీ దేవతాస్థానం నుంచి నిన్ను తొలగించగలము.మాకు పెళ్ళంటూ జెరిగితె, అది ధర్మాత్ముడైన మా తండ్రిగారు ఎవరినిచూపించి చేసుకోమంటె వాళ్లనే చేసుకుంటాము కాని మా అంతటమేము నిర్ణయించుకోము, ఈ దేశంలొ ఏ స్త్రీ తన తండ్రిని కాదనిసొంతంగా తన భర్తని నిర్ణయించుకునే రోజు రాకూడదు అని ఆకన్యలందరూ ఏక కంఠంతొ చెప్పారు. వారి మాటలకు ఆగ్రహించినవాయుదేవుడు ఆ నూరుగురు కన్యల శరీరములలోకి ప్రవేశించి వారిఅవయవములందు సంకోచత్వం కల్పించాడు, దానివల్ల వారందరూఅవయవముల పటుత్వం కోల్పోయారు.

తరవాత ఆ కన్యలందరూ కుశనాభుడి దెగ్గరికి వెళ్లి జెరిగినదిచెప్పారు. అప్పుడు ఆ కుశనాభుడు తన కుమార్తెలను చూసి, ‘అమ్మా! మీకు ఈ స్థితి కల్పించిన ఆ వాయుదేవుడిని మీరుశపించలేదు, ఓర్పు వహించారు, నాకు చాలా సంతోషంగా ఉందమ్మాఅని...............

క్షమా దానం క్షమా సత్యం క్షమా యజ్ఞః చ పుత్రికాః |

ప్రవచనం

– డా॥ శ్రీ చాగంటి కోటేశ్వర రావు

క్షమా యశః క్షమా ధర్మః క్షమాయాం విష్ఠితం జగత్ ||

స్త్రీకి ఉండవలసిన ఆభరణం ఓర్పు. అమ్మా! నూరుగురు కలిసి ఒకేసారిఅంత ఓర్పు పట్టారు, మీలో ఒక్కరికి కూడా కోపం రాలేదు, అందంఅంటె ఇది. ఓర్పె దానం, అన్నిటికన్నా గొప్ప కీర్తి ఓర్పె, ఓర్పుకి మించినయజ్ఞం లేదు, ఓర్పుని మించిన సత్యం లేదు, ఓర్పుని మించిన ధర్మంలేదు, ఆ ఓర్పు వల్లనె ఈ భూమి నిలబడుతోంది ‘ అని చెప్పాడు.

అదే సమయంలొ చూళి అనే ఒక మహర్షికి, ఊర్మిళ కుమార్తె అయిన సోమద అనే గంధర్వ స్త్రీ ఉపచారాలు చేసేది. అలా చాలాకాలంఉపచారం చేశాక ఒకనాడు ఆ మహర్షి ఆమెతొ....... నేను నీకుఏమిచెయ్యగలను అని అడిగారు. అప్పుడామె.......నేను ఎవరికీభార్యని కాను, కాని అపారమైన తపఃశ్శక్తి, బ్రహ్మతేజస్సు కలిగిన నీవలన, శారీరిక సంపర్కం లేకుండా, మానసికమైన తపఃఫలంతొ నాకుకుమారుడు కావాలి అని అడిగింది. అప్పుడు ఆ చూళి మహర్షిసంకల్పం చేసి బ్రహ్మదత్తుడు అనే మానస పుత్రుడిని సోమదకిప్రసాదించారు. పుట్టుక చేత బ్రహ్మజ్ఞాని అయిన బ్రహ్మదత్తుడు,కాపిల్యము అనే నగరంలొ ఉండేవాడు. కుశనాభుడు తన నూరుగురుకుమార్తెలని ఆ బ్రహ్మదత్తుడికి ఇచ్చి వివాహం జెరిపించాడు.బ్రహ్మదత్తుడితొ వివాహం అవుతుంటె ఒక్కొక్కరి అంగవైకల్యం పోయి,వాళ్ళు మళ్ళి పూర్వ సౌందర్యాన్ని పొందారు. అప్పుడు సోమద వచ్చితన కోడళ్ళ ఒక్కొక్కరి చేతిని పట్టుకొని కుశనాభుడిని పొగిడింది‘ అని విశ్వామిత్రుడు రాముడికి చెప్పాడు.

ఈ వృత్తాంతం విన్నాక అందరూ ముందుకి బయలుదేరారు.

–సేకరణ, నరేందర్ చింతం

శివానందలహరి

శ్రీ ఆదిశంకరాచార్యుల విరచితం- 6



శ్లోకం:

కదా వా కైలాసే కనకమణిసౌధే సహ గణై
ర్వసన్ శంభోరగ్రే స్ఫుటఘటితమూర్ధాంజలిపుటః
విభో సాంబ స్వామిన్ పరమశివ పాహీతి నిగదన్
విధాతౄణాం కల్పాన్ క్షణమివ వినేష్యామి సుఖతః

భావం:

ఓ దేవా! కైలాసంలో బంగారంతో, మణులతో నిర్మించిన సౌధంలో, ప్రమథగణాలతో కలసి, నీ ఎదురుగా నిలబడి, తలపై అంజలి మొక్కుతూ, ‘ ఓ ప్రభూ! సాంబా! స్వామీ! పరమశివా! రక్షించు’ అని పలుకుచూ, అనేక బ్రహ్మయుర్దాయాలను క్షణాలవలే సుఖంగా ఎప్పుడు గడిపెదనో కదా!

వివరణ

కష్టసమయం వచ్చినప్పుడు, తనకు నచ్చే విధంగా కలవచ్చినా, తనకు నచ్చే సన్నివేశంలో

పాల్గొంటున్నా, ఊహాలోకాల్లో విహరిస్తున్నా, ఆ కష్టాన్ని, అందువల్ల వచ్చే మనఃక్లేశాన్ని మరిచిపోగలిగి, ఆనందం అనుభవించగలంఅని శంకరులు ఈ శ్లోకంలో తెలియపరుస్తున్నారు.

ఆయన ఊహల్లో ఎలాంటి ఆనందం పొందుతారో ఈ శ్లోకం వివరిస్తుంది.

కమనీయమైన కైలాసంలో వుండాలి. తాను ఒంటరిగా కాకుండా, తనప్రక్క తనలాంటి భక్తులే వుండాలి. అప్పుడు సంకల్పానికి లక్ష్యానికి సిద్ధి చేకూరుతుంది.(వ్యతిరేక భావాలు గల వ్యక్తుల సాన్నిధ్యంలో భావాలు అడ్డుకుంటాయి). ఇందువల్ల భక్తుల మధ్య సాలోక్య సిద్ధి చేకూరుతుంది. భక్తితో మూర్ధాంజలి మకుటంతో శివనామస్మరణ చేస్తున్నప్పుడు, అందరి హృదయాల్లో శివుడే వుండి అందరూ శివుని సాన్నిధ్యాన్ని, అనుభవిస్తారు.

దీనివల్ల సారూప్యం, సామీప్యం సిద్ధులు రెండూ చేకూరుతాయి. ఇలా సాలోక్య, సామీప్య, సారూప్య సిద్ధులు చేకూరిన తరువాత శివనామ స్మరణానందంతో పరమ శివునికి మరింత చేరువై, చివరికి అబేధ స్థితిలో, సాయుజ్య సిద్ధికి సంబంధించిన పరమానందాన్ని కూడా పొందటం జరుగుతుంది. అప్పుడు బాహ్య ప్రపంచాన్నే మరిచిపోయి, బ్రహ్మ కల్పాదులు కూడా అధిగమించి, నిత్యానంద పరవశ స్థితిలోనే, ఉండిపోవచ్చుట. ఇంతకంటే కావలసినది ఏముంటుంది జీవి తరించడానికి అని శంకరుల ఉద్దేశ్యం. మనకు నచ్చితే మనం అలాంటి స్థితిని, ఆనందాన్ని ఇహలోకంలో ఉండే పొందవచ్చును. ఈ ఊహ వల్ల వచ్చే ఆనందం ఎప్పటికైనా నిజంగా దక్కుతుంది. అందుకు నిర్మలమైన భక్తితో ఓపికగా నిరీక్షించాలి అంతే.

ఆ ఆదిదంపతుల పాదపద్మాలకు నమస్కరిస్తూ
సర్వేజనా సుఖినోభవంతు

–డా॥ శ్రీరామ్, హైదరాబాద్

భగవంతుడు సాకారుడు, నిరాకారుడు

– పరమహంస గూఢార్థ కథలు

(సన్న్యాసి – విగ్రహము: అద్దకాలు వేసేవాడు: రంగులు మార్చే ఊసరవెల్లి)

డాక్టరు మహేంద్రలాల్ సర్కారు ఒక సుప్రసిద్ధహోమియో వైద్యుడు. గురుదేవులకు గొంతులో ఏర్పడిన క్యాన్సర్ వ్యాధికి ఆయన చికిత్స చేస్తున్నాడు. వైద్యవృత్తిలో బొత్తిగా తీరిక లేకపోయినా ఆయన గురుదేవులను పరీక్షించడానికి వచ్చిన ప్రతిసారీ చాలాసేపు అక్కడే మాట్లాడుతూ గడిపేవాడు. గురుదేవుని సమక్షంలో ఒకొక్కసారి ఆరు, ఏడు గంటల కాలం నిముషాలలాగా గడిచిపోయేది. గురుదేవుని శిష్యలను ఆయన దగ్గర బంధువులలాగా చూచేవాడు.

ఒకరోజు ఆయన గురుదేవులతో చాలాసేపు మాట్లాడాడు. ఆ సమయంలో అతి ముఖ్యమైన కొన్ని కథలను గురుదేవులు చెప్పారు.

డాక్టరు, ‘భగవంతుడు సాకారుడా? నిరాకారుడా?’ అని ప్రశ్న వేశాడు.


గురుదేవులు: “ఒక కథ చెపుతా విను! ఒకానొకప్పుడు ఒక సన్న్యాసి తీర్థయాత్రలు చేస్తూ జగన్నాథధామానికి వచ్చాడు. ఆలయంలో ప్రవేశించి స్వామి విగ్రహాన్ని చూచేసరికి అడిలో ఒక సందేహం కలిగింది. ‘భగవంతుడికి ఆకారమున్నదా, లేదా?’ అని మనస్సులో తర్కించుకున్నాడు. అప్పుడు ఆ సన్న్యాసి చేతిలో ఒక దండం (కర్ర) ఉంది. విగ్రహం దగ్గరకు వచ్చి దండంతో విగ్రహాన్ని తట్టి చూడబోయాడు. భగవంతుడికి ఆకారం ఉంటే ఆ కర్ర విగ్రహానికి తగిలి, అవతలి వైపుకు పోదని అతడి భావన. కాని, దానికి విరుద్ధంగా అసలు అక్కడ విగ్రహమే లేనట్టు, ఆ కర్ర సునాయాసంగా విగ్రహానికి ఎడమనుండి కుడివైపునకు దూసుకు వచ్చింది. అప్పుడు ఆ సన్న్యాసి, దేవుడికి ఆకారం లేదని, ఆయన నిరాకారుడని, నిశ్చయించుకున్నాడు. ఆ వెంటనే అటువైపు ఉన్న కర్రను తీయాలని విగ్రహానికి తగిలేలా కుడి నుండి ఎడమవైపునకు తిప్పాడు. ఆశ్చర్యం! ఆ దండం విగ్రహానికి తగిలితలకి రాలేదు. అప్పుడా సన్న్యాసికి భగవంతుడికి ఆకారం కూడా ఉన్నదని తెలిసింది. ఈ రెండు రకాల అనుభవాల వల్ల భగవంతుడు సాకారుడని, నిరాకారుడని కూడా గ్రహించాడు.”

ఈ కథ ముగించి గురుదేవులు ఇంకా ఇలా అన్నారు.: “కాని దీన్ని అర్థం చేసుకోవటం చాలా కష్టం. ‘భగవంతుడికి ఆకారమే ఉన్నట్లయితే, అతడు నిరాకారుడెలా అవుతాడు?’ అని సహజంగా మనస్సుకు సందేహం వస్తుంది. ఒకవేళ ఆకారమే ఉందనుకోండి. అప్పుడు ‘ఆయనకు ఇన్ని ఆకారాలెందుకు ఉంటాయి?’ అని కూడా అనిపిస్తుంది. ఈ సందేహాలన్నీ భగవత్సాక్షాత్కారమైతే గాని తీరిపోవు. భక్తుల కోసమే భగవంతుడు వారివారి కోరికలను అనుసరించి అనేక రూపాలు ధరిస్తాడు. ఎలాగంటావా? ఇంకొక కథ చెపుతా విను!”

“ఒక ఊళ్లో గుడ్డలకు అద్దకాలు వేసే వాడొకడుండేవాడు. వాడి దగ్గర ఒకే ఒక తొట్టి, ఆ తొట్టిలో ఒక ద్రావణం ఉండేవి. గుడ్డలకు రంగులు వేయించుకోవడానికి రోజూ చాలామంది అతడి దగ్గరికి వచ్చేవారు. ఎవరైనా గుడ్డతీసుకొని వస్తే, నీ గుడ్డకు ఏ రంగు వెయ్యమంటావు?’ అని వాడు అడిగేవాడు. ఆ గుడ్డ తెచ్చినవాడికి ఎరుపురంగు కావలసివుంటే ఆ గుడ్డను ఆ తొట్టిలో ముంచి, ‘ఇదిగో ఎర్రరంగు వేశాను తీసుకో’ అని ఇచ్చేవాడు. ఇదే రకంగా మరొకరు పసుపుపచ్చ రంగు వెయ్యమంటే, ఆ గుడ్డను కూడా అదే తొట్టిలోని ద్రావణంలో ముంచి పైకితీసి, ‘ఇదిగో, నీ గుడ్డకు పసుపుపచ్చ రంగు వేశాను’, అని ఇచ్చేవాడు. ఇంకొకరికి, ‘నీలిరంగు వేశాను’, అని అదే తొట్టిలో ముంచి తీసి ఇచ్చేవాడు. ఇదే రకంగా వాడు గుడ్డలన్నీ ఒకే తొట్టిలో ముంచినా వేరే వేరే రంగులతో పైకి తీసి ఇచ్చేవాడు.” “దీనినంతా ఒకడు పక్కన నిలబడి ఆశ్చర్యంతో చూస్తున్నాడు. రంగులు వేసేవాడు అతడి వైపు తిరిగి, ‘అయ్యా, మీ గుడ్డకు ఏ రంగు వెయ్యమంటారు?’ అని అడిగాడు. అప్పుడు వాడు, ‘సోదరా! నీ తొట్టిలో ఏ రంగు ఉందో ఆ రంగునే వెయ్యి!’ అని కోరాడు.” అలా అడిగినవాడు భగవంతుడి నిజస్వభావం ఏమిటో తెలుసుకోవాలని అనుకునేవాడని చెప్పుకోవచ్చు. రకరకాల రంగులు బయటకు వస్తున్న ఆ తొట్టిలో నిజంగా ఏ రంగు ఉందని అడగడం, రకరకాల అవతారాలను చూపుతున్న భగవంతుడి నిజ స్వభావం ఏమిటి అని అడగడంతో సమానమే కదా!

“కాబట్టి మహాశయా! భక్తుల కొరకు భగవంతుడు అనేక రూపాలు ధరిస్తాడు (అనేక అవతారాలెత్తుతాడు.) మరొక కథ చెపుతా విను!”


“ఒకసారి ఒక బాటసారి అడవిలో నడచిపోతున్నాడు. వాడికి ఒక చెట్టుమీద ఒక అందమైన ప్రాణి కనిపించింది. తరువాత వాడు తన స్నేహితుడికి ఈ సంగతి చెపుతూ, ‘సోదరా! నేను అడవిలో ఫలానా చెట్టు మీద ఎర్రగా ఉన్న చిన్న జంతువును చూశాను!’ అని చెప్పాడు. అది విని ఆ స్నేహితుడు, ‘నేను కూడా దాన్ని చూశాను! అది ఎర్రగా ఉంది అంటావేం? అది ఆకుపచ్చగా ఉంది!’ అన్నాడు. ఇంతలో మూడవ వాడు అక్కడికి వచ్చి, ‘అబ్బే! అది ఆకుపచ్చగా లేదు. పసుపుపచ్చగా ఉంది’ అన్నాడు. తరువాత ఇంకా కొంతమంది ఆ ప్రాణి ఊదారంగులో ఉందని, నీలంగా ఉందని వర్ణించారు. వారు ప్రత్యక్షంగా చూశారు కనుక వారికి ఆ విషయం గురించి దృఢమైన అభిప్రాయం ఏర్పడింది కూడా. ఇలా ఆ ప్రాణికున్న రంగులను గురించి వారివారికున్న దృఢమైన భిన్నాభిప్రాయాలతో వాళ్లలో వాళ్లు తగవులాడుకోవడం మొదలు పెట్టారు. సమస్య ఇలా పరిష్కారం కాదని, తమతమ వాదాలను నెగ్గించుకోవడానికి, చివరకు వాళ్లంతా ఆ చెట్టు దగ్గరికి చేరారు. ఆ చెట్టు కిందనే కూర్చుని ఉన్నవాడొకడు వీళ్ల మాటలన్నీ విని, ఇలా సమాధానం చెప్పాడు: ‘నేను ఎప్పుడూ ఈ చెట్టు కిందనే ఉంటాను. నాకీ ప్రాణి సంగతి బాగా తెలుసు.



దానికున్న రంగును గురించి మీరందరు చెప్పిందీ నిజమే. ఒకసారి అది ఎర్రగా ఉంటుంది. కొన్నిసార్లు ఆకుపచ్చగా ఉంటుంది. కొన్ని సార్లు పుసుపుపచ్చగా ఉంటుంది. మరికొన్నిసార్లు నీలంగాను, వివిధ రంగులలోను ఉంటుంది. ఒక్కొక్కప్పుడు ఏ రంగూ లేకుండా కూడా ఉంటుంది.’ చెట్టు కింద నివసించేవాడికే ఆ జంతువు ఊసరవెల్లి అని, అది అనేక వర్ణాలు ధరిస్తుందని, ఒకొక్కప్పుడు ఏ రంగూ లేకుండా ఉంటుందని కూడా తెలుసు.”“అదే విధంగా ఎల్లప్పుడూ భగవంతుణ్ణి తలచేవాడికే ఆయన స్వభావం తెలుస్తుంది. భగవంతుడు అనేక రూపాలు ధరిస్తాడని, ఆయనకు అనేక గుణాలున్నాయని, ఏ గుణమూలేని నిర్గుణుడని కూడా అంతడు తెలుసుకుంటాడు. కాని ఈ సత్యాన్ని తెలియని ఇతరులు మాత్రం తమలో తాము తగవులాడుకూంటూ, బాధపడుతూ ఉంటారు. ఈ మిడిమిడిజ్ఞానమే మతవర్గ విభేదాలకు, అంతః కలహాలకు దారి తీస్తున్నది.” ఈ కథలన్నింటి ద్వారా గురుదేవులు ఒక మహాసత్యాన్ని బోధించారు: “మనిషికి ఆర్తి ఉన్నట్లయితే భగవంతుణ్ణి కనుక్కోగలడు. భగవంతుడు సాకారుడా, నిరాకారుడా, సుగుణుడా, నిర్గుణుడా, అనే సందేహాలన్నీ కూడా తొలగిపోతాయి.

అవతార పురుషులను

అందరూ గుర్తించలేరు



(నిన్నటి తరువాయి) వ్యాపారి దాన్ని చూచి ఆ! తీసుకుంటాను. ఇది విలువగల రాయిలాగానే ఉంది. దీనితో ఒక నగ చేయించుకో వచ్చు, నీకు తొమ్మిదివందల రూపాయలు ఇస్తాను అని చెప్పాడు ఆ సేవకుడు బట్టల వ్యాపారితో, అయ్యా! ఇంకొక మాట చెప్పండి నీకే దీన్ని అమ్మి వేస్తాను. ఆఖరు మాటగా వెయ్యిరూపాయలిచ్చి దీన్ని తీసుకోండి! అన్నాడు వెంటనే ఆ బట్టల వ్యాపారి నన్ను ఇబ్బంది పెట్టకు. నేను చెప్పినదానికికన్నా ఒక్క రూపాయి కూడా ఎక్కువ ఇవ్వను. ఆపై నీ ఇష్టం అన్నాడు. అప్పుడు ఆ సేవకుడు తిరిగువెళ్ళి తన యజమానితో, అయ్యా! బట్టల వ్యాపారి తొమ్మిది వందల కన్నా ఎక్కువ ఇవ్వనన్నాడు అని జరిగింది జరిగినట్లుగా విన్నవించాడు.

అప్పుడా యజమాని నవ్వుతూ, ఇక దీన్ని రత్నాల వర్తకుడి దగ్గరకు తీసుకుపో! అతనెంత ధర ఇస్తాడో చూద్దాం! అన్నాడు సేవకుడు దాన్ని రత్నాల వర్తరుడి దగ్గరకు తీసుకువెళ్ళాడు ఆ రత్నాలవ్యాపారి దాన్ని చూడడంతోనే, లక్ష రూపాయలిస్తాను! అని సంతోషంగా చెప్పాడు.

గురుదేవులు ఈ కథను గిరీశచంద్ర గోషుకు చెప్పారు. గిరీశ్ గొప్ప బెంగాలీ నాటక రచయిత. తాను వ్రాసిన నాటకాలను తాను నడుపుతున్న స్టార్ థియేటరులో ప్రదర్శించేవాడు అతడు గురుదేవులను అవతారపురుషునిగా పరిగణించేవాడు. అనేకసార్లు రామకృష్ణుల అవాతారతత్త్వాని గురించి ఆయన బ్రహ్మసమాజానికి చెందిన సుప్రసిద్ధ గాయకుడై త్రైలోక్యసన్యాలుతో వాదించాడు.

ఆ సమయంలోనే గురుదేవులు ఈ కథ చెప్పి, వీళ్ళతో నువ్వు ఈ విషయం గురించి ఎందుకు వాదిస్తావు, వాళ్ళకు సంసారమూ కావాలి, దేవుడు కావాలి, అందరూ సచ్చిదానంద పరబ్రహ్మాన్ని ఊహించగలరా? శ్రీ రామచంద్రుణ్ణి అవతారపురుషునిగా ఎంతమంది గుర్తింటారు? కేవలం పన్నెండుమంది ఋషులే గదా అన్నారు. శ్రీరామకృష్ణులు ఈ కథ ద్వారా తాను అవతారాపురుషుణ్ణి మనలాంటి మందబుద్ధులకు సూచన చేశారు!

అవజానంతి మాం మూఢా మానుషీం తనుమాశ్రితమ్!
పరంభావముజానంతో మనభూత మహేశ్వరమ్!! (భగవద్గీత 9.11)

(మందబుద్ధులైన జనులు నా పరతత్త్వాన్ని తెలుసుకొనజాలక సర్వభూతకములకు అధిపతినైన నన్ను మానవ శరీరము నందుండుటచే సామాన్యమానవునిగా భావించి అవమానింతురు.)

–స్వామి జ్ఞానానందగిరి

శ్రేష్ఠుడిని అనుసరించడం

బాల మకరందం

శ్రీభగవాన్ ఉవాచ

యద్యదాచరతి శ్రేష్ఠస్తత్తదేవేతరో జనహ।
స యత్ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే।।

తాత్పర్యము: శ్రేష్ఠుడైన పురుషుని ఆచరణమునే (ప్రవర్తననే) ఇతరులును అనుసరింతురు. అతడు (ప్రతిష్ఠించిన) ప్రమాణములనే లోకులం దరునూ పాటించెదరు.

నీతి: ఎవరైతే మంచిపనులు మన స్ఫూర్తిగా చేస్తూ, అవి భగవంతునికి అర్పిస్తూ ఉంటాడో, అతడి పనులు పరిపూర్ణతను సంతరించుకుంటాయి.

ముఖ్యపదం: ఉదాహరణను అనుసరించడం.



అనేక దైవకార్యాలు నిర్వర్తించడం కోసమే కృష్ణుడు గోకులం– బృందావనంలో వెలిసాడు. ఆ కాలంలో అనేక చెడు సాంప్రాదాయాలు కొనసాగుతుండేవి. ఏడేళ్ళ బాలుడే అయినప్పటికీ, కృష్ణుడు నందమహా రాజుకు, ఆయన అనుచరులకు అనేక సలహాలు, సూచనలు ఇస్తుండేవాడు, వర్షాలు కురిపిస్తున్న ఇంద్రుడికి కృతజ్ఞతగా ఏటా బృందావనవాసులు జరిపే పూజను కృష్ణుడు అడ్డుకుని, వర్షాలు ఇంద్రుడి దయ వలన కురవడం లేదని చెప్పాడు, గోవులకు మేత కావాలంటే అందుకు అడవులూ, వర్షాలు కావాలి. పర్వతమే మేఘాలను అడ్డుకుని వర్షాలు కురిపిస్తూ, అడవులను కాపాడుతుంది కాబట్టి గోవర్ధన గిరికే పూజ చేయాలని వాదించాడు. కృష్ణుడి వాదనతో అందరూ ఏకీభవించారు. ఇంద్రపూజ గోవర్ధనపూజగా మారింది. దాంతో దేవేంద్రుడికి కోపం వచ్చి ఉరుములు, మెరుపులతో పెద్ద వర్షం కురుపించాడు. గోపాలురు తమను కాపాడమని కృష్ణుని వేడున్నారు. అప్పుడు కృష్ణుడు అందరినీ కాపాడే బాధ్యత తనదిగా గుర్తించి గోవర్ధనగిరిని7 పగళ్ళు 7 రాత్రులుపాటు తన ఎడమ చేతి చిటికెన వ్రేలి గోరుతో ఎత్తి పట్టి ఉంచాడు. సూర్యచంద్రుల కాంతిలేని లోటు తీర్చేందుకు కృష్ణుడు తన ఒక కంట సూర్యకాంతిని, మరోకంట చంద్రకాంతిని ప్రకాశింపచేసాడు. మరో మార్గంలేక ఇంద్రుడు తన ఓటమిని అంగీకరించి ఆకాల వర్షాలు ఆపేస్తాడు. అందరు కలిసి అన్నకూటమనే ఆహారపర్వతాన్ని సృష్టించాడు. అప్పుడు కృష్ణుడు రెండు పాత్రలు వహించాడు. ఒకటి ఇంద్రుని కోపంతో పంపిన పెద్ద వర్షం నుంచి క్రింద నిలబడి చిటికెన వేలుతో గోవర్ధనగిరిని ఎత్తాడు. రెండవది శ్రీకృష్ణుడే గోవర్ధనగిరిగా నిలుచున్నాడు. అన్నకూటన్ని చూసి దయతో స్వీకరించారు. నిజానికి అతని శరీరంలో ఏ ఒక్క భాగమైన కళ్ళు, చెవులు, చేతులు మొదలైన అవయవాల లాగ పని చేయగలవు. ఈ కారణంగానే ఆయనకు సమర్పించిన ఆహారము ప్రసాదంగా మారుతుంది.

–డా॥ హరెక్రిష్ణ చంద్రశేకరన్

జ్యోతిష్యశాస్త్రం

శాస్త్రీయ విజ్ఞానం

(నిన్నటి తరువాయి) భారతీయ జ్యోతిష్య విజ్ఞానం ప్రతి శాస్త్రంతోనూ అనుసంధానింపబడి ఉంది. అయుర్వేదంలో కూడా ‘రోగి’ జన్మకుండలిని అనుసరించి వైద్యంచేసే విధానం ఉంది. గృహ నిర్మాణం, వ్యవసాయం, ప్రయాణం, యుద్ధాలు వివాహాది సంస్కారాలలో, చివరకు దైనందిన కార్యక్రమాలలో తిథి, నక్షత్రం చూడకుండా పనులు ప్రారంభించనంతంగా ఈ శాస్త్రం భారత జనజీవనంలో మమేకమైనది.

జ్యోతిష్యశాస్త్రం ఒట్టి బూటకమని, అది మనుషులను మోసం చేసే ప్రక్రియ అనీ, ఇది శాస్త్రం కాదని, కేవలం ఒక మూఢ నమ్మకమనీ, ఎందరో విమర్శకులు చెబుతున్నా ప్రపంచ వ్యాప్తంగా జ్యోతిష్యశాస్త్రం ప్రాముఖ్యత తగ్గటం లేదు. ఆధునిక వైద్య శాస్త్రం కూడా అన్ని రోగాలకు నివారణ ఇవ్వదు. ఒక వైద్యుడు రోగం నయం చేసినట్టు మరో వైద్యుడు నయం చేయలేడు. ఒక వైద్య విధానం చెప్పిన దానిని మరో వైద్య విధానం వ్యతిరేకిస్తుంది. అయినా! వైద్యాన్ని విజ్ఞానం అంటాము కానీ, నమ్మకం అనం.అలాగే జ్యోతిష్యం విజ్ఞానమా? నమ్మకమా? అన్నది వాళ్ల విచక్షణకే వదలివేద్దాం. దీనిని ఉపయోగించుకుని ముందుకు పోయే వారిని ఎవరూ నిరోధించలేరు.

‘నాడీ జోస్యం’


మన యొక్క భూత భవిష్యత్ వర్తమానాలను తెలియజేసే తాళపత్ర గ్రంథాలు భారతదేశంలో కొన్ని కుటుంబాల వద్ద ఉన్నాయి. ఆ కుటుంబాలు వాటిని పరంపరగా, చాలా జాగ్రత్తగా కాపాడుకుంటూ వస్తున్నాయి. ‘శివపార్వతుల’ సంభాషణగా, సిద్ధులందించిన ఈ విజ్ఞాన నిధిని ‘నాడీ జ్యోతిష్యం’ అంటారు.

దక్షిణ భారతదేశంలో తమిళనాడులోని ‘చిదంబరం’ పట్టణానికి దగ్గర గల ‘వైదీశ్వరన్ కోయిల్’ అనే గ్రామంలో కొన్ని కుటుంబాల వద్ద ఈ తాళపత్రాలు ఉన్నాయి. ఈ తాళపత్రాలనే నాడీ పత్రాలు అంటారు.

ఇప్పుడు మనకు లభిస్తున్న తాళపత్రాలు కొన్ని మాత్రమే. కనుక అందరి వృత్తాంతాలు ఈ నాడీ పత్రాలలో ఉండవు. కొన్ని తాళపత్ర గ్రంథాలను ఆనాటి తంజావూరు మహారాజు ‘షర్భోజి–2’ ‘సరస్వతీ మహల్’ గ్రంథాలయంలో ఉంచగా, వాటిని బ్రిటిష్ వారు స్వాధీనపరచుకొన్నట్టు చెబుతారు. బ్రిటిషు వారి నుంచి వాటిని సంపాదించి కొందరు విదేశీయులు వీనితో వ్యాపారం చేస్తున్నారు.

ఈ ‘నాడీ జోస్య’ విధానం

మొదట వ్యక్తి తన చేతి బొటన వేలిముద్ర ఇవ్వాలి. దీని ఆధారంగా నిపుణులు తాళపత్ర గ్రంథాలను పరిశీలించి ఆ వ్యక్తి వివరాలను తెలియజేస్తారు, అవి సరిపోలితే తదుపరి పరిశీలన ప్రారంభిస్తారు. ఇలా నూరుమందిలో ఏ ఇద్దరికో, ముగ్గురికో సరైన వివరాలు లభిస్తాయి. ఆ లభించిన వారికి తండ్రి పేరు, తల్లి పేరుతో సహా, పుత్రుల, భార్య పేరు తెలియజేయటం కూడా అబ్బురపరిచే విషయం. ఇందులో కూడా కొందరు నకిలీ నాడి జోస్యులు ప్రవేశించి శాస్త్రాన్ని వ్యాపారపరంగా వాడుకుంటున్నారు. ఏది ఏమైనప్పటికీ, ఈ ప్రక్రియను కనుగొన్న సిద్ధులను, పరంపరగా దీనిని కాపాడుకుంటున్న కుటుంబాలను మనం అభినందిచాలి. మన కృతజ్ఞతలు తెలియజేయాలి.



బీజేపీ జాతీయ మేనిఫెస్టో కమిటీ భేటీ

న్యూఢిల్లీ: భారతీయ జనతా పార్టీ ఎన్నికల మేనిఫెస్టో కమిటీ ఆదివారం భేటీ అయ్యింది. కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో ఆ పార్టీ ప్రధాన కార్యాలయంలో ఈ సమావేశం జరిగింది. బీజేపీ ఎన్నికల మేనిఫెస్టో కమిటీలో మొత్తం 20 మంది సభ్యులున్నారు. కేంద్ర మంత్రులు అరుణ్ జైట్లీ, నిర్మల సీతారామన్, థావర్ చంద్ గెహ్లాట్, రవిశంకర్ ప్రసాద్, పీయూష్ గోయల్, ముక్తార్ అబ్బాస్ నఖ్వీ, కేజే అల్ఫోన్స్, శివరాజ్ సింగ్ చౌహాన్, కిరణ్ రిజిజు, సుశీల్ కుమార్ మోదీ, కేశవ్‌ప్రసాద్ మౌర్య, అర్జున్‌ముండా, రామ్‌మాధవ్, భూపేంద్ర యాదవ్, నారాయణ్ రాణే, మీనాక్షి లేఖి, సంజయ్ పాశ్వాన్, హరి బాబు, రాజేంద్ర మోహన్ సింగ్ ఈ కమిటీలో ఉన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల ప్రణాళికను ఈ కమిటీ తయారు చేస్తుంది. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మీడియాతో మాట్లాడుతూ ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు ఏర్పరుచుకునేందుకు 15 కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ఇక యుద్ధ ప్రాతిపదికన..

అభివృద్ధి కార్యక్రమాలు

(మొదటిపేజీ తరువాయి) ఉన్నతాధికారి ఒకరు తెలియజేశారు. నిజామ్ చక్కెర కర్మాగారం, టెక్స్‌టైల్ పార్కులు ఏర్పాటు, ఫార్మా రంగంలో తీసుకోవాల్సిన చర్యలు, కేంద్రప్రభుత్వం అనుమతులతో ముడిపడి ఉన్న బయ్యారం ఉక్కు కర్మాగారం ఏర్పాటుకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై నివేదికలను తయారు చెయ్యటానికి అధికారులు సిద్ధమవుతున్నారు.

పరిశ్రమలశాఖ పరిధిలో నిజాం చక్కెర కర్మాగారం

రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకమైన నిజామ్ చక్కెర కర్మాగారాన్ని పునరుద్ధరించాలని ముఖ్యమంత్రి పట్టుదలతో ఉన్నట్లు తెలిసింది. దీనిని సహకార రంగంలో ఏర్పాటు చెయ్యాలని రాష్ట్రం ఏర్పాటు అయిన కొంత కాలం తరువాత ప్రతిపాదించారు. అయితే ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న సహకార చక్కెర కర్మాగారాలు మూతపడటం, రైతులు కూడా సహకార కర్మాగారం ఏర్పాటుకు విముఖత చూపడటంతో ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చలేదు. ఈ కర్మాగారం మూతపడటం వలన సుమారు 10 వేల మంది కార్మికులు ఉపాధి కోల్పోవడం, పరోక్షంగా అనేకమంది నష్టపోవడంతో రైతులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగ సంఘాల నాయకులు ప్రభుత్వ ఆధ్వర్యంలోనే దీనిని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ని కోరారు. దీంతో ఏదిఏమైనా అయితే రైతులకు మేలు చేకూరుతుందో సమగ్రమైన ప్రణాళికను తయారు చెయ్యాలని పరిశ్రమల శాఖ అధికారులను ఇటీవల ముఖ్యమంత్రి ఆదేశించినట్లు తెలిసింది. అదేవిధంగా చక్కెర రంగంపై అవగాహన ఉన్న అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు తీసుకోవాలని, వేల కోట్ల రూపాయల ఆస్తులు కలిగిన ఈ కర్మాగారాన్ని ఎలాగైనా పునరుద్ధరించాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు తెలిసింది. అలాగే బయ్యారం ఉక్కు కర్మాగారం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని,కేంద్ర ఉక్కు గనుల మంత్రిత్వ శాఖ అధికారుల సూచనకు అనుగుణంగా చర్యలు తీసుకోవటం, రాష్ట్రంలో ఉక్కు ఉత్పత్తికి అవసరమైన ముడి సరుకు, రవాణా సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని అందువల్ల ఉక్కు కర్మాగారం రాష్ట్రంలో ఏర్పాటు కావాలన్న పట్టుదలతో ముఖ్యమంత్రి ఉన్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో పూర్తిస్థాయి ప్రయత్నాలు కూడా ప్రారంభమైనట్లు సమాచారం.

సంక్రాంతి జీవితాల్లో వెలుగులు నింపాలి

- ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- స్వర్ణ భారతి ట్రస్టులో సంక్రాంతి సంబరాలు



విజయక్రాంతి, హైదరాబాద్: శంషాబాద్ మండలం ముచ్చింతల్‌లోని స్వర్ణభారత్ ట్రస్ట్ హైదరాబాద్ ఛాప్టర్ రెండవ వార్షికోత్సవంతోపాటు సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. భారత ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు, కేంద్ర న్యాయశాఖ, ఎలక్ట్రానిక్స్, ఐ.టి. శాఖామంత్రి రవిశంకర్ ప్రసాద్, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ తొట్టతిల్ బి. రాధాకృష్ణన్ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. తెలంగాణ జానపద సంస్కృతిని ప్రతిబింబించే విధంగా ఏర్పాటు చేసిన తప్పెట గుళ్ళు, ఒగ్గుడోలు, హరిదాసులు, గంగిరెద్దులు, పిట్టలదొర లాంటి జానపద కళారూపాలతో పాటు పశుప్రదర్శన, బొమ్మల కొలువు ప్రతి ఒక్కరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సునీత, కృష్ణ బృందం సంగీత విభావరి, తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించిన పేరిణి నృత్యం, చి. విష్ణుభట్ల కార్తిక్ పాడిన తెలుగు పద్య శ్లోకాలు ఆహుతుల్ని అలరించాయి. కార్యక్రమాల్లో భాగంగా ముగ్గుల పోటీల విజేతలకు బహుమతుల ప్రదానంతో పాటు, స్వర్ణభారత్ ట్రస్ట్‌లో శిక్షణను పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికేట్లు అందించారు.

ఉపరాష్ట్రపతి శుభాకాంక్షలు..

సంక్రాంతి పండుగ సందర్భంగా ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సంక్రాంతి అందరి జీవితాల్లో భవ్యకాంతులు తీసుకు రావాలని, అందరికీ మంచి భవిష్యత్ లభించాలని ఆయన ఆకాంక్షించారు. స్వర్ణభారత్ ట్రస్ట్ లో శిక్షణ పొందిన విద్యార్థులకు నూరు శాతం ప్లేస్‌మెంట్ లభించడం అభినందనీయమని ఉపరాష్ట్రపతి తెలిపారు. ట్రస్ట్‌లో జరిగే సేవా కార్యక్ర మాలు తనకు ఎంతో సంతృప్తిని కలిగిస్తాయని అన్నారు. తన శ్రీమతి ఉషమ్మ, కుమారుడు హర్షవర్ధన్, కుమార్తె దీపా వెంకట్ అందిస్తున్న సహకారం వల్లనే స్వర్ణభారత్ ఈ స్థాయికి చేరిందని, ఈ సంస్థ కోసం అడుగడుగున సహకారం అందిస్తున్న మిత్రులను మరవపోలేని, సంకల్పం తనదే అయినప్పటికీ, సేవా సంకల్పంతో స్వర్ణభారత్ ట్రస్ట్ అభివృద్ధికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ ఆయన అభినందనలు తెలిపారు. మూలాలు తరలి వెళ్ళాలని, భారతీయ సంస్కృతి పునరుజ్జీవనానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. జీవన పద్ధతుల్లో మార్పు లకు శ్రీకారం చుట్టాలని, భారతీయుల ఆహారపు అలవాట్లు కాల పరీక్షకు నిలబడ్డాయని, మనది కాని ఆహారం మీద మోజు తగ్గించుకోవాలని ఆయన సూచించారు. యువత వ్యవసాయం వైపు రావా లని, వ్యవసాయ రంగంలో నిర్మాణాత్మక మార్పులు అవసరమని ఆకాంక్షించారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో స్వర్ణభారత్

కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్

అశోకుని కాలంలో భారత దేశాన్ని స్వర్ణభారతం అని పిలిచే వారని, ఆ పేరు వెనుక ఆలోచన ఎవరిదో తెలియదు గానీ, స్వర్ణభారత్ ట్రస్ట్ సామాజిక మార్పు కోసం పని చేస్తోందని కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ శ్లాఘించారు. భారతదేశ మూల భావన అయిన భిన్నత్వంలో ఏకత్వానికి స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రతీక అని, పేదలు, రైతులు, మహిళల అభివృద్ధికి వెంకయ్యనాయుడు చిత్తశుద్ధితో పని చేస్తారని, వారి క్రాంతదర్శనం గొప్పదని, అందుకే స్వర్ణభారత్ ట్రస్ట్ అంతర్జాతీయ ప్రమాణాలతో ముందుకు సాగుతోందని ఆయన తెలిపారు.

బ్రెవరేజస్ కార్పొరేషన్

ఉద్యోగులకు వైద్యబీమా..



- కష్టపడే ఉద్యోగులకు అన్ని సౌకర్యాలు కలుగచేస్తాం
- రెవిన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి సోమేశ్ కుమార్

విజయక్రాంతి,హైదరాబాద్: రాష్ట్రప్రభుత్వానికి అత్యధిక ఆదాయాన్ని సమకూర్చిపెడుతున్న ఆబ్కారీ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల అభ్యున్నతికి ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి సోమేశ్ కుమార్ తెలియజేసారు. రాష్ట్ర బ్రెవరేజస్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు నగదు రహిత వైద్య బీమా సౌకర్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కలగ చేసింది. ఆదివారం జలవిహార్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రంలో ఈ పథకానికి లాఛనంగా ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న సోమేశ్ కుమార్ ప్రసంగిస్తూ ఉద్యోగులు కష్టపడి పనిచేస్తేనే సంస్థలు లాభాలను ఆర్జిస్తాయని వివరించారు. రాష్ట్ర బ్రెవరేజస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాదరావు మాట్లాడుతూ ఈ పథకం అన్ని ప్రభుత్వ రంగ సంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ ఈ ఆరోగ్య పథకం వర్తించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. శాసనమండలి సభ్యుడు భానుప్రసాద్ రావు ప్రసంగిస్తూ ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొనివెళ్ళి పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆబ్కారీ శాఖ అదనపు డైరెక్టర్ అజేయరావు, ఉద్యోగుల సంఘం నాయుకులు సత్యం, శ్రీనివాసరావు, ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ ప్రధానకార్యదర్శి జి. జె. జీవన్ పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అందరికీ కల్పించాలి: రాష్ట్ర బ్రెవరేజ్ కార్పొరేషన్ ఉద్యోగులకు వైద్య బీమా సౌకర్యం కలుగ చేయడం పట్ల తెలంగాణా జాయింట్ యాక్షన్ కమిటీ హర్షం వ్యక్తం చేసింది. ఈపథకాన్ని రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ రంగ సంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ వర్తింప చేయాలని కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ పురుషోత్తం, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగుల సంఘం నాయుకులు సుధీర్‌బాబు, జీవన్ తదితరులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బీమా సౌకర్యం లేకపోవటం వాళ్ళ ఉద్యోగులు వారి కుంటుంబ సభ్యులు ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని, ప్రభుత్వం చొరవ తీసుకోని ఈ పథకం అమలు అయ్యేటట్లు కృషి చెయ్యాలని వారు కోరారు.

పొత్తుతో ఎవరు చిత్తు..?

(మొదటిపేజీ తరువాయి) 2017 శాసనసభ ఎన్నికల్లో త్రిముఖ పోటీ కారణంగా బీజేపీ సునాయసంగా విజయం సాధించింది. అయితే ఆ రెండు ఎన్నికల్లో మోడీ, యోగి ఆదిత్యనాథ్ ఛరిష్మా కారణంగా బీజేపీకి పూర్తిగా పరిస్థితులు అనుకూలించాయి. ఇప్పుడా మోడీ, యోగి ఛరిష్మా పరిస్థితి యూపీలో లేదు. అందుకు గతేడాలో యూపీలో జరిగిన మూడు లోక్ సభ స్థానాల ఎన్నికల్లో ఓటమి, ఇటీవలే జరిగిన రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ఓటమితో బీజేపీ శ్రేణులు ఢీలా పడ్డాయి.

ఈబీసీ, మందిరంపై బీజేపీ ఆశలు

ఎస్పీ, బీఎస్పీ కూటమి ఏర్పాటు కావడంతో బీజేపీకి యూపీలో నష్టం కలుగుతుందన్న భయం మొదలైంది. ఎందుకంటే గత ఎన్నికల్లో ఈ రాష్ట్రం నుంచి గెలిచిన సీట్లే.. బీజేపీకి అండగా నిలిచాయి. ఇప్పుడు ఎస్పీ, బీఎస్పీ కూటమి ఏర్పాటుతో ఆశలు అడుగంటాయి. అయితే ఇటీవల మోడీ సర్కారు తెచ్చిన ఈబీసీ బిల్లుపై బీజేపీ ఆశలు పెట్టుకుంది. యూపీలో ఉన్నత కులాల 12 శాతం ఓట్లు ఉన్నాయి. ఈబీసీ బిల్లు తెచ్చిన కారణంగా ఈ వర్గాల ఓట్లు తమకు గంపగుత్తగా పడతాయని బీజేపీ నేతలు ఆశిస్తున్నారు. అయితే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంలో తెచ్చిన సవరణలు తమ వర్గాలకు ఇబ్బందులు పెట్టే విధంగా ఉన్నాయన్న అసంతృప్తితో ఉన్న ఈ వర్గాలు ఏ మాత్రం సహకరిస్తారన్నది కూడా ప్రశ్నార్థకమే. అదే విధంగా రామ మందిర నిర్మాణ వివాదం కూడా ఓట్లు రాలుస్తుందన్న బీజేపీ ఆశలు నెరవేరే పరిస్థితులు కన్పించడం లేదు. మోడీ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టి ఐదేళ్లు కావస్తున్నా.. ఇప్పటివరకూ రామ మందిరి నిర్మాణ అంశంపై ఎలాంటి ముందడుగు పడలేదు. ఇటీవల మోడీ ఇచ్చిన ఇంటర్వ్యూలో మందిర నిర్మాణంపై సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన తర్వాతే చర్యలుంటాయని స్పష్టం చేశారు. దీంతో మందిర నిర్మాణ అంశం కూడా బీజేపీకి లాభించే పరిస్థితులు కన్పించడం లేదు. పైగా యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఛరిష్మా కూడా తగ్గుతోంది. ముఖ్యమంత్రిగా యోగి బాధ్యతలు స్వీకరించిన సమయంలో ప్రజలకు కలిగిన ఆశలకు అనుగుణంగా పాలన సాగడం లేదన్న విమర్శలు కూడా ఉన్నాయి. ఏదిఏమైనా.. ఎస్పీ, బీఎస్పీ పొత్తు కారణంగా బీజేపీకి నష్టం కచ్చితంగా జరుగుతుంది. ఈ కూటమిలో కాంగ్రెస్‌ను చేర్చుకుంటే బీజేపీకి మరింత నష్టం కలుగుతుంది. ఏదైనా అద్భుతం జరిగితే తప్ప యూపీలో బీజేపీకి లబ్ధి చేకూరే అవకాశాలు ఎంత మాత్రం కన్పించడం లేదు.

2014 ఎన్నికల్లో ఓట్లు, సీట్లు

పార్టీ	ఓట్ల శాతం	గెలిచిన సీట్లు
బీజేపీ	42.30	71
ఎస్పీ	22.20	05
బీఎస్పీ	19.60	00
కాంగ్రెస్	07.50	02
అప్నాదళ్	01.00	02
రాష్ట్రీయ లోక్‌దళ్	–––	00

పంచాయతీ ఎన్నికలపై టీఆర్ఎస్ ఫోకస్

(మొదటిపేజీ తరువాయి) అన్ని రాజకీయ పార్టీల్లాగా కాకుండా టీఆర్ఎస్ పార్టీని ప్రజల్లోకి వినూత్నంగా తీసుకెళ్లాలని యోచిస్తున్నట్లు సమాచారం. దీంట్లో భాగంగానే ప్రతి జిల్లాలో పార్టీకి శాశ్వత భవనాలు నిర్మించనున్నట్లు కేటీఆర్ వెల్లడించిన విషయం తెలిసిందే. దీంతో టీఆర్ఎస్ పార్టీకి ప్రతి జిల్లాల్లో సొంత ఆస్తులను కూడబెట్టేందుకు ఆ పార్టీ అధినేత యోచిస్తున్నారు. వాస్తవానికి రాజకీయ పార్టీలకు జిల్లా స్థాయిలో కమ్యూనిస్టు పార్టీల కు సొంత భవనాలుంటాయి. మిగతా బూర్జువా రాజకీయ పార్టీలకు జిల్లా స్థాయిలో పార్టీ భవనాలు లేవు. జిల్లా కేంద్రాల్లో పార్టీ భవనాలను నిర్మించాలని టీఆర్ఎస్ పార్టీ యోచించడమే వినూత్నంగా ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. దీన్నిబట్టి భవిష్యత్‌లో టీఆర్ఎస్ పార్టీ విధానాలు వినూత్నంగా చేపట్టనున్నది. అంతేకాకుండా ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 88 సీట్లు కైవసం చేసుకొని అఖండ విజయం సాధించినప్పటికీ మిగతా పార్టీల నుంచి మరికొంత ఎమ్మెల్యేలను పార్టీలోకి ముఖ్యమంత్రి కే.చంద్రశేఖరరావు ఆహ్వానిస్తున్నారు. తెలంగాణలో మిగతా పార్టీలకు స్థానం లేకుండా కేవలం టీఆర్ఎస్ పార్టీలోనే ప్రతి ఒక్కరూ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని యోచిస్తున్నది. మిగతా పార్టీ ఎమ్మెల్యేలతో పాటు టీఆర్ఎస్ పార్టీలోని అసంతృప్తులను కూడా తిరిగి పార్టీలోకి తీసుకురావాలని ఆయా జిల్లా, నియోజకవర్గ స్థాయి నాయకులకు ఆదేశాలు జారీచేసినట్లు తెలిసింది. దీన్నిబట్టి పార్టీ బలోపేతంపైనే టీఆర్ఎస్ పార్టీ ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించిందని అర్థమవుతోంది. పార్లమెంటు ఎన్నికల్లోపు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కూడా ఉప్పెనగా చేపట్టాలని పార్టీ శ్రేణులకు ఇప్పటికే కేటీఆర్ పిలుపు నిచ్చారు.

ప్రతి ఒక్కరినీ టీఆర్ఎస్ పార్టీలో సభ్యులుగా చేర్చేందుకు దృష్టి పెట్టాలని సూచించింది. ప్రతి గ్రామంలో పార్టీ సభ్యత్వ కార్యక్రమం, సంస్థాగత ఎన్నికలను కూడా నిర్వహించనున్నారు. ప్రభు త్వం, పార్టీ రెండు సమన్వయం చేసుకుంటూ సంక్షే మ, అభివృద్ధి పథకాలను ప్రజలకు అందించాలని ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. అంతేకాకుండా పార్లమెం టు ఎన్నికల్లో కూడా అసెంబ్లీ ఫలితాలు పునరావృత్తం కావాలని కేసీఆర్ భావిస్తున్నారు.

ఒంటరిగా.. 80 స్థానాల్లో పోటీ

(మొదటిపేజీ తరువాయి) అన్ని స్థానాల్లో ఒంటరిగా పోటీ చేస్తున్నట్లు ఆజాద్ ప్రకటించారు. ఎన్నికలు ఎదుర్కొనేందుకు పార్టీ పూర్తి సన్నద్ధతతో ఉందన్నారు. 2009లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ నెంబర్ వన్ పార్టీగా నిలిచిన విషయాన్ని గుర్తుచేస్తూ యూపీలో మళ్లీ ఆ పరిస్థితి పునరావృతం అవుతుందన్నారు. సొంతంగానే పోటీచేసి అప్పటి కంటే రెట్టింపు సీట్లు కాంగ్రెస్ సాధిస్తుందని గులామ్ నబీ ఆజాద్ ధీమా వ్యక్తం చేసారు. బీజేపీని ఓడించేందుకు అవసరమైతే తమతో కలిసివచ్చే పార్టీలను కలుపుకుని పోతామని ఆయన తెలిపారు. కాగా కీలకమైన ఉత్తరప్రదేశ్ లోక్‌సభ ఎన్నికల్లో సమాజ్‌వాదీ, బహుజన్ సమాజ్ వాదీ పార్టీ కూటమిగా ఏర్పడటంతో కాంగ్రెస్ పార్టీ కూడా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఎన్నికలు సమీపించే కొద్దీ సమీకరణలు మారే అవకాశాలు లేకపోలేదంటూ ఓవైపు చెబుతూనే, మరోవైపు పూర్తి శక్తిసామర్థ్యాలతో యూపీ ఎన్నికల్లో పోరాడతామన్న సంకేతాలిస్తోంది. మరోవైపు బీజేపీని ఓడించాలన్న లక్ష్యంతో అఖిలేష్, మాయావతిలు తమ దశాబ్దకాల వైరాన్ని వీడి చేతులు కలిపిన సంగతి తెలిసిందే. ఎస్పీ, బీఎస్పీ చెరో 38 స్థానాల్లో పోటీ చేస్తాయని శనివారం నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో వారిద్దరు వెల్లడించారు. యూపీలో ఎలాంటి బలం లేని కాంగ్రెస్‌తో పొత్తు ప్రస్తావన లేదని కూడా స్పష్టం చేశారు. అయితే రాహుల్, సోనియా ప్రాతినిథ్యం వహిస్తున్న అమేథి, రాయబరేలి స్థానాలలో పోటీ చేయమనడం గమనార్హం. కాగా, వీరి పొత్తుపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ స్పందించారు. కాంగ్రెస్‌ను కాదని ఈ కూటమి ఏర్పాటు చేయడంపై తానేమీ నిరాశ చెందట్లేదని దుబాయ్ పర్యటన సందర్భంగా ఆయన వెల్లడించారు. 'ఎస్పీ, బీఎస్పీ వారికి నచ్చినట్లు నిర్ణయాలు తీసుకున్నాయి. వారికి నచ్చినట్లు ప్రవర్తించే హక్కు వారికి ఉంది. అలాగే మేమూ సొంత ఆలోచనల ప్రకారం ముందుకెళ్తాం. నాకు ఎస్పీ, బీఎస్పీ నాయకులపై అపారమైన గౌరవం ఉందన్నారు.

న్యాయం పక్షమే మనమంతా ఉండాలి

న్యూఢిల్లీ: మనమంతా న్యాయం పక్షం ఉండాలని సిక్కుల గురువులు అందరికీ బోధించారని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. సిక్కుల ఆధ్యాత్మిక గురువు గురు గోబింద్ సింగ్ జయంత్యుత్సవాల సందర్భంగా ఆదివారం స్మారక నాణేలను ఆయన విడుదల చేశారు. ఢిల్లీలోని ప్రధాని మోదీ అధికారిక నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌తోపాటు సిక్కుల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఈ సందర్భంగా కాంగ్రెస్‌ను విమర్శించిన మోదీ, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పై చురకలు వేశారు. 1984 నాటి సిక్కుల ఊచకోత కేసులో కాంగ్రెస్ నేత సజ్జన్ కుమార్‌కు కోర్టు ఇటీవలే శిక్ష విధించిన తీరును ఆయన ప్రస్తావించారు. న్యాయం పక్షంలో ఉండాలని సిక్కుల గురువులు మనకు చెప్పారన్నారు. కేంద్ర ప్రభుత్వం వారి బాటలోనే నడుస్తోందని, 1984 సిక్కుల ఊచకోత బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేసిందన్నారు. అలాగే 1947లో కాంగ్రెస్ ప్రభుత్వం కర్తార్పూర్ విషయంలో సరైన నిర్ణయం తీసుకోలేకపోయిందని మోదీ పరోక్షంగా దుయ్యబట్టారు.

పాకిస్థాన్‌లోని కర్తార్పూర్ సాహిబ్‌లోని గురు నానక్ దేవ్‌ను ఇకపై టెలిస్కోప్ ద్వారా దర్శించుకోవలసిన అవసరం ఉండదన్నారు. 1947 నాటి దేశ విభజనలో పాకిస్తాన్ భూభాగంలోకి వెళ్లడం పెద్ద తప్పిదమన్నారు. దీన్ని మనం పొందలేకపోయినా కర్తార్పూర్ కారిడార్ ఆ బాధను కొంతమేర తగ్గిస్తుందని వ్యాఖ్యానించారు. సిక్కుల ఆరాధ్యదైవం కొలువైన ప్రాంతం దేశ సరిహద్దులకు కేవలం కొద్ది కిలోమీటర్ల దూరంలో ఉన్న కర్తార్పూర్ గురుద్వారా దర్బార్ సాహిబ్‌ను అప్పట్లో నిర్లక్ష్యం చేశారని ఆయన ఆరోపించారు. నాటి పొరపాటును సరిదిద్దామని కర్తార్పూర్ వెళ్ళేందుకు రోడ్డును నిర్మిస్తున్నామని, వీసా లేకుండా అక్కడికి వెళ్ళవచ్చని మోదీ తెలిపారు. భారత్ సరిహద్దుల నుంచి 4 కి.మీ. దూరంలో పాకిస్థాన్‌లోని కర్తార్పూర్ గురుద్వారాలో సిక్కుల గురువు గురు నానక్ 18 సంవత్సరాలపాటు ఉన్నారు. కాగా గురు నానక్ 550వ జయంత్యుత్సవాల్లో భాగంగా భారత్‌లోని సిక్కులు ఈ గురుద్వారాను సందర్శించేందుకు ఈ సంవత్సరం అవకాశం కలిగింది. పంజాబ్ నుంచి పాకిస్థాన్ సరిహద్దుల వరకు ఇరు దేశాలు తమ తమ భూభాగాల్లో రోడ్డును నిర్మిస్తున్నాయి.

చీఫ్ విజిలెన్స్ కమిషనర్‌ను తొలగించండి

- కేంద్రం చేతిలో కేవీ చౌదరి తోలు బొమ్మ
- కాంగ్రెస్ అధికార ప్రతినిధి సింఘ్వీ డిమాండ్
- అలోక్ వర్మను కేంద్రం తొలగించిన తీరుపై మండిపాటు

న్యూఢిల్లీ: చీఫ్ విజిలెన్స్ కమిషనర్‌ను ఆ పదవి నుంచి తొలగించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. కేవీ చౌదరి ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మగా పని చేశారని కాంగ్రెస్ అధికార ప్రతినిధి అభిషేక్ మను సింఘ్వీ ఆరోపించారు. ఆదివారం పార్టీ ప్రధాన కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) చీఫ్ అలోక్ వర్మను తొలగించిన నరేంద్ర మోదీ ప్రభుత్వంపై తీరుపై మండిపడ్డారు. రఫేల్ యుద్ధ విమానాల ఒప్పందం కేసులో దర్యాప్తును నివారించేందుకు సీవీసీని కీలుబొమ్మగా మార్చారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ రాయబారిగానూ, వార్తాహరుడిగానూ సీవీసీ వ్యవహరిస్తున్నారని, సీబీఐ స్పెషల్ డైరెక్టర్ ఆస్థానా తరపున లాబీయింగ్ చేస్తున్నారని ఆయన విమర్శించారు. కేవీ చౌదరిని సీవీసీ పదవి నుంచి తొలగించాలని లేదా ఆయనే స్వయంగా రాజీనామా చేయాలని సింఘ్వి డిమాండ్ చేశారు.

అలోక్‌పై చర్యలు సరికాదు: ఖర్గే

మరోవైపు సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మను ఆ పదవి నుంచి తొలగించిన విధానంపై కాంగ్రెస్ సీనియర్ నేత మల్లికార్జున ఖర్గే తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తాము ఆయనకు మద్దతు తెలిపేలా వ్యవహరించడం లేదన్న ఆయన, ప్రతి అంశం చట్టప్రకారం జరగాలన్నదే తమ విధానమన్నారు. అలోక్ వర్మపై కేవలం ఒకే నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవడం ఏంటని ఖర్గే ప్రశ్నించారు.

కార్వాన్‌లో మర్రిచెన్నారెడ్డి శతజయంతి వేడుకలు



విజయక్రాంతి, మెహిదిపట్నం: మర్రి చెన్నారెడ్డి చేసిన సేవలు మరువలేనివని సీఎంగా, గవర్నర్‌గానే కాకుండా తెలంగాణా కోసం పోరాడిన మహనీయుడని తెలిపారు. కార్వాన్‌లోని అన్నపూర్ణ నగర్ హనుమాన్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు చెందిన గుర్జాల ప్రహ్లద్ యాదవ్ ఆధ్వర్యంలో చెన్నారెడ్డి శతజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో టప్పాచబుత్రా ఇన్‌స్పెక్టర్ వెంకట్ రాములు ముఖ్యఅతిధిగా విచ్చేసి చెన్నారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం చిన్నారులకు గాలిపటాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు అడికె మల్లికార్జున్, పి.మెహన్, జే.శ్యామ్‌రాజ్, సంగమేశ్వర్‌రావు, రాజు, ముల్లే, నికిలేశ్ పాల్గొన్నారు.

నేటి నుంచి నామినేషన్ల పరిశీలన

(మొదటిపేజీ తరువాయి) వార్డులకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించింది. 19 గ్రామ పంచాయతీల్లో పలు కారణాలతో పాటు కోర్టుల్లో కేసులుండడం వల్ల ఎన్నికలు జరగడం లేదు. మరో 15 గ్రామ పంచాయతీల్లో పదవీకాలం పూర్తి కావడానికి ఇంకా సమయం ఉంది. ఈ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 1,13, 190 పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



విజయక్రాంతి; బోడుప్పల్: అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా టీఆర్ఎస్ ప్రభుతం కృషి చేస్తుందని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మేడిపల్లి యాదవ సంఘం ఆధ్వర్యంలో రుపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ నూతన సంవత్సరంలో అందరికి మంచి జరగాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి యాదవ సంఘం అధ్యక్షుడు, ఫిర్జాదిగూడ టీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి పాశం బుచ్చి యాదవ్, దేవేందర్ యాదవ్, పాశం రాజు యాదవ్, సత్యనారాయణ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, ఆంజనేయులు యాదవ్, పాశం నాగేష్ యాదవ్, వెంకటేష్ యాదవ్, నాగేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మన సంస్కృతిని కాపాడుకుందాం




విజయక్రాంతి, హైదరాబాద్: భారతీయ సంస్కృతి ఎంతో ఉన్నతమైనదని, ఇలాంటి సంస్కతిని కాపాడుకోవలసిన బాధ్యత మనందరికీ ఉందని ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడు అభిప్రాయ పడ్డారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన కైట్స్, స్వీట్స్ ఇంటర్నేషన్ ఫెస్టివల్‌కు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఇలాంటి పండుగల ద్వారా అందరూ ఒకే చోటకు చేరుకోవడం, అభిప్రాయలను పంచుకోవడం సాధ్యమౌతుందని తెలిపారు. ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేసిన ఉపరాష్ట్రపతి, ఈ సంక్రాంతి అందరి జీవితాల్లో కొత్త కాంతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రజలు సంప్రదాయాలను మరచిపోకుండా, అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, ఈ కార్యక్రమాల వెనుక సహకారం అందిస్తున్న ప్రతి ఒక్కరికీ ఉపరాష్ట్రపతి అభినందనలు తెలిపారు.

మనం ఎంత ఎత్తుకు ఎదిగినా మన మూలం నేలేనని తెలియజేసే భావనలు గాలి పటం ఎగరేయడంలో కనిపిస్తాయని, ఇలాంటి పండుగలు ప్రతి ఒక్కరికీ ఉత్సాహంతో పాటు స్ఫూర్తిని అందిస్తాయని ఉపరాష్ట్రపతి అన్నారు. క్రీడల వల్ల సహనం కూడా పెరుగుతుందని, అలాంటి సహనాన్ని పరిపూర్ణంగా అందించే గాలి పటాలు ఎగరేసే లాంటి పండుగలు మానసిక ఆరోగ్యాన్ని పెంచుతాయన్నారు. మంచిని కోరుతూ తీపిని పంచడం మన సంప్రదాయమని, అంతర్జాతీయంగా వివిధ దేశాల వారికి మనవైన తీపిరుచులను పరిచయం చేసే అంతర్జాతీయ స్వీట్స్ ఉత్సవం, వారి రుచుల్లో ఉండే గొప్పతనాన్ని ఆస్వాదించే ఆస్కారం కల్పిస్తాయని తెలిపారు. భారతీయ సంస్కృతిలో ప్రతి పండుగ వెనుక ఓ కారణం, ప్రతి సంప్రదాయం వెనుక ఓ విశేషం ఉంటుందని తెలిపిన ఉపరాష్ట్రపతి, ఐకమత్యానికి చిహ్నంగా నిలిచే కైట్స్ ఫెస్టివల్, స్వీట్స్ ఫెస్టివల్ లాంటి పండుగలకు అన్ని ప్రభుత్వాలు ప్రోత్సాహాన్ని అందించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మన జీవనానికి ఆహారం మూలమని, సరైన ఆహారం ద్వారా ఆరోగ్యం ఆయుష్షు రెండూ పెరుగుతాయని భారతీయ ఆహారం కాల పరీక్షలకు నిలబడిందని, మనదైన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. నలుడు, భీముడు మొదలుకుని భారతీయుల్లో పాకశాస్త్ర ప్రావీణ్యులు ఎంతో మంది ఉన్నారని, మన దేశంలో ఎన్నో ప్రామాణిక శాస్త్రాలు పుట్టాయని, అన్ని రకాల వంటల గురించి, అవి తినడం వల్ల కలిగే లాభాల గురించి సుకేశముని రచించిన సూప శాస్త్రం గురించి ఉపరాష్ట్రపతి తెలిపారు. మంచి ఎక్కడ ఉన్నా తీసుకోవడంలో తప్పు లేదని, అదే సమయంలో మనవైన ఆహారాన్ని, అలవాట్లను, సంప్రదాయలను వదలి పాశ్చాత్య సంస్కృతి వైపు పరుగులెత్తడం మంచి పద్ధతి కాదని ఉపరాష్ట్రపతి తెలిపారు.ఈ కార్యక్రమానికి తెంలగాణ మండలి చైర్మన్ స్వామి గౌడ్, తెలంగాణ హోంమంత్రి మహమూద్ అలీ, సాంస్కృతిక శాఖ అధ్యక్షులు మామిడి హరికృష్ణ తదితరులు హాజరయ్యారు.

సంక్రాంతి ముగ్గుల పోటీలు

విజయక్రాంతి, మెహిదీపట్నం: నాంపల్లి నియోజకవర్గంలోని ఆసిఫ్‌నగర్ డివిజన్‌లో నాంపల్లి టీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సి.హెచ్ ఆనంద్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో సంక్రాతి ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణా ప్రభుత్వం చేపట్టిన వివిధ పథకాలను ముగ్గుల రూపంలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫ్‌నగర్ డివిజన్ టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మురళీధర్, నరేందర్, ప్రదీప్ అగర్వాల్, విజయ్, మహిళా అధ్యక్షురాలు రజిని, దుర్గా, విజయలక్ష్మి, నియోజకవర్గ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సర్పంచ్ అభ్యర్థి నామినేషన్ దాఖలు



విజయక్రాంతి, బోడుప్పల్: ఘట్‌కేసర్ మండలం కాచవాణి సింగారం గ్రామంలో టీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థిగా కొంతం వెంకట్ రెడ్డి ఆదివారం నామినేషన్ వేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ స్వర్ణలత భీష్మ గౌడ్, మాజీ ఉప సర్పంచ్ రంజీత్ రెడ్డి, టీఆర్ఎస్ నాయకులు సత్తిరెడ్డి, మోహన్ రెడ్డి, భీష్మ గౌడ్, కోండల్ రెడ్డి, ముత్యం, జంగయ్య, విష్ణు గౌడ్, నవీన్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

హోంమంత్రికి మైనార్టీ నాయకుల శుభాకాంక్షలు

విజయక్రాంతి, రాజేంద్రనగర్: తెలంగాణ రాష్ట్ర హోంమంత్రి మహ్మూమద్ అలీకి రాజేంద్రనగర్ సర్కిల్ టీఆర్ఎస్ మైనార్టీ నాయకులు పుష్పగుచ్చాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. టీఆర్ఎస్ మైనార్టీ సీనియర్ నాయకుడు షేక్ మతీన్, శాస్త్రీపురం డివిజన్ ఇన్‌చార్జ్ మహ్మద్ షౌకత్, సులేమాన్‌నగర్ ఏరియా కమిటీ అధ్యక్షుడు ఖదీర్‌ఖాన్, యువజన అధ్యక్షుడు షేక్ రిజ్వాన్, మహ్మద్ మినాజ్, సయ్యద్ అలీంలు మినిస్టర్ క్వార్టర్స్‌లోని ఆయన నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపామన్నారు.

విజయక్రాంతి
సోమవారం 14 జనవరి 2019
హైదరాబాద్

ఊపందుకున్న చివరి రోజు నామినేషన్లు

విజయక్రాంతి, బోథ్: రెండో విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో భాగంగా ఆదివారం చివరి రోజు కావడంతో రెండో రోజు దాఖాలైన 33 గ్రామ పంచాయతీలకు 44 నామినేషన్‌లను అభ్యర్థులు సమర్పించగా, వార్డులకు గాను 165 నామపత్రాలు దాఖలు కాగ నామినేషన్‌లకు చివరి రోజు అయిన ఆదివారం నాడు బోథ్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్‌గా నామినేషన్ సమర్పించిన అభ్యర్థులే తమ రెండో సెట్‌ను మరో మారు స్థానిక గ్రామపంచాయతి కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారి కిషన్ గుప్తకు సమర్పించారు. చివరి రోజు నామినేషన్ వేసిన వారిలో డాక్టర్ సురేందర్ యాదవ్, లింగారెడ్డి, మేర్గు భోజన్న, బొడ్డు శ్రీనివాస్ ఉన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ



విజయక్రాంతి, ఉప్పల్: డాక్టర్ ఏఎస్‌రావు నగర్ డివిజన్ పరిధిలోని ఎమ్ఐజీ బ్లాకులో 10 లక్షల వ్యయంతో నిర్మించనున్న అండర్ గ్రౌడ్ డ్రైనేజీ పనులను ఎఎస్‌రావు డివిజన్ కార్పొరేటర్ పజ్జూరి పావనీ మణిపాల్‌రెడ్డి భూమి పూజ చేశారు. అనంతరం కాలనీలలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలనీలలోని సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నూతనంగా నిర్మిస్తున్న వార్డు కార్యాలయం పనులను పర్యవేక్షించి పనులలో నాణ్యత పాటించాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ ఎఇ.సంతోష్‌రెడ్డి, వాటర్‌వర్క్స్ ఎఇ.వేణుగోపాల్‌లను ఈ సందర్భంగా చర్చలు జరిపి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మెయింటెనెన్స్ ఎఇ.శ్రీనాథ్, కాలనీ నాయకులు సోమయ్యచారి, రాజేశ్వరావు, సింగారావు, రాజు, మణెమ్మ, రామకృష్ణ, రాజమల్లు, శరధ్, మట్ట రాజేశ్వరెడ్డి సురేందర్‌రావు పాల్గొన్నారు.

వంద స్థంభాల గుడికి కొత్త కళ

- విజయక్రాంతి వార్తకు స్పందించిన ప్రభుత్వం
- అధికారులతో సమీక్ష నిర్వహించిన రాష్ట్ర పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి
- చారిత్రక కట్టడాల పరిరక్షణకు అవసరమైన చర్యలకు ఆదేశం



విజయక్రాంతి, బోధన్: బోధన్ లోని చారిత్రక కట్టడం అయిన వందస్థంభాల గుడి పరిరక్షణపై **డిసెంబర్ 2018 29వ తేదీన విజయక్రాంతి దిన పత్రికలో** వచ్చిన వార్తకు తెలంగాణా ప్రభుత్వం స్పందించింది. త్వరలో బోధన్‌లోని వందస్థంభాల గుడి కొత్త అందాలతో ముస్తాబై కొత్త కళ సంతరించుకోనుంది. ఏళ్ల నాటి ఘన చరిత్ర కలిగిన, బోధన్ చరిత్రను భవిష్యత్ తరాలకు అందించే ఈ చారిత్రక శిల్పకలా కట్టడం అధికారుల చిన్నచూపుతో శిథిలావస్థ కు చేరుకున్న తరుణంలో విజయక్రాంతి పేపర్‌లో దీనిపై స్పెషల్ స్టోరీ ప్రచురితం కావటంతో ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 11 న నిర్వహించిన ఈ సమీక్షలో రాష్ట్రంలోని చారిత్రక కట్టడాలను వెంటనే గుర్తించి వాటిని పరిరక్షించాలని, వాటిని వెంటనే పునర్నిర్మాణానికి తగిన చర్యలు వెంటనే తీసుకోవాలని పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి అర్వింద్‌కుమార్ అధికారులకు ఆదేశించారు. సమీక్షలో పాల్గొన్న పురావస్తు శాఖ డైరెక్టర్ విశాలాక్షితో పాటు ఇతర అధికారులకు రాష్ట్రంలోని ఇలాంటి పురాతన కట్టడాలను వెంటనే గుర్తించి వాటి చుట్టూ కంచెవేయడ టంతో పాటు చారిత్రక కట్టడాల ప్రాంతాన్ని శుభ్రం చేసి విద్యుత్ ద్వీపాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గతంలో ప్రభుత్వాలు పట్టించుకోక పోవటంతో ఇలాం టి చారిత్రక కట్టడాలు శిథిలావస్థకు చేరుకున్నాయని వాటిని రక్షించుకోవాల్సిన బాధ్యత ఉందని ఆయన పేర్కొన్నారు. అధికారు తొందరగా చర్యలు చేపడితే త్వరలో బోధన్‌లోని వంద స్థంభాలగుడి రాబోయే కొన్ని రోజుల్లో మరమ్మత్తులకు నోచుకోనుంది. భావితరాలకు చరిత్రను చాటి చెప్పే వంద స్థంభాల గుడి లాంటి చారిత్రక కట్టడాల పునర్నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టడం హర్షనీయమని బోధన్ వాసులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. వంద స్థంభాల గుడిలో ఆకతాయిల అసాంఘిక కార్యకలాపాలకు అడ్డు కట్ట వేసి పడిపోతు న్న స్థంభాలను బాగుచేయించి దానిని పునర్మించి పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి చేస్తే బోధన్ పర్యాటకంగా అభివృద్ధి చెందుతుందని స్థానికులు అంటున్నారు.



చిల్లప్పగారి రాధాకృష్ణ, సునందల ద్వితీయ కుమారుడు ఆదర్శ్ వైష్ణవిల ప్రీ ఎంగేజ్‌మెంట్ కార్యక్రమం, విజయక్రాంతి చైర్మన్ సీఎల్ రాజం నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీ సీఎల్ రాజం, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి విజయా రాజం, డైరెక్టర్ శ్రీకాంత్, శ్రీమతి సౌమ్య, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా వాటర్ ప్లాంట్లు

విజయక్రాంతి, కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు డివిజన్‌లో విచ్చలవిడిగా మినరల్ వాటర్ ప్లాంట్‌ను నిర్వహిస్తున్నారు. ఎలాంటి అనుమతులు పొందకుండానే కొన్ని, మరికొన్ని అనుమతులు పొందినా కనీస ప్రమాణాలు పాటించకుండా ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. అపరిశుభ్రత వాతవరణంలో నిబంధనలకు విరుద్ధంగా వాటర్ ప్లాంట్‌లను నిర్వహిస్తున్నారు. ఒక్కొక్క డబ్బా 20 నుంచి 30 రూపాయాలు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు ప్లాంట్ల యాజమానులు. మినరల్ వాటర్ ప్లాంట్‌లో కనీస జాగ్రత్తలు పాటించడం లేదు. అక్రమ ప్లాంట్లను ఆరికట్టాల్సిన అధికారులు నిమ్మకు నిరేత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీంతో ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు ప్రజల ఆరోగ్యానికి హని తలపెట్టె వాటర్ ప్లాంట్‌లపై కఠిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న



వాటర్ ప్లాంట్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

వర్సిటీల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

విజయక్రాంతి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో పనిచేస్తున్న విశ్వవిద్యాలయాలను అభివృద్ధి చేయాలని తెలంగాణా జాయింట్ యాక్షన్ కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. విశ్వవిద్యాలయాలలో గల ఖాళీలను భర్తీ చేయాలని, కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలని ప్రభుత్వాన్ని కోరింది. తెలంగాణా జాయింట్ యాక్షన్ కమిటీ ముఖ్య నాయకుల సమావేశం హైదరాబాద్‌లో జరిగింది. ఉద్యోగులకు వేతనసవరణను అమలు చేయాలని, ప్రభుత్వ భూములను పరిరక్షించాలని కోరుతూ తీర్మానించారు. కమిటీ కన్వీనర్ డా. ఇటిక్యాల. పురుషోత్తం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కమిటీ నాయుకులు రాచూరి సుధీర్‌బాబు, విజయమోహన్, లక్ష్మి నారాయణ, ఎం.హనుమంత రెడ్డి, సత్యనారాయణరెడ్డి, శివకుమార్, వంగ ఉపేందర్, పి. సుభాష్ పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు

విజయక్రాంతి, నిజామాబాద్: నగరంలోని కలెక్టరేట్ మైదానంలో తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, నిజామాబాద్ పార్లమెంట్ సభ్యురాలు కల్వకుంట్ల కవిత అదేశాల మేరకు జిల్లా శాఖ అధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. అదివారం ఉదయం నిర్వహించిన ముగ్గుల పోటీలకు నగర నలుమూలల నుంచి మహిళలు ఉత్సహంగా పాల్గొని ముగ్గులను వేశారు. జిల్లా అధ్యక్షులు అవంతిరావు, మహిళ కన్వీనర్ అపర్ణలు రంగవళ్లుల పోటీలను పర్యవేక్షించారు. తెలంగాణ జాగృతి అధ్వర్యంలో జరిగిన ముగ్గుల పోటిలలో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను న్యాయ నిర్ణేతలు ఎంపిక చేశారు.

వాయు కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి

- రాత్రి సమయాల్లో పరిశ్రమల నుంచి భారీగా వెలువడుతున్న పొగలు
- ఊపిరి పీల్చుకోలేక ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని పీసీబీ అధికారులు



విజయక్రాంతి, పటాన్‌చెరు: అర్ధరాత్రి గాఢ నిద్రలో ప్రజలు ఉన్న సమయంలో ఆయా పరిశ్రమలు ఘాటు వాసనలతో కూడిన వ్యర్థ వాయువులను బయటకు వదులుతున్నారు. దీనితో ప్రజలకు ఊపిరి పీల్చుకోవడం కూడా భారంగా మారుతుంది. పారిశ్రామిక వాడ ప్రజలు వాయు కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్న సంబంధిత పీసీబీ అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని ఇస్నాపూర్, పాశమైలారం, బండ్లగూడ, బొల్లారం, గడ్డపోతారం, ఖాజీపల్లి, బొంతపల్లి, దోమడుగు, గుమ్మడిదల, అనంతారం పారిశ్రామికవాడల్లో వందల్లో వివిధ రకాల రసాయన పరిశ్రమలు ఉన్నాయి. పరిశ్రమల నుంచి ప్రతినిత్యం యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా వ్యర్థ వాయువులను బయటకు వదులుతున్నారు. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ప్రతినిత్యం ఇదేతంతు జరుగుతున్నా పీసీబీ అధికారులు మాత్రం ఇటువైపు చూడటం లేదు. స్థానిక ప్రజలు ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదులు చేసిన వారు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారు. రాత్రి సమయంలో పారిశ్రామివాడలో పర్యటించాల్సిన టాస్క్‌ఫోర్స్ అధికారులు కూడా ఇలాంటి సమస్యలపై దృష్టి సారించదడంలేదు. ఈ సమస్య కొన్ని ఏళ్ల కాలం నుంచి ఉన్నా అధికారులు మాత్రం సమస్యను పరిష్కరించేందుకు ముందుకురావడం లేదు. చిన్నారులు సైతం కాలుష్య వాయువులను పీల్చుకోవటంతో రోగాల భారీన పడుతున్న సందర్భాలు చాలా ఉన్నాయి. బొల్లారం, గడ్డపోతారం గ్రామాలలో ఈ సమస్య తీవ్రంగా ఉంది. రాత్రి దట్టమైన వ్యర్థ ఘాటు వాయువులు వస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలను చాలా సార్లు ప్రజలు అధికారులకు వివరించారు. అయినప్పటికి ఎలాంటి మార్పులేదని ప్రజలు వాపోతున్నారు. పీసీబీ అధికారులు పారిశ్రామిక వాడలో పర్యటించి వ్యర్థ వాయువులను బయటకు వదులుతున్న పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

సంక్రాంతి శుభాకాంక్షలు: కలెక్టర్



విజయక్రాంతి,సంగారెడ్డి: భోగి, సంక్రాంతి పండుగను పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ హనుమంతురావు జిల్లా ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. సంస్కృతి సాంప్రదాయాలకు అద్దంపడుతూ పిల్లలు, పెద్దలకు ఆహ్లాదాన్ని కలిగించే ఆనందాన్ని పంచే పర్వదినం సంక్రాంతి అని కలెక్టర్ కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. భోగ భాగ్యాలు, పాడి పంటలను తీసుకువచ్చే మూడురోజుల సంక్రాంతి పండుగను జిల్లా ప్రజలందరూ ఆనందోత్సాహలతో జరుపుకోవాలన్నారు. సంక్రాంతి పండుగ రైతులకు పాడి పంటలతో సిరులు కురిపించాలని కోరారు. ప్రతీ ఇళ్లు ముత్యాల ముగ్గులు, పచ్చని తోరణాలతో కళకళలాడాలని అందరూ ఆనందంగా పండుగ జరుపుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు



విజయక్రాంతి, అశ్వారావుపేట: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఎవరైన కోడి పందాలు నిర్వహిసై కఠిన చర్యలు తప్పవని అశ్వారావుపేట సిఐ యమ్. అబ్బయ్య హెచ్చరించారు. ఆదివారం పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూద క్రీడలకు తెలంగాణ రాష్ట్రంలో అనుమతులు లేవన్నారు. కోడి పందాలు పేకాటలను తెలంగాణ గేమింగ్ చట్టం ప్రకారం నేరాలుగా ప్రకటించిదన్నారు. ఇందులో పాల్గొన్న వారికి గరిష్టంగా ఆరు నెలలు నుంచి రెండు సంవత్సరాల వరకు జైలు శిక్ష లేదా రెండు వేల జరిమానా పడుతుందని తెలిపారు. అదేవిధంగా గతంలో కేసులలో ఉన్నవారు, బైండోవర్ కేసులలో ఉన్నవారు మరల జూదంలో దొరికితే జైలు శిక్షతో పాడు యాభైవేల జరిమానా వేయనున్నటు పేర్కొన్నారు. అశ్వారావుపేట, దమ్మపేట మండలల్లో ప్రత్యేక బృందాలచే గస్తీ ఏర్పాటు చేశామన్నారు.

పోటీలలో గెలుపోటములు సహజం

విజయక్రాంతి, నాగర్‌కర్నూల్: పండగలు ప్రజలందరూ కలిసి మెలిసి జరుపుకునేందుకు ముగ్గుల పోటీలు ఎంతో స్ఫూర్తినిస్తాయి అని ఎస్సై భగవంతురెడ్డి అన్నారు. ఆదివారం నాడు జిల్లా కేంద్రంలోని మార్కెట్‌యార్డులో వనితా క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం పోటీలలో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల పోటీలలో గెలుపోటములు సహజమని పోటీలు స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని కోరారు. ముగ్గుల వల్ల వారిలో దాగివున్న సృజనాత్మకత వెలుగులోకి వస్తుందన్నారు. వాసవి వనితా క్లబ్ అధ్యక్షురాలు అర్చన మాట్లాడుతూ వనితా క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలు వంటింటికి పరిమితం కాకుండా సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొత్త హేమారాణి, బాదం పూర్ణిమ, వనితా క్లబ్ కార్యదర్శి లక్ష్మి, కార్యదర్శి కండేం సుధా, కోశాధికారి నిర్మల, చిదంబరం, సాయి శంకర్, విరాట్‌లతో పాటు వాసవి క్లబ్ రిజియన్ జోన్‌సభ్యులు వాస రాఘవేందర్, గందం ప్రసాద్, శివ, వనితా క్లబ్ సభ్యులు హరిప్రియ, శ్రీలక్ష్మి, సంధ్యా కవిత తదితరులు పాల్గొన్నారు.

మర్రి చెన్నారెడ్డి సేవలు మరువలేనివి



విజయక్రాంతి, మల్కాజిగిరి: మాజీ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి సేవలు మరువలేనివని మల్కాజిగిరి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్ పేర్కొన్నారు. ఆదివారం గాంధీ భవన్‌లో నిర్వహించిన మర్రి చెన్నారెడ్డి శతజయంతి వేడుకల్లో తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డితో కలిసి ఆయన మర్రి చెన్నారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆకుల రాజేందర్ మాట్లాడుతూ 1969లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమంతో పాటు ముఖ్యమంత్రిగా, మేడ్చల్ జిల్లా అభివృద్ధిలో చేసిన కృషిని వివరించారు. తెలంగాణ ఆశయ సాధకుడు మర్రి చెన్నారెడ్డి అని కొనియాడారు.

పండుగలు మన సంస్కృతిలో భాగం



విజయక్రాంతి, ముషీరాబాద్: ముగ్గులు వేయడం మన సంస్కృతి. తరతరాలనుంచి వస్తున్న ఆచారం అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. ఆదివారం ముషీరాబాద్ బీజేపీ క్యాంప్ కార్యాలయంలో సంక్రాంతి పండుగ పురస్కరించుకొని ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు నియోజకవర్గం నుంచి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు లక్ష్మణ్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్రాంతి పండుగ వచ్చిందంటే మహిళలు ఎంతో ఉత్సాహంగా ఇంటి ముందర రంగురంగులుగా ముగ్గులు వేస్తారన్నారు. ముగ్గులు వేయడం సంక్రాంతికి ప్రత్యేకమైన రోజు అని తెలిపారు. రాష్ట్రంలో కొన్ని పండుగలు రోజురోజుకు అంతరించి పోతున్నాయని వాటిని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా అసెంబ్లీ కన్వీనర్ మాధవి, గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి లక్ష్మీ పద్మజ, పొదుపు సంఘాల ఇన్చార్జి ప్రసన్న రెడ్డి, సుశీల, అనూష, సరోజ, సావిత్రి, కుమారి, మల్లేశ్వరి, ధనలక్ష్మి, సరిత బీజేపీ నాయకులు రమేష్ రామ్, మాధవ్, వెంకటేశ్, దీన్ దయాల్ రెడ్డి, సల్లాద్రి శ్రీనివాస్ యాదవ్, బద్రి నారాయణ పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షిద్దాం

విజయక్రాంతి, మిర్యాలగూడ: కనుమరుగవుతున్న సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షిద్దామని ప్రజాసైన్స్‌వేదిక రాష్ట్ర అధ్యక్షులు, ప్రముఖ వైద్యులు మువ్వా రామారావు పిలుపునిచ్చారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని జ్యోతి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు ప్రదానం చేసి మాట్లాడారు.


బీసీ అభ్యర్థులను గెలిపించుకుందాం

విజయక్రాంతి, మిర్యాలగూడ: జనరల్ స్థానాల్లో పోటీ చేస్తున్న సర్పంచ్ అభ్యర్థులను పార్టీలకతీతంగా గెలిపించుకుందామని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలు ఎమ్మెల్యే, ఎంపీల విషయంలో పది శాతం దాటడం లేదని, కేవలం పది శాతం ఉన్న వారు 80 శాతం పదవులు అనుభవించడం దురదృష్టకరమన్నారు. ఈ సత్యాన్ని బీసీలు గుర్తించలేక వివిధ పార్టీల చెంతన చేరి జెండాలు మోసే కూలీలుగా పరిగణించబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నా చలనం లేదన్నారు. వేములపల్లి, దామరచర్ల సర్పంచులుగా పోటీ చేస్తున్న చిర్ర మల్లయ్య, బంటు కిరణ్‌లకు బీసీ సంఘాలు పూర్తి మద్దతు తెలపాలన్నారు. ఈ సమావేశంలో బంటు వెంకటేశ్వర్లు, రాంబాబు, నాగయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి ఉత్తమ అవార్డు

విజయక్రాంతి, మిర్యాలగూడ: సావిత్రి బాయిపూలే 188వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని బీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం, బీసీటీయూ సంయుక్త ఆధ్వర్యంలో నల్లగొండలోని బండారు గార్డెన్స్‌లో నిర్వహించిన వేడుకల్లో ఉపాధ్యాయురాలు నసీమున్నీసాకు సావిత్రిబాయిపూలే అవార్డు ను రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్సీ పూల రవీందర్, ఎమ్మెల్యే కె. భూపాల్‌రెడ్డి, డీఈఓ పి. సరోజినిదేవి చేతుల మీదుగా అందజేశారు.

గోదా రంగనాథుల కల్యాణం



విజయక్రాంతి, ధర్మపురి: ప్రాచీణ పుణ్య క్షేత్రమైన ధర్మపురి శ్రీ లక్ష్మీనృసింహ స్వామి దేవాలయంలోని శ్రీ శేషప్ప కళావేదికపై ఆదివారం శ్రీ గోదా రంఘనాథుల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. దేవాలయం నుంచి గోదా రంఘనాథుల ఉత్సవ మూర్తులను మేళతాళాలతో శేషప్ప కళావేదిక పైకి తీసుకొచ్చి ఆసీనులను చేసి భక్తు జనాలు భక్తి పర్వంతో తిలకిస్తుడంగా అర్చకులు కనులపండువగా గోదా రంఘనాథుల కల్యాణాన్ని నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులు గోదా రంఘనాథులను దర్శించుకొని మొక్కులను సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు, భక్తులు అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

అటవీ స్మగ్లింగ్‌పై ఉక్కుపాదం

- రామగుండం కొత్వాల్ సత్యనారాయణ



విజయక్రాంతి, రామగుండం: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో కలప అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపనున్నట్టు కమిషనర్(కొత్వాల్) వి.సత్యనారాయణ అన్నారు. ఆదివారం అటవీశాఖాధికారులు, పోలీసు ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. అటవీ స్మగ్లింగ్‌కు అడ్డుకట్ట వేయడానికి పోలీసు శాఖ, అటవీశాఖ సమన్వయంతో కలిసి పనిచేయడానికి తగు ప్రణాళికలతో ముందుకు అడుగులు వేస్తామన్నారు. అటవీ సంపదను కొల్లగొట్టే వారిపై కఠిన చర్యలు చేపడుతామన్నారు. ఈ అటవీ అక్రమార్కుల కదలికలపై గట్టి నిఘా పెట్టనున్నట్టు తెలిపారు. వారి అక్రమ రవాణాను పసిగడతామన్నారు. ఈ దాడుల సమయంలో అటవీశాఖ అధికారులకు పోలీసులు పూర్తి సహకారాన్ని అందిస్తామన్నారు. తరచుగా ఈ స్మగ్లింగ్‌కు పాల్పడే వారిపై చట్టపరంగా పీడీ యాక్టునుసైతం సంధిస్తామన్నారు. ఈ సమావేశంలో పెద్దపల్లి డిసిపి టి.సుదర్శన్‌గౌడ్, అడిషన్ డిసిపి(అడ్మిన్) ఎన్.అశోక్‌కుమార్, అడిషనల్ డిసిపి(లా అండ్ ఆర్డర్) ఎం.రవికుమార్, గోదావరిఖని ఎసిపి రక్షిత కె.మూర్తి, పెద్దపల్లి ఎసిపి వెంకటరమణ, ఫారెస్ట్, పోలీసు అధికారులు నటేశ్, సాగర్, సరీలాల్, ఎం.రవిప్రసాద్, నాగయ్య, ఎండి.షౌకత్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడలు ప్రారంభం

విజయక్రాంతి, నకిరేకల్: నియోజకవర్గంలోని చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన గ్రామీణ క్రీడలు ఆదివారం రోజున ప్రారంభమయ్యాయి. పల్లపు చంద్రయ్య జ్ఞాపకార్థం అతని కుటుంబ సభ్యుల సౌజన్యంతో కబడ్డి, షటిల్ బ్యాట్‌మెంటన్ క్రీడలను రైతు సమన్వయ సభ్యులు, టీఆర్ఎస్ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పల్లపు బుద్దుడు ప్రారంభించారు.



నియంత్రణపై పోరు

భారతదేశంలో 50 కోట్ల మంది ప్రజలు ఇంటర్నెట్ వాడుతుండగా, 30 కోట్ల మంది ఫేస్‌బుక్‌ను , లక్షలాది మంది ప్రజలు మన దేశంలో ట్విట్టర్‌ను ఉపయోగిస్తున్నారు. ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్లలో ఉన్న చట్టవ్యతిరేక అంశాలను తొలగించేందుకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ కొన్ని విధివిధానాలను రూపొందించింది. ఈ నిబంధనలను బట్టి సామాజిక మాధ్యమాల్లో ఉన్న విషయం చట్టవ్యతిరేకమైనదని ప్రతిపాదించిన 24 గంటల్లోపే సోషల్ మీడియా నుంచి ఆ సమాచారాన్ని తొలగించాల్సి ఉంటుంది. అయితే కేంద్రం విధిస్తున్న ఆంక్షలను ఎదుర్కొనేందుకు అంతర్జాతీయ సోషల్ మీడియా దిగ్గజాలు సిద్ధమౌతున్నాయి. తామంతా దేశ సమగ్రతపై నిబద్ధతతో ఉన్నామని, అయితే సోషల్ మీడియాను ప్రభుత్వం నియంత్రించాలని చూస్తే ఊరుకోవద్దని అంతర్జాతీయ సోషల్ మీడియా కంపెనీలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. సోషల్ మీడియా నియంత్రణపై భారతప్రభుత్వ ఆంక్షలను చట్టపరంగా ఎదుర్కొనేందుకు ఉన్న అన్ని అవకాశాలను ఫేస్‌బుక్ తదితర సోషల్ మీడియా వేదికలు పరిశీలించి, తమ అభ్యంతరాలను ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ముందుంచేందుకు సిద్ధమవుతున్నారు. కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధనలు ఇంటర్నెట్ వినియోగదారుల ప్రతి కదలికపై నిఘాఉంచడం వల్ల అది వ్యక్తిగత స్వేచ్ఛకు భంగకరంగా మారుతుందని అంటున్నారు. ఆన్‌లైన్‌లో ఉన్న సమాజానికి నష్టం చేకూరుస్తున్న విషయాలను నియంత్రించడానికి ఇది సరైన మార్గం కాదనీ, ఈ విషయంలో భారత ప్రభుత్వ విధానాలు అసమానంగానూ ఉన్నాయని, ఇది పౌరులపై మితిమీరిన నియంత్రణకు, వ్యక్తుల భావప్రకటనా స్వేచ్ఛకూ విఘాతం కలిగిస్తాయయని ఇంటర్నెట్ కంపెనీలు భావిస్తున్నాయి. వివిధ దేశాల్లో సోషల్ మీడియాపై నియంత్రణలు ఉన్నాయి. సామాజిక మాధ్యమ కంపెనీలు స్థానికంగా కార్యాలయాలను ఏర్పాటు చేసి, డేటాని జాగ్రత్తపరచాలని వియత్నాం కోరింది. గోప్యసమాచారాన్ని పోలీసులకు అందుబాటులో ఉంచాలని ఆస్ట్రేలియా పార్లమెంటులో బిల్లు ఆమోదించడం ద్వారా సోషల్ మీడియా కంపెనీలపై ఒత్తిడితెచ్చారు. 24 గంటలలోపు చట్టవ్యతిరేక సమాచారాన్ని తొలగించడానికీ, లేదంటే జరిమానా చెల్లించేందుకు జర్మనీలో సిద్ధంగా ఉండాలి.

పరిశోధనలపై దృష్టి పెట్టాలి

దేశంలోని కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలను ప్రోత్సహించేందుకు ఓ కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ప్రధాని నరేంద్ర మోడీ శాస్త్రవేత్తలకు పిలుపునివ్వటం ప్రాధాన్యత సంతరించుకుంది. పరిశోధన అభివృద్ధి రంగంలో ఏ దేశపు శక్తిసామర్థ్యాలైనా అక్కడి జాతీయ పరిశోధనాశాలలు, ఐఐటీ, కేంద్రీయ విశ్వవిద్యాలయాల వంటి సంస్థలపై ఆధారపడి ఉంటాయని ప్రధాని పేర్కొనటం గమనించాల్సిన విషయం. జగదీశ్ చంద్రబోస్, సీవీ రామన్, విక్రమ్ సారాభాయ్, హోమీ జే భాభా వంటి శాస్త్రవేత్తలను వైజ్ఞానిక ప్రపంచానికి అందించిన మన దేశం కొన్నేళ్లుగా పరిశోధనల్లో వెలవెలబోతోంది. ఈ నేపథ్యంలో పంజాబ్‌లోని జలంధర్‌లో ఇటీవల జరిగిన భారత సైన్స్ కాంగ్రెస్ సదస్సులో ప్రధాని కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో పరిశోధనకు అనుకూలమైన వాతావరణాన్ని, వసతులను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొనటం గమనార్హం. ఆ దిశగా శాస్త్రవేత్తలు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలి.

చికున్ గున్యా, డెంగీ, మెదడువాపు వ్యాధులతో పాటు పౌష్టికాహారలోపంపై టెక్నాలజీ ఆధారిత పరిష్కారాన్ని భారత శాస్త్రవేత్తలు కనుగొనాల్సిన సమయం ఆసన్నమయిందని ప్రధాని అభిప్రాయపడ్డారు. దివంగత ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి 'జై జవాన్ జై కిసాన్' అని నినాదం ఇచ్చారని, దానికి మాజీ ప్రధాని దివంగత వాజ్‌పేయి జై విజ్ఞాన్‌ను జోడించారని, కొత్తగా తాను దీనికి జై అనుసంధాన్ అనే పదాన్ని జోడిస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రస్తుతం దేశంలోని విద్యార్థుల్లో 95 శాతం మంది రాష్ట్ర స్థాయి విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో చేరుతున్నారు. ఈ విద్యాసంస్థలో పరిశోధనల్ని ప్రోత్సహించేందుకు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖతో చర్చించి కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ప్రధానమంత్రి శాస్త్ర, సాంకేతిక మండలిని కోరారు. దీనివల్ల వేర్వేరు మంత్రిత్వశాఖల మధ్య సమన్వయం పెరగడంతో పాటు విధానపరమైన ఉమ్మడి నిర్ణయాలను అమలు చేయడం వీలవుతుంది. ఇది ఇన్నోవేషన్, స్టార్టప్లకు ఎంతో అవసరం. గత 40 ఏళ్ల కంటే కేవలం గత నాలుగేళ్లలోనే టెక్నాలజీ రంగంలో ఎక్కువ స్టార్టప్‌లు స్థాపించారు. నేటి నినాదం ఏంటంటే 'జై జవాన్, జై కిసాన్, జై విజ్ఞాన్, జై అనుసంధాన్'. ఈ నినాదంలో జై అనుసంధాన్ అనే పదాన్ని తాను జోడించాను అని ప్రధాని వెల్లడించారు. దేశంలోని జాతీయ సంస్థలు, విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు ఎక్కువగా జరుగుతున్నాయని, రాష్ట్ర స్థాయి వర్సిటీలు, కళాశాలల్లో పరిశోధనలను పెంపొందించాలన్నారు.

భారత్‌లో ప్రాచీన జ్ఞానం అంతా పరిశోధన ద్వారా లభించిందే. గణితం, సైన్స్, కళలు, సంస్కృతి విషయంలో భారత్ ప్రపంచానికి మార్గదర్శకంగా నిలిచింది. అదే స్థానాన్ని దక్కించుకునే అవకాశం ఇండియాకు మరోసారి లభించింది. ఇందుకోసం దేశంలో కీలకమైన వ్యవసాయం, పారిశ్రామిక, సేవా రంగాలు ఏకమై మన పరిశోధనలు, ఆవిష్కరణల ద్వారా ప్రపంచానికి దిశానిర్దేశం చేయాల్సి ఉంటుంది. బిగ్ డేటా అనాలసిస్, కృత్రిమ మేధ, బ్లాక్ చైన్ టెక్నాలజీని వ్యవసాయ రంగంలో ముఖ్యంగా చిన్న కమతాలు ఉన్న రైతులకు సాయంచేసేందుకు వినియోగించాలి. ప్రజల జీవితాలను మరింత సుఖమయం చేసేలా శాస్త్రవేత్తల పరిశోధనలు కొనసాగాలి. భవిష్యత్ అంతా కనెక్టెట్ టెక్నాలజీలదే అని ప్రధాని వ్యాఖ్యానించారు. దేశంలోని పరిశోధన అభివృద్ధి రంగం వాణిజ్యపరంగా ముందుకు వెళ్లినప్పుడు సరికొత్త పారిశ్రామిక ఉత్పత్తులతో భారత్‌కు లబ్ధి చేకూరుతుందని ప్రధాని అభిప్రాయపడ్డారు.

భారత రక్షణ రంగానికి సంబంధించి భవిష్యత్ అవసరాలను అందిపుచ్చుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు డీఆర్డీవో చైర్మన్ డా.జి.సతీశ్ రెడ్డి తెలిపారు. తర్వాతితరం రక్షణ వ్యవస్థలకు సంబంధించి పదార్థాలు, స్మార్ట్ వస్త్రాలు, తయారీ రంగం, త్రీడీ ప్రింటింగ్‌పై దృష్టి సారించినట్లు వెల్లడించారు. ఈ కొత్త సాంకేతికతలను దేశీయంగా, చవకగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సైబర్ భద్రత రంగంలో ఇజ్రాయెల్ అగ్రగామిగా నిలవడానికి అక్కడి యువతే కారణమన్నారు. భారతదేశంలో యువత శాతం ఎక్కువగా ఉండటం మన దేశానికి కలిసివచ్చే అంశం. పరిశోధనలపై యువత దృష్టిపెట్టాలి.

ప్రాథమిక విద్య మొదలుకొని కళాశాల స్థాయి వరకూ విజ్ఞాన శాస్త్రానికి ఇస్తున్న ప్రాముఖ్యత ఏ పాటిదో ఆరా తీసి దాన్ని మెరుగుపరచమని ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావడం కూడా శాస్త్రవేత్తల బాధ్యత కావాలి. ఈ ప్రక్రియంతా విజ్ఞానశాస్త్ర అధ్యయనంవైపు నవతరం దృష్టి పెట్టేలా చేయగలుగుతుంది.

పరోపకారి పరమాత్మకు ప్రీతిపాత్రుడు

పరోపకారి పరమాత్మకు ప్రీతిపాత్రుడు అని గుర్తుంచుకోవాలి. పరులకు సాయం చేయటం అంటే వారిలో ఉన్న పరమాత్మను సేవించటమే.

కథ: ఒకసారి దేవదూత, చేతిలోని పుస్తకంలో ఏదో పరీక్షించటం చూసిన ఒక పరోపకారి 'ఏమి చూస్తున్నారు' అని అడిగాడు. 'భగవంతుడిని ప్రేమించే వారి పేర్లను చూస్తున్నాను' అన్నది దేవదూత. కుతూహలం కొద్దీ, తన పేరు చెప్పి, దానిలో ఉందేమో చూడమన్నాడు. దేవదూత పైకి కిందికి రెండుసార్లు చూచి, ఆయన పేరు లేదని చెబుతుంది. అయినా నిరుత్సాహ పడక, అతను తన అలవాటు మానక, పరోపకారం చేస్తునే ఉన్నాడు. ఇంకోసారి దేవదూత చేతిలో మళ్ళీ ఏదో పుస్తకం ఉండటం చూసి, అది ఏమిటని అడుగుతాడు. దీనిలో 'భగవంతుడు ప్రేమించే వారి పేర్లు ఉన్నాయి' అని చెబుతుంది. దీనిలో తన పేరు ఉందేమో చూడమంటే 'మొదటి పేరు నీదే' అని చెబుతుంది.

శిబి చక్రవర్తి దెబ్బతిన్న పావురమును రక్షించుటకై తన శరీరములోని మాంసమును వేటగానికి ప్రతిగా ఇచ్చి పావురమును రక్షించగా, పరమాత్మ ప్రత్యక్షమై ప్రసన్నుడాయెను.

చెడ్డవారితో స్నేహం చేటు చేస్తుంది.

మనం మంచివారిగా ఉండటమే కాదు, చెడ్డవారికి దూరంగా ఉండాలి. మహాభారత ఇతివృత్తంలో కర్ణుడు స్వతహాగా మంచివాడైనప్పటికీ, దుర్యోధనుడు, దుశ్శాసనుడు, శకునితో కలవటం వలన తాను కూడా దుష్టచతుష్టయంలో ఒకడైనాడు.

కథ: ఒక రోజు గ్రామంలోని వారు వనభోజనాలకై ఊరికి దూరంగా ఉన్న వనంలో వనభోజనం ఏర్పాటు చేసుకున్నారు. దగ్గరలో ఉన్న మామిడి తోటలో మామిడి చెట్లకు మంచి మామిడి పండ్లు వేళ్ళాడటం చూసి, ఆ గ్రామ పిల్లలు అవి కోసుకుందామంటే, వారిలో ఒకడయిన వేణు, అది తప్పు, తోటమాలి దండిస్తాడు అని చెప్పినా వినకుండా, మిగిలిన పిల్లలంతా వెళ్ళి మామిడి పండ్లను కోశారు. వేణు వాళ్ళతో కలవకుండా, పండ్లు కోయకుండా దూరంగా ఉన్నా, తోటమాలి వచ్చి అందరితోపాటే వేణును కూడా దండిస్తాడు. కనక చెడ్డవారితో స్నేహం చేటు తెస్తుందని గుర్తుంచుకోవాలి.

మానవుని ప్రవర్తనను బట్టి అతను ఎటువంటి వాడో నిర్ణయించవచ్చు

మానవుడు తనతోపాటు, ఇతరులకు కూడా లాభం చేకూరే పనులు చేయాలి. ప్రకృతిలో చెట్లను చూసి మానవులు చాలా నేర్చుకోవాలి. అవి ఎండలో ఉంటూకూడా మానవుడికి నీడనిస్తాయి. అంతేగాక తన మీద రాళ్ళువేసిన వారికి కూడా అవి ఫలాలను ఇస్తాయి.

మానవుని ప్రవర్తనను బట్టి అతను ఎటువంటి వాడో ఈ విధంగా నిర్ణయించవచ్చు.

1. **నీచాతి నీచం:** తనకు స్వలాభం లేకున్నా, ఇతరులను నష్టాలకు గురి చేయటం.
2. **నీచం:** తన లాభం కొరకు ఇతరుల అవకాశాలు, ప్రయోజనాలకు అడ్డుతగలటం.
3. **మధ్యమం:** ఇతరులను కష్టపెట్టకుండా, తాను లాభం పొందటం.
4. **ఉత్తమం:** తనకు, ఇతరులకు కూడా లాభం వచ్చే పనులు చేయటం.
5. **ఉత్తమోత్తమం:** తనకు కొంచెం నష్టం కలిగినా, ఇతరులకు లాభం వచ్చే పనులు చేయటం



నక్క జిత్తుల వారి మాటలు నమ్మరాదు

నక్కజిత్తుల వారి మాటలు నమ్మరాదు. మొదటి సారి మోసపోతే మోసం చేసినవాడిది తప్పు. రెండో సారి మోసపోతే మోసపడ్డవాడిదే తప్పు.

కథ: ఒక ముసలి సింహం వేటాడే శక్తి లేక, గుహలోనే ఉంటూ గుహలోనికి వచ్చిన జంతువులను తింటూ, కాలం గడుపుతున్నది. ఒకసారి గుహ ఎదురుగా సంచరిస్తున్న బలిసిన గాడిదను చూచి, తనకు ఇది ఆహారంగా దొరికితే బాగుండునని అనుకున్నది. ఆ గాడిద తన యజమాని మీద కోపంతో అడవికి వచ్చింది. సింహం అప్పుడే గుహ దగ్గరకు వచ్చిన నక్కను పిలిచి, ఆ గాడిదను తనకు ఆహారంగా తెమ్మని అడిగింది. నక్క నెమ్మదిగా గాడిదను సమీపించి, మన రాజుగారు సింహం ముసలిదై పోయింది కనుక నిన్ను రాజును చేద్దాం అనుకుంటున్నారు. నువ్వు ఒక్కసారి రాజుగారి దగ్గరకు వచ్చి కనపడమని చెప్పింది. గాడిద నక్క మాటలు నమ్మి, సింహం దగ్గరకు వచ్చింది. గాడిద దగ్గరకు వస్తుండగానే సింహం గాడిదను, ఆత్రంకొద్దీ కొట్టటం వల్ల, పట్టు తప్పి గాడిద చెవ్వు తెగింది, గాడిద పారిపోయింది. సింహం నక్కను పిలిచి గాడిదను మళ్ళీ తన వద్దకు తెమ్మని చెబుతుంది. అప్పుడు నక్క సింహాన్ని తొందర పడవద్దని చెప్పి, గాడిద వద్దకు వెళ్ళి నువ్వు అనవసరంగా భయపడి పారిపోయినావు. ఈ సారి భయపడకుండా దగ్గరకు రమ్మని చెప్పింది. గాడిద రెండవసారి నక్కమాటలు నమ్మి సింహం దగ్గరకు వెడుతుంది. గాడిద తన దగ్గరకు వచ్చినదాకా ఆగి, సింహం దానిని తన పంజాతో గట్టిగా కొడుతుంది. ఆ ధాటికి, గాడిద మెదడు దూరంగా పడ్డది, గాడిద శరీరం తింటూ, సింహం అది గమనించలేదు. నక్క దూరంగా వెళ్ళి, గాడిద మెదడును తిని, సింహం దగ్గరకు నింపాదిగా వచ్చింది. సింహం అప్పుడు తేరిపార చూచి 'గాడిద మెదడు ఏమైంది' అని అడిగితే నక్క 'మొదటిసారి దెబ్బతిన్న గాడిదకు మెదడు ఉంటే, రెండోసారి నీ దగ్గరకు వచ్చేదా' అని సమాధానం చెప్పి వెళ్ళిపోయింది.

కాలము విలువ అపారం

రోజుకు 1440 నిమిషములు. ప్రస్తుతం ఉన్న నిమిషములను సద్వినయోగ పరుచుకోవాలి. గడిచిన నిమిషములు తిరిగి రావు. రేపటి నిమిషాలను ఈ రోజుకు అరువు తెచ్చుకోవటంగాని, ఈ రోజు నిమిషాలను దాచి రేపటికి వాడుకోవటం గాని కుదరదు. కాలమును వృధా చేస్తే, జీవితమే వృధా అవుతుంది. కాలమే ఉత్తమ ఉపాధ్యాయుడు. ప్రకృతే ఉత్తమ పుస్తకం. భగవంతుడే ఉత్తమ స్నేహితుడు. హృదయమే ఉత్తమ ఉపదేశి. కాలం విలువ అపారమైనది. దాన్ని కొలవటానికి జీవితం తప్ప వేరే కొలమానాలేవి లేవు. సూర్యుడు ప్రతిరోజు క్రమం తప్పకుండా నిర్ణీత సమయంలో దర్శనం ఇస్తున్నట్లు, నిర్ణీత సమయంలో నిర్ణీత పద్ధతిలో చేయాలి.

– వ్యాకరణం వేణుధర శాస్త్రి

ఉద్యమాన్ని బలప్రయోగంతో అణచడానికి యత్నం

(నిన్నటి తరువాయి)

ఊరేగింపు నిర్వాహకులచే ఉస్మానియా విశ్వ విద్యాలయ ఉపాధ్యక్షునికి విజ్ఞాపన పత్ర సమర్పణ మొదలైన కార్యక్రమమంతా జరిగే వరకు అనుకున్న సమయానికంటే నాలుగైదు గంటలు ఎక్కువ కావడంతో తమ పనిని వదలి 'విద్యార్థులు'గా ఊరేగింపులో పాల్గొన్న రిక్షాల వారు హోటల్ వర్కర్స్ మొదలగు వారు తమకు మొదట అన్నదానికంటే ఎక్కువ కూలి చెల్లించాలని పట్టు పట్టడంతో రసాభాస తప్పలేదు. ఊరేగింపులో పాల్గొన్న వారికంటే ఆనాడు వారివెంట ఉన్న పోలీసుల సంఖ్య పదిరెట్లు ఎక్కువ ఉన్నది.

ఉద్యమాన్ని బలప్రయోగంతో అణచగలమని కలలు కనటం ప్రభుత్వం మానలేదు. అందుకే జూన్ 3వ తేదీ నుండి పాఠశాలలో పరీక్షలు నిర్వహించాలని నిర్ణయం గైకొన్నది. పరీక్షలను తాము బహిష్కరించగలమని విద్యార్థులు ప్రకటించారు. ఎవరిపంతం వారు నెగ్గించుకునేందుకు ఇరుపక్షాలు ప్రయత్నాలు ప్రారంభించాయి. ఉద్రిక్త వాతావరణంలో తాము పరీక్షాధికారులుగా పనిచేయ బోవటం లేదని ప్రకటించిన అధ్యాపకులు, పిల్లలను పరీక్షలకు పంపడం వారికి శ్రేయస్కరం కాజాలదని తల్లి దండ్రులకు విజ్ఞప్తి చేయగా, ఇతర శాఖలలో పనిచేసే అధికారులను పరీక్షాధికారులుగా నియమించి, పోలీసులకు తోడుగా ఉండి పరీక్షలు నిర్వహించేందుకు సైనికులను రంగంలోనికి దింపాలని ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది.

మే 26వ తేదీ నుండి సామూహిక సత్యాగ్రహాలు కొనసాగించడం ద్వారా తిరిగి ఉద్యమాన్ని ఉధృతపరచాలని నిర్ణయం గైకొనిన సమితి తెలంగాణ ఉద్యోగుల సంఘాలతో సమన్వయ కార్యక్రమాలను యోచిస్తున్నదనే విషయం తెలుసుకొని, యన్.జి.ఓల సంఘం నాయకుడు శ్రీ కె.ఆర్ అమోస్‌ను డిస్మిస్ చేసి, ఉపాధ్యాయ సంఘానికి గుర్తింపు రద్దుచేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది.

సహాయ నిరాకరణ ఉద్యమం ప్రారంభించాలని ఉద్యోగుల సంఘాలు నిర్ణయించగా, సమ్మెలను నిషేధిస్తూ ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీచేసింది. 26వ తేదీన సామూహిక సత్యాగ్రహాలు ప్రారంభం కానుండగా, నాగర్ కర్నూల్‌లో ముఖ్యమంత్రి బహిరంగసభ సందర్భంలో జడ్చర్ల వద్ద పోలీసులు కాల్పులు జరపడం ముగ్గురు చనిపోవడం, అనేక మందికి గాయాలు తగలడంతో తెలంగాణ అంతట కారుమేఘాలవలె ఉద్రిక్త వాతావరణం అలముకున్నది. సత్యాగ్రహాలు చేసి వేల మంది అరెస్టయినారు. తెలంగాణ అంతట కొన్ని వందల ప్రదేశాలలో లాఠీచార్జీలు జరిగాయి. పోలీసులకు ఉద్యమకారులకు సంఘర్షణలు జరిగాయి.

ఈ పరిస్థితులలో మే 30వ తేదీన చెంచల్‌గూడ జైలులో సత్యాగ్రహ ఖైదీలకు జైలులో శిక్ష అనుభవిస్తున్న ఆంధ్ర ఖైదీలకు మధ్య సంఘర్షణ జరిగింది. 94 మంది సత్యాగ్రహులు తీవ్రంగా గాయపడినారు. ఈ గొడవ జైళ్ళ ఇన్‌స్పెక్టర్ జనరల్ అక్కడ ఉండగానే జరిగింది. వంట చెరుకు, ఇనుప చువ్వలు మొదలైనవి ఖైదీలు సత్యాగ్రహులపై ప్రయోగించారు. గంటలలో ఈ వార్త నగరమంతా దావానలంలా వ్యాపించినది. వేల మంది ప్రజలు జైలు వద్దకు వెళ్ళారు. ప్రజాసమితి నాయకులు వెళ్ళి గాయపడిన వారిని పరామర్శించి, రవాణా సౌకర్యం ఏర్పాటు చేసేవరకు వారికి ప్రథమ చికిత్స చేయించవలసిన విషయం కూడ ప్రభుత్వం యోచించనేలేదు. పైగా జైలు దగ్గరకు వెళ్ళిన వారిపై లాఠీ ప్రయోగం చేశారు. ఈ సంఘటనపై తమ నిరసనను తెలిపేందుకు తెలంగాణ అంతటా జూన్ 2వ తేదీన సంపూర్ణ హర్తాళ్ జరిగింది.

జూన్ మొదటి తేదీన గాంధీ భవన్‌లో జరిగిన ఒక చరిత్రాత్మక సమావేశంలో శ్రీ కొండా లక్ష్మణ్ అధ్యక్షులుగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ అవతరించింది. మాజీ ఉప ముఖ్యమంత్రి శ్రీ కొండావెంకట రంగారెడ్డి ప్రారంభోత్సవం చేసిన ఈ సభకు హాజరైనంత మంది ప్రేక్షకులు ప్రకాశం హాలులో ఎప్పుడూ ఏ సభకు హాజరు కాలేదు. గాంధీభవన్ విశాల మైదానమంతా జనంతో క్రిక్కిరిసి పోయింది. ఒక కాంగ్రెస్ మాత్రమే కాదు, మార్చి, ఏప్రిల్ మాసాలలోనే అనేక 'ఆంధ్రప్రదేశ్ సంఘాలు' రెండుగా విడిపోయినవి. ఏప్రిల్ మూడవ వారంలో ఆంధ్రప్రదేశ్ యాదవ మహాసభ రెండుగా విడిపోయింది. శ్రీ వెంకటేశ్వరరావు యాదవ్ అధ్యక్షతన తెలంగాణ యాదవ మహాసభ ఏర్పాటయింది. అయినప్పటికీ రెండు ప్రాంతాలకు చెందిన వారిమధ్య మైత్రి, సంఘీభావం దెబ్బతినలేదు. జూన్ మొదటి తేదీన కొందరు పత్రికా రచయితలు కూడా తెలంగాణ పత్రికా రచయితల సంఘాన్ని ఏర్పాటు చేసుకొని 'ఆంధ్రప్రదేశ్' సంఘం నుండి విడిపోయారు.

ప్రధాన మంత్రి అర్థరాత్రి ఆకస్మికంగా నగరానికి రాక

రాజభవన్ ఎదుట పోలీసు కాల్పులకు పూర్వం కరకుగా వ్యవహరించవలసినదిగా ప్రభుత్వం ఉత్తర్వులు చేసినదరిమిలా అనేక ప్రాంతాలలో ఉద్యమకారులతో పోలీసులు గిచ్చికయ్యం పెట్టుకున్నారు. ప్రజల ఆగ్రహం అవధులు దాటింది. వీధివీధిన రాకపోకలకు అవకాశం లేకుండా చెత్తలేకుండా, రాళ్ళురప్పలతో అడ్డంకులు కల్పించారు. పెక్కుచోట్ల పోలీసులు భాష్పవాయువును ప్రయోగించారు. కనీసం డజన్ పర్యాయాలు కాల్పులు జరుపగా నగరంలో అయిదుగురు చనిపోయారు. యాభైమందికి గాయాలు తగిలాయి. వరంగల్, మరికొన్ని పట్టణాలలో పోలీస్ కాల్పులలో ఎందరో ఉద్యమకా రులు నేలకొరిగారు. అందువల్ల మర్నాడు మూడవ తేదీన 'గూండాయిజం వ్యతిరేకదినం' జరపాలని ప్రజాసమితి, విద్యార్థి కార్యాచరణ సంఘం పిలుపునిచ్చాయి. ప్రజలు రెచ్చిపోయి, ఉద్రిక్త పరిస్థితి నెలకొని ఉన్న ఈ తరుణంలో ఢిల్లీ నుండి ఒక ప్రకటన వచ్చింది. ఉద్యమాలకు లొంగి ప్రత్యేక తెలంగాణను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయబోదని ప్రధాని ముఖ్యమంత్రికి హామీఇచ్చినట్లు ఆయన అంతేవాసులు మోసిన వార్తను పత్రికలు ప్రకటించాయి. ఉవ్వెత్తునలేచిన మంటలమీద పెట్రోలు చల్లినట్లయింది. ప్రధానిపట్ల ప్రజలకు గౌరవం సన్నగిల్లింది. తెలంగాణకు రాష్ట్ర ప్రతిపత్తి ఇవ్వకపోవడానికి, ఇవ్వడానికి ఆమె దయాదాక్షిణ్యాలే కారణమా, అసలు ఆమె ఎవరు. ఇది ప్రజాస్వామ్యం. ప్రజలు తమ ధ్యేయాన్ని సాధించుకొని తీరుతారు. పోరాటం తుది కంటాకొనసాగిస్తారు అని అనేకమంది అనడం మొదలుపెట్టారు. ఆ ప్రకటన నిజంగా ప్రధాని చేసి ఉన్నట్టయితే, విచక్షణారహితమైనదనీ, సమయం సందర్భంలేదనీ, పలువురు రాజకీయ నాయకులు వ్యాఖ్యానించారు. (సశేషం)

– ఆదిరాజు వెంకటేశ్వర రావు

ప్రయాణంలో ప్రజల పాట్లు

పండుగ కోసం స్వగ్రామాలకు వచ్చేందుకు ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలకు సరిపడా బస్సులు లేక ఉన్న బస్సుల్లో అదనపు ఛార్జీలు వసూలు చేస్తున్నారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్నత చదువులు, ఉద్యోగాల రీత్యా హైదరాబాద్‌లో పెద సంఖ్యలో స్థిరపడ్డారు. వారంతా సంక్రాంతి పండగకు సొంత ఊళ్లకు వస్తుంటారు. సెలవులు ప్రకటించడంతో పాఠశాలలు, కళాశాలల్లో చదువుకునే యువతీ, యువకులు కూడ పండుగకు వస్తుంటారు. ముందుగా రిజర్వేషన్ చేసుకుంటే తప్ప బస్సుల్లో సీట్లు లభించవు. రైళ్లలోనూ ఇదే పరిస్థితి ఉండటంతో ఎక్కువమంది బస్సులపైనే ఆధారపడతారు. ఆర్టీసీ సంస్థ అదనపు బస్సులను నడుపుతున్నప్పటికీ 50శాతం అధికంగా ఛార్జీలను వసూలు చేస్తున్నారు. ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్‌కు సెమీలగ్జరీ బస్సు ఛార్జి రిజర్వేషన్‌తో కలిపి రూ.415, రాజధాని ఏసీ బస్సుకు రూ.543, గరుడ ఏసీకి రూ.663ఉంటుంది. ప్రత్యేక బస్సుల్లో వీటికి అదనంగా 50శాతం ఎక్కువ ఛార్జి ఉంటోంది. ప్రైవేటు ట్రావెల్స్‌వారు ప్రయాణికుల రద్దీని బట్టి ఛార్జీలను వసూలు చేస్తున్నారు. సాధారణ రోజుల్లో ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్‌కు రూ.350 ఉండగా పండగ రద్దీతో రూ.500 నుంచి 600ల వరకు వసూలు చేస్తూ ప్రయాణికుల అవసరాలను సొమ్ము చేసుకుంటున్నారు. ఏసీ బస్సుల్లోనైతే రూ.800 వరకు ఛార్జీలు వసూలు చేస్తున్నారు. ఈ విధంగా ప్రజల నుంచి అందిన కాడికి దండుకుంటున్నారు.

–కనకయ్య, ఆదిలాబాద్

జోరుగా అక్రమ వడ్డీ వ్యాపారం

ప్రజల అవసరాలను ఆసరా చేసుకొని వడ్డీ వ్యాపారులు అక్రమంగా వ్యాపారం చేస్తున్నారు. చిరు వ్యాపారులు, మధ్య తరగతి ప్రజలకు అప్పులిస్తూ వడ్డీ వ్యాపారులు వారి నడ్డి విరుస్తున్నారు. వారి ఆర్థిక అవసరాలను తమకు అనుకూలంగా మార్చుకుని నూటికి రూ.5 నుంచి రూ.10 వరకు వడ్డీకి అప్పులిస్తున్నారు. దీంతో చిరువ్యాపారులు తీసుకున్న అప్పు, వడ్డీ కట్టలేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారుల్లో తోపుడు బండ్లపై పండ్లు, కూరగాయలు విక్రయించే వారు, చిరు కిరాణం, తినుబండారాల దుకాణంతో జీవనం సాగించే వారు అధికంగా వడ్డీలకు అప్పులు తీసుకుంటున్నారు. అసలు కన్నా వడ్డీలు ఎక్కువై అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. దేవరకొండ డివిజన్‌లో ఉన్న జీరో ఫైనాన్స్ వ్యాపారులు అసలు, వడ్డీ చెల్లించకుంటే ఇంట్లో ఉన్న వస్తువులు తీసుకెళ్లటం, భూములు కబ్జా చేస్తూ బాధితులను భయాందోళనకు గురిచేస్తున్నారు. హాలియా, మిర్యాలగూడ, దేవరకొండకు చెందిన వ్యాపారులు దేవరకొండ పట్టణంలో వడ్డీ దందా జోరుగా సాగిస్తున్నారు. ఇటీవల పోలీసులు దాడులు నిర్వహించి జిల్లా వ్యాప్తంగా 51 మందిపై కేసులు నమోదు చేసినా ఇంకా చాలా మంది అక్రమ వడ్డీ దందా కొనసాగిస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకుని అక్రమ వడ్డీ వ్యాపారుల నుంచి చిరు వ్యాపారులను కాపాడాలి.

–రామునాయక్, దేవరకొండ

సమానత్వ (సా)ధన పథంలో....

స్వాతంత్ర్య సముపార్జన చేసి డెబ్బైరెండేళ్ళవుతున్నా సమానత్వ దిశగా ప్రజలు పురోగమించడం అనేదీ, కుల, మత, ప్రాంతపరంగా వివక్షలేని దశకు చేరుకోవడమనేదీ ఇంకా జరగనే లేదు. అందుకే ఇంకా ఇంకా అభివృద్ధి చెందుతున్న దేశంగానే ఉన్నాం తప్పిస్తే, ఇంకా రిజర్వేషన్ల దయాదాక్షిణ్యాల మీదే అనే కులు బ్రతుకుతున్నారు తప్పిస్తే ప్రతిభే ప్రాతిపదికగా అన్నింటా పోటీపడి ఎదిగే దశకు చేరుకోనేలేదు.

ఇవాళ విద్య, ఉద్యోగాల కోసం అనేకమంది దృష్టి అమెరికా వంటి విదేశాలవైపు ఉండడానికి, అక్కడకు వెళ్ళిన మనవారు అనేకమంది సొంతగడ్డకు తిరిగిరాకుండా అక్కడే స్థిరపడిపోవాలని అభిలషించడానికి ఉన్న ముఖ్య కారణాల్లో ఇది కూడా ప్రధానమైనదే. అమెరికాలో డిగ్నిటీ ఆఫ్ లేబర్ ప్రశ్న లేకుండా ప్రతి ఉద్యోగానికీ గౌరవం ఇస్తారు. మనవాళ్ళు అక్కడికెళ్ళి హోటళ్ళల్లో ఇతరత్రా ఉద్యోగాలలో పనిచేస్తారు గానీ అదే పని మన దేశంలో చేయడానికి వారికి మనస్కరించదంటే అదే కారణం! ఇక్కడ అధికారాలు, పాపులారిటీ, సంపాదన బట్టి మనుషులను గౌరవించే తీరు మనది. అందుకే ధనార్జన చేసిన నేరస్తులు, బడా బడా మోసాలు చేసి, సంపన్నులై కూచున్న వారు కూడా గౌరవింపబడతారు. నేర చరితులు నేతలు అవుతారు. స్కాములు చేసిన వారు, బ్యాంకులను మోసగించి ఎదిగినవారు నిర్భీతిగా సంచరిస్తారు. జైళ్ళు కూడా వారికి విలాస గృహాలుగా మారగల్గుతాయి.

అమెరికాలో ఉద్యోగాలు రిజర్వేషన్ల ఆధారంగా ఇవ్వరు. అర్హతలే వారికి అవకాశాలు ఇస్తాయి. ఇప్పటికీ మన దేశంలో కులం, లింగం ఆధారంగా రిజర్వేషన్ల అమలు ఉంది. ముఖ్యంగా కులప్రాతిపదికన, వెనుకబడిన వర్గాల పేరున సంవత్సరాల తరబడి ప్రయోజనాలు పొంది సంపన్నులైన వారు కూడా ఇంకా తమ సంతతి కోసం రిజర్వేషన్లు అమలు కావాలనే ప్రాకులాడుతుంటారు. అగ్రవర్ణాలలోని పేదలున్నారు. నిజానికి బ్రాహ్మణకులంలో ఆర్థికంగా వెనుకబడినవారు ఈనాడు ఎందరో ఉన్నారు. ప్రధానిమోడీ సరికొత్తగా కొత్త కోటాతో ఆర్థికబలహీన


వర్గాలకు పదిశాతం రిజర్వేషన్ కల్పిస్తూ లోక్‌సభలో 323 ఓట్ల భారీమద్దతుతో బిల్లుకు ఆమోదం లభింపచేసి రాజ్యాంగానికి సవరణ సయితం కావించి 15,16 అధికరణాలకు 124వ సవరణతో మరో క్లాజును కూడా జోడించి, జాతితో సంబంధం లేకుండా ప్రతి పేద వ్యక్తికీ గౌరవంగా జీవితం గడిపే అవకాశం కల్పించడం, వారు సాధ్యమైనన్ని అవకాశాలు అందుకునే విధంగా మార్గం సుగమంచేయడం లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అభిభాషించారు. నిజానికి మొత్తం రిజర్వేషన్ల శాతం 50 శాతం పరిమితిని దాటకూడదని సుప్రీంకోర్టు తీర్పు ఉంది. ఆర్థిక బలహీన వర్గాలకు రిజర్వేషన్ల బిల్లు సుప్రీంకోర్టు నిర్దేశించిన కోటా పరిమితిని ఉల్లంఘించదు అనీ ఎందుకంటే ఆర్టికల్ 16(4) లో చెప్పబడిన కుల ఆధారిత రిజర్వేషన్లకే ఆ పరిమితి అనీ, అది షెడ్యూల్డ్ కాస్ట్, షెడ్యూల్డ్ ట్రైబ్, సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వారికి చెందినవనీ, ఈ బిల్లు ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు సంబంధించింది అనీ ఈ వర్గాల ప్రస్తావన రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 15,16 లో లేదనీ ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ సమానత్వసాధనకే ఈ బిల్లు అని వివరణ ఇచ్చారు.

మన దేశంలో విద్య, ఉద్యోగ దరఖాస్తుల్లో కులం, మతం గురించి అడుగుతుంటారు. కానీ అమెరికాలో అది నేరం. అక్కడ వాటి ప్రస్తావన దరఖాస్తుల్లో ఎక్కడా ఉండదు. కులం, రంగం, లింగం ఆధారంగా ఎటువంటి వివక్ష లేకుండా అందరికీ సమాన అవకాశాలు కల్పించాలని అమెరికా రాజ్యాంగం స్పష్టం చేస్తోంది. మనదేశంలోనే ఇప్పటికీ బోలెడు రాజకీయ పార్టీలు ఓటు బ్యాంక్ కోసం ఈ కులవివక్షను ఇంకా పెంచిపోషిస్తున్నాయి. అమెరికాలో నేటికీ ద్విపార్టీ వ్యవస్థే! అధికారం అయితే రిపబ్లికన్లది లేదా డెమొక్రాట్లుది. మన దగ్గర రాష్ట్రాలలో సైతం పదుల సంఖ్యలో పార్టీలున్నాయి. ప్రజాస్వామ్యం పేరుతోనయినా నిజంగా ఇన్ని పార్టీలు, ప్రజలకు ఇంత గందరగోళం అవసరమా అనిపిస్తూ ఉంటుంది. సుప్రీంకోర్టు తీర్పు ఉన్నా తమిళనాడు వంటి రాష్ట్రాలు కొన్ని కుల ఆధారిత రిజర్వేషన్లను యాభైశాతానికి మించి అమలుచేసుకునే వెసులుబాటను కల్పించుకుని కొనసాగిస్తున్నాయి.

నిజానికి 1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం లభించాక భారత రాజ్యాంగం ముసాయిదా కమిటీకి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చైర్మన్ అయ్యారు. మతం, జాతి, కులం, లింగం, పుట్టిన ప్రదేశం ఆధారంగా వివక్షను భారతరాజ్యాంగం నిషేధించింది. అందరు పౌరులకు సమాన అవకాశాలు కల్పిస్తూ రాజ్యాంగం సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగుతులకు, ఎస్సీ, ఎస్టీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేందుకు ప్రత్యేక నియోజకవర్గాలు కేటాయించారు. నిజానికి అయిదేళ్ళకోసారి రిజర్వేషన్లను సమీక్షించాలన్న ఆనాటి సంకల్పం రాజ్యాంగ సవరణల ద్వారా రిజర్వేషన్లు ప్రతిసారీ పొడిగింపబడుతూనే వచ్చాయి. జనవరి 26, 1950న భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చింది.

1979 లో మండల్ కమీషన్ ఏర్పడింది. 1980లో మండల్ కమీషన్ నివేదికను సమర్పించింది. వెనుకబడిన తరగతుల కోటాలను 22 శాతం నుంచి 49.5 శాతానికి పెంచుతూ కోటాల్లో మార్పులకు సిఫార్సు చేసింది. బి.సిలకు కూడా ప్రయోజనం కలుగుతూ 2006 నాటికి వెనుకబడిన తరగతిలో ఉన్న కులాల సంఖ్య 2297కు పెరిగింది. మండల్ కమీషన్ సిఫార్సులను ప్రభుత్వోద్యోగుల్లో అమలు పరిచినపుడు 1990లో దేశవ్యాప్త ఆందోళనలు సాగాయి. ఢిల్లీ యూనివర్శిటీకి చెందిన రాజీవ్‌గోస్వామి ఆత్మహుతికి ప్రయత్నం చేశాడు. 1992 ఇందిరా సాహ్నే కేసులో అత్యున్నత న్యాయస్థానం ఇతర వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్‌లను సమర్థించింది. మన దేశంలో రిజర్వేషన్లకు ఇంకా ఇతర ప్రమాణాలు కూడా ఉన్నాయి. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబం వారికి, వికలాంగులకు, క్రీడాకారులకు, ప్రవాసభారతీయులకు, వివిధ సంస్థలు పోషించే అభ్యర్థులకు, సైనికదళాల్లో గతంలో పనిచేసినవారికి, విధుల్లో మరణించిన సాయుధదళాల సిబ్బందిపై ఆధారపడిన వారికి, కులాంతర వివాహాల్లో జన్మించినవారికి, ప్రార్థనా ప్రదేశాల్లో సందర్శనలకు, రవాణావ్యవస్థలో స్త్రీలు, వృద్ధులు, వికలాంగుల సీట్లకు, టిక్కెట్టు ఛార్జీల్లోనూ ఇలా రిజర్వేషన్లు అనేక రూపాలలో పరిఢవిల్లుతున్నాయి. ఏమయినా రిజర్వేషన్లకు సంబంధించిన నిర్ణయాలను వాస్తవిక ప్రాతిపదికన తీసుకుంటూ, రిజర్వేషన్లను దశలవారీగా తొలగించేందుకు ప్రభుత్వం దీర్ఘకాలిక ప్రణాళికను ప్రకటించాలని కోరుతున్నవారూ ఉన్నారు.

భారతదేశం పేద దేశం కాదనీ, అభివృద్ధి చెందుతున్న దశనుండి త్వరలోనే అభివృద్ధి చెందిన సమానత్వ వ్యవస్థ స్థాయి దేశంగా పరివర్తిత మవుతుందనీ ఆశించడం నేరం కాదు కదా!



సుధామ
9849297958

విజయపథం

నిరుద్యోగ యువతకు ఏటీడీసీ ద్వారా ఉపాధి అవకాశాలు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో అప్పరెల్ ట్రైనింగ్ అండ్ డిజైన్ సెంటర్ (ఏటీడీసీ) రాష్ట్ర నిరుద్యోగ యువతకు ఓ సువర్ణావకాశాన్ని కల్పిస్తోంది. అప్పరెల్ ట్రైనింగ్ అండ్ డిజైన్ సెంటర్(ఏటీడీసీ) కేంద్ర చేనేత, జౌళి శాఖ ఆధీనంలోని ఏఈపీసీ శిక్షణా విభాగం. గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖలోని దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన కింద ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఉచిత వసతితో పాటు శిక్షణ అందిచనున్నట్లు ఏటీడీసీ ఓ ప్రకటనలో తెలిపింది. శిక్షణా కాలంలో విద్యార్థులు వస్త్ర నిర్వహణ పరిశ్రమలో ఉత్పాదతకు సంబంధించి ముఖ్యమైన సమయ పాలన, ఉత్పత్తి నిర్వహణ, ఉత్పత్తి ప్రణాళికల గురించి తెలుసుకుంటారు. తెలంగాణలోని అన్ని జిల్లాలకు చెందిన అర్హులైన విద్యార్థులు/ నిరుద్యోగ యువతకు ఉచిత వసతితో పాటు శిక్షణ అందజేయనున్నట్లు, శిక్షణ అనంతరం విద్యార్థులకు వస్త్ర పరిశ్రమలో ఉపాధి కల్పించనున్నట్లు ఏటీడీసీ తెలిపింది. అర్హతకు సంబంధించిన నిబంధనలు: విద్య: ఇంటర్మీడియట్, వయస్సు 18–25 సంవత్సరాలు (జనన ధృవీకరణ పత్రం), ఆదాయం బీపీఎల్ వైట్ రేషన్‌కార్డ్, ఆధార్ కార్డ్, నివాస/ గృహ ధృవీకరణ పత్రం. ఆసక్తి గల అభ్యర్థులు కింద ఇచ్చిన చిరునామాలో సంప్రదించవచ్చు: ఏటీడీసీ, సర్వే నెం.64, హోటల్ అవసా ఎదురుగా, మాదాపూర్, హైటెక్ సిటీ, హైదరాబాద్–81, సంప్రదించవలసిన నంబర్లు 040–23112155/56, 9912108844, 9885089801, 9611238944.

కృత్రిమ మేధస్సు- తేనుందా ఉషస్సు

శాస్త్రవేత్తలు శాస్త్ర, సాంకేతిక రంగంలో సాధించిన విజయాలతో ప్రపంచాన్ని శాసిస్తున్నారు. తాజాగా మానవ మేధస్సుకే సవాల్ విసురుతున్నారు. సృష్టికి ప్రతిసృష్టి చేస్తూ కృత్రిమ మేధస్సుకు ఊపిరి పోస్తున్నారు. ఇందులో భాగంగానే అన్ని రంగాల్లో స్వయం నియంత్రిత రోబోలు, యంత్రాలు అడుగుపెడుతున్నాయి. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)తో దూసుకెళ్తున్న ఇరవై ఒకటో శతాబ్దం సైన్స్ చరిత్రలో కీలక ఘట్టంగా నిలవనుంది. ఈ నేపథ్యంలో కృత్రిమ మేధస్సు, దాని ప్రత్యేకతల గురించి చర్చ జరుగుతోంది.



మనిషి ప్రపంచంలోనే అత్యంత తెలివైన జీవి. మేధాశక్తి అతడిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లడంతో పాటు యావత్ ప్రపంచంపై పట్టు సాధించేలా చేసింది. సృష్టి అనేక అద్భుతాల సమాహారం. అయితే ఆ సృష్టికే ప్రతిసృష్టి చేస్తూ అందరినీ ఆలోచింపజేస్తున్నారు. ఊహలకు వాస్తవరూపం ఇస్తున్నారు. మరమనుషులకు మేధాశక్తి అందించి సైన్స్ చరిత్రలో కొత్త అధ్యాయానికి తెర ఎత్తుతున్నారు. కృత్రిమ మేధస్సు.. జ్ఞాపకాలను గుర్తుంచుకోవడం, నెమరువేయగలగడం, సమస్యలను పరిష్కరించడం, తార్కికగణన శక్తి, సాంకేతిక పదాలతో పాటు సాధారణ భాషలను అర్థం చేసుకోవడం, నూతన పరిస్థితులకు అనుగుణంగా ప్రతిస్పందించడం వంటి సామర్థ్యాల కలబోతే మేధస్సు. దీనికి ప్రతి సృష్టే కృత్రిమ మేధస్సు. కృత్రిమ మేధస్సుపై పరిశోధనల్లో భవిష్యత్ తరాలకు మార్గనిర్దేశం చేసిన జాన్‌మెక్కార్తీ కృత్రిమ మేధస్సు పితామహుడిగా గుర్తింపు సాధించారు. ఈయన నిర్వచనం ప్రకారం సైన్స్, ఇంజనీరింగ్‌ల కలయికతో రూపుదిద్దుకున్న తెలివైన యంత్రాలు, కంప్యూటర్ ప్రోగ్రామ్‌లనే 'కృత్రిమ మేధస్సు' అంటారు. ఇంతకాలం కంప్యూటర్లు వాటికిచ్చిన ప్రోగ్రామ్‌లతో పనిచేస్తున్నాయి. స్వతహాగా ఆలోచించి సమస్యలకు పరిష్కారం చూపించగలిగే సామర్థ్యం వాటికి లేదు. కృత్రిమ మేధస్సుతో చాలా సమస్యలకు స్వతహాగా స్పందించి సమాధానాలు ఇవ్వగల, పనులను చక్కదిద్దగల రోబోలు, కంప్యూటర్లు అందుబాటులోకి రాబోతున్నాయి. ఈ దిశగా మనిషి మెదడు పనితీరును అధ్యయనం చేసి అచ్చంగా అలాగే పనిచేసేలా సాఫ్ట్‌వేర్‌ను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేస్తున్నారు.

లక్ష్యాలు: 'ఆలోచించడం, అర్థం చేసుకోవడం, సమస్యలను విశ్లేషించడం, సందర్భానుసారం ప్రవర్తించడం' వంటి సామర్థ్యాలను యంత్రాలకు కల్పించడమే శాస్త్రవేత్తల లక్ష్యం. ఈ లక్ష్యాన్ని సాధిస్తే మనిషి చేయలేని అనేక పనులను యంత్రాలు చక్కదిద్దగలవు. అదే జరిగితే మనిషి జీవితం మరింత సౌకర్యవంతంగా మారుతుంది.

ప్రత్యేకతలు: కంప్యూటర్లు కేవలం కోడ్ భాషలను మాత్రమే అర్థం చేసుకుంటాయి. ప్రస్తుతం వాటిని కృత్రిమ మేధస్సు సహాయంతో వివిధ భాషలను అర్థంచేసుకుని సంభాషించేలా తీర్చిదిద్దుతున్నారు. ఆధునిక యంత్రాలకు దృష్టి జ్ఞానం అందిస్తున్నారు. ఇందులో భాగంగా రికార్డుల్లోని నేరస్తుల ఛాయాచిత్రాలను పోల్చి, వారు సీసీ కెమెరాలకు చిక్కిన వెంటనే పోలీసులను అప్రమత్తం చేసే వ్యవస్థ రూపుకల్పన జరుగుతుంది. ఇప్పటివరకు వివిధ రకాల ఎలక్ట్రానిక్ మెషీన్లు వాటికి అందించిన సమాచారం ఆధారంగా కొన్ని స్వరాలను మాత్రమే గుర్తించగలవు. వీటిని కృత్రిమమేధస్సు సహాయంతో భాష, యాస, మాండలికాలు, స్వరంలో మార్పు వచ్చినా పూర్తి కచ్చితత్వంతో స్వరాలను గుర్తించేలా రూపొందిస్తున్నారు.

ప్రయోజనాలు: ప్రస్తుతం ఉద్యోగుల ఎంపిక ప్రక్రియలో టెక్నాలజీ కీలకపాత్ర పోషిస్తోంది. అప్లికేషన్లో పేర్కొన్న సమాచారం సరైందో కాదో చిటికెలో చెప్పేస్తోంది. ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి సోషల్ మీడియా అకౌంట్లను వడపోసి అభ్యర్థుల సామర్థ్యంపై నివేదిక ఇస్తుంది. మొదటి దశ ఇంటర్వ్యూలను కృత్రిమ మేధస్సుతో అనుసంధానించిన కంప్యూటర్లే చేస్తున్నాయి. కస్టమర్ కేర్ సెంటర్లో మనుషులకు బదులు కంప్యూటర్లే సమాధానాలిస్తున్నాయి. స్వర రూపంలోనే కాకుండా చాటింగ్ ద్వారా సేవలందిస్తున్నాయి. వోక్స్‌వ్యాగన్, బీఎండబ్ల్యూ వంటి కార్ల తయారీ సంస్థలు స్వయంనియంత్రిత రోబోలను వినియోగిస్తున్నాయి. కృత్రిమ మేధస్సు వినియోగంతో మానవ వనరులపై చేసే ఖర్చు ఆదా అవుతుంది. అదే సమయంలో ఉపాధి అవకాశాలు తగ్గుముఖం పడతాయనే ఆందోళన ఉంది.

యుద్ధ క్షేత్రం: ప్రపంచవ్యాప్తంగా దేశాలు భద్రతపై లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నాయి. సైనికులు తమ ప్రాణాలను పణంగా పెడుతున్నారు. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకొని రోబోలకు కృత్రిమ మేధస్సును జోడించి రణక్షేత్రంలో ప్రవేశపెట్టేందుకు అమెరికా, రష్యా, ఇజ్రాయెల్, యునైటెడ్ కింగ్‌డమ్, చైనా, దక్షిణ కొరియాలు విస్తృత పరిశోధనలు చేస్తున్నాయి. ఇప్పటికే రక్షణ రంగానికి సంబంధించి నిఘా విమానాలు తమకు తాముగా ఛాయాచిత్రాలు తీస్తున్నాయి.

బ్యాంకింగ్ లక్ష్మీ: భారత బ్యాంకింగ్‌కు సంబంధించి సిటీ యూనియన్ బ్యాంక్ తొలిసారి రోబో సేవలను వినియోగంలోకి తెచ్చింది. 'లక్ష్మీ'గా పేర్కొనే ఈ రోబో ఖాతాదారులకు బ్యాలెన్స్, రుణాలపై వడ్డీరేట్లు, ఇతరత్రా వివరాలను అందిస్తుంది. ఇది ఇంగ్లీష్‌లో మాట్లాడుతుంది. ప్రస్తుతం ఇది 125 రకాల సందేహాలకు సమాధానాలు ఇస్తుంది. గోప్యత పాటించాల్సిన అంశాలను తెరపై చూపిస్తుంది. రోబోలను భవిష్యత్‌లో మరింత అభివృద్ధి చేసి బ్యాంకింగ్ కార్యకలాపాల్లో విస్తృతంగా వినియోగించాలని భావిస్తున్నారు.

రోబోకి పౌరసత్వం: సౌదీ అరేబియా తొలిసారి ఒక మహిళా రోబోకు పౌరసత్వం కల్పించింది. కృత్రిమ మేధస్సుతో ప్రాణం పోసుకున్న 'సోఫియా' అనే రోబో రియాద్‌లోని 'ఫ్యూచర్ ఇన్వెస్ట్‌మెంట్ ఇనిషియేటివ్' సదస్సులో తనకు తాను ప్రపంచానికి పరిచయం చేసుకుంది. శాంతియుత ప్రపంచమే తన ధ్యేయమని చెప్తోన్న 'సోఫియా' మనుషుల్లానే రకరకాల హావభావాలను పలికించగలదు.


ప్రతికూలతలు- విమర్శలు

కృత్రిమ మేధస్సుతో విప్లవాత్మక మార్పులు వస్తాయనడంలో సందేహం లేదు. అల్పస్థాయి నైపుణ్యం, తక్కువ సాంకేతిక పరిజ్ఞానం కలిగిన అనేక మంది ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉంది. కృత్రిమ మేధస్సు పక్కదోవపడితే చాలా ప్రమాదకరం. మానవ రహిత కార్ల గురించి గొప్పగా చెప్పుకుంటున్నాం. కానీ, అలాంటి వాహనాల వల్ల ప్రమాదాలు జరిగితే ఎవరిని బాధ్యుల్ని చేయాలనే ప్రశ్నకు సమాధానం లేదు. భద్రతా రంగాల్లో కృత్రిమ మేధస్సు వినియోగంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. కృత్రిమ మేధస్సు అభివృద్ధిని నియంత్రించలేకపోతే చరిత్రలో దాన్ని అత్యంత చెత్త విషయంగా చెప్పుకునే రోజులొస్తాయని తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే మూడో ప్రపంచ యుద్ధానికి కృత్రిమ మేధస్సే కారణమవుతుందన్నారు ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్. కృత్రిమ మేధస్సుతో పనిచేసే ఆయుధాలను అనుమతించడమంటే సమస్యలను కొనితెచ్చుకోవడమేనని వంద మంది శాస్త్రవేత్తలు ఐరాసకు లేఖ రాశారు. ఈ టెక్నాలజీతో ధనిక, పేద మధ్య అంతరాలు మరింత పెరుగుతాయని మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్ అభిప్రాయపడగా ఫేస్‌బుక్ వ్యవస్థాపకుడు జుకర్‌బర్గ్ మనిషి జీవితం మరింత సుఖవంతంగా మారుతుందంటున్నారు.

– బర్ల శ్రీనివాస్

ఫార్మసిస్ట్ ఉద్యోగార్థులకు!

కార్మిక రాజ్య బీమా సంస్థ తెలంగాణ ప్రాంతీయ కార్యాలయం తమ డిస్పెన్సరీలు, హాస్పిటల్స్ కోసం ఇటీవల ఉద్యోగ నియామక ప్రకటన విడుదల చేసింది. ఫార్మసిస్ట్ ఉద్యోగార్థులు పోటీ పరీక్షల కోసం సిద్ధమవ్వడానికి కొన్ని సూచనలు. ఫార్మసిస్ట్‌లు మెడిసిన్ స్పెషలిస్ట్‌లు లేదా ఔషధ నిపుణులు! కనుక మెడిసిన్స్‌కు సంబంధించిన ప్రశ్నలే ఎక్కువ ఉంటాయి. అయినప్పటికీ అనాటమీ, ఫిసియాలజీ, బయోకెమిస్ట్రీ, క్లినికల్ పాథాలజీ, హెల్త్ ఎడ్యుకేషన్‌కు సంబంధించిన ప్రశ్నలు కూడా వచ్చే అవకాశం ఉంటది. ఇంక ఫార్మసీ విషయానికి వస్తే ఫార్మస్యూటికల్ కెమిస్ట్రీ, ఫార్మస్యూటిక్స్, ఫార్మకాలజీ అండ్ తెరప్యూటిక్స్, హాస్పిటల్ అండ్ క్లినికల్ ఫార్మసీ, ఫోరెన్సిక్ ఫార్మసీ, డ్రగ్ స్టోర్ మేనేజ్‌మెంట్ ప్రధానంగ ప్రిపేర్ కావలసిన సబ్జెక్ట్‌లు. కెమిస్ట్రీ కాస్త తక్కువ ఇవ్వవచ్చు. ఫార్మస్యూటిక్స్‌లో హైడ్రోఫిలిక్ లిపోఫిలిక్ బాలన్స్, హోమోజీనియస్ సస్పెన్షన్, కేకింగ్ ఆఫ్ సస్పెన్షన్స్, చిప్పింగ్ ఆఫ్ టాబ్లెట్స్, టాబ్లెట్ డిసొల్యూషన్ రేట్, సస్టెయిండ్ రిలీస్ డోసేజ్ ఫార్మ్స్, ప్యాకింగ్ మెటీరియల్, ఇంజెక్షన్ వెహికిల్స్ మొదలైన అంశాల మీద ప్రశ్నలు రావచ్చు. ఫార్మకాలజీ అండ్ తెరప్యూటిక్స్‌పై ఎక్కువ శ్రద్ధ పెట్టవలసి ఉంటుంది. ఇందులో ఫార్మకాలజీ బేసిక్ ప్రశ్నలతో పాటు ఇండికేషన్స్, కాంట్రా ఇండికేషన్స్, పోసాలజీ, అడ్వర్స్ డ్రగ్ రియాక్షన్స్, డ్రగ్ ఇంటరాక్షన్స్ అండ్ ఇన్‌కంపాటబిలిటీస్ మీద మంచి పట్టు సాధించాలి. ఫోరెన్సిక్ ఫార్మసీ లేదా ఫార్మస్యూటికల్ జూరిస్ప్రుడెన్స్‌లో డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ ఆక్ట్ నుంచి షెడ్యూల్ సిసి1, హెచ్ హెచ్1, ఎన్, పి, ఎక్స్ ముఖ్యమైనవి. డ్రగ్ స్టోర్ మేనేజ్‌మెంట్‌లో ఫెపో మొదలైన కాన్సెప్ట్స్ మీద రావచ్చు. హాస్పిటల్ అండ్ క్లినికల్ ఫార్మసీలో సెంట్రల్ స్టెరిలైజేషన్ డిపార్ట్‌మెంట్, పాథోఫిసియాలజీ, డ్రగ్ తెరప్యూటిక్ మేనేజ్ మెంట్, మెడికేషన్ ఆడిట్ వంటివి గుర్తుంచుకోవలసిన అంశాలు.



పరీక్ష హాల్‌కు ముందే చేరుకోవాలి. హాల్ టికెట్ వంటి వెంట తీకుసుపోవలసిన వస్తువులను జాగ్రత్తగా సర్ది పెట్టుకోవాలె. మొదట రిజిస్ట్రేషన్ నంబర్ పూర్తి తదితరాలు జాగ్రత్తగా ఫిల్ అప్ చేయాలె. ప్రశ్నలు, జవాబులు శ్రద్ధగా చదివి అర్థం చేసుకొని తెలిసిన వాటిని ముందు పూర్తి చేయాలి. తరువాత మిగతా వాటిపై దృష్టి సారించాలి. ఏ ఒక్క ప్రశ్ననూ వదల వద్దు. పరీక్షను ఎదుర్కొనేటప్పుడు ఆందోళన పడవద్దు! ప్రశాంతంగా సాధ్యమైనంత మేరకు పూర్తి చేసి, సమయం మిగిలితే మరొక్కసారి సమీక్షించుకోవాలి. విజయోస్తు!



– డాక్టర్ రాపోలు సత్యనారాయణ
ఫార్మసిస్ట్

ఎస్ఐ & కానిస్టేబుల్; ఆర్‌ఆర్‌బీ తదితర పోటీ పరీక్షల కోసం

1. A మరియు B ప్రస్తుత వయస్సుల నిష్పత్తి 3.1. 4 సంవత్సరాల క్రితం 4.1 అయిన ప్రస్తుతం A వయస్సు ఎంత?
a) 36 సం b) 48 సం c) 40 సం d) 32 సం

2. ఒక పండ్ల వ్యాపారి 240 ఆపిల్స్‌ను 600/– లకు కొన్నాడు. వాటిలో పాడైన కొన్ని పండ్లను పారేశాడు. మిగిలిన ఆపిల్స్‌ను ఒకటి రూ. 3.50 అమ్మగా రూ. 198 లాభం వచ్చింది. అయిన పడేసిన ఆపిల్స్ శాతం ఎంత?
a) 6% b) 5% c) 8% d) 7%

3. ఒక త్రిభుజం యొక్క ఎత్తును 10% పెంచినప్పుడు వైశాల్యంలో మార్పు రాకుండా వుండటం కొరకు ఎంత శాతం భూమిని తగ్గించగలము?
a) 10% b) 9 1/8% c) 9 1/8% d) 9 1/11%

4. ఒక వర్తకుడు బ్లాక్–బోర్డును కొనుక్కొని 20% పెంచి అమ్మాలనుకున్నాడు. కానీ అమ్ముడు పోకపోవడం వలన పెంచిన ధరపై 10% తగ్గింపు ఇచ్చి 216 అమ్మాడు. కొన్న వెల ఎంత?
a) 108 b) 196 c) 200 d) 180

5. ఒక వాస్తవిక ధరపై 25% తగ్గింపునకు గడియారం కొన్నాడు. A ఒకవేళ 140% ధరను చేసి అమ్మినట్లయితే రూ. 40/– అదనంగా పొందుతాడు. అయిన ఆ గడియారం వాస్తవిక వెల ఎంత?
a) 800 b) 700 c) 900 d) 600

6. 12 కోతులు 12 అరటి పండ్లను 12 నిమిషాలలో తిన్న, 4 కోతులు 4 అరటి పండ్లను ఎన్ని నిమిషాలలో తినగలవు?
a) 4 b) 8 c) 12 d) 10

7. కొన్ని సహజ సంఖ్యల సరాసరి 15. దీనిలో మొదటి సంఖ్యకు 30 కలిపి చివరి సంఖ్య నుంచి 5 తీసివేసిన, దాని సగటు 17.5 అగును. అయిన సహజ సంఖ్య ఏది?
a) 15 b) 10 c) 20 d) 30

8. 20 మంది ఒక పనిని 18 రోజులలో చేయగలరు. 3 రోజుల పనిచేసిన తర్వాత 5 మంది కలిసారు. అయిన ఆ పని ఎన్ని రోజుల్లో పూర్తవుతుంది?
a) 15 b) 13 c) 12 d) 14

9. ఒక వ్యాపారి 1 కేజీ బాదం పప్పును రూ. 250కి కొన్నాడు. వాటిని రూ. 10లకి 50 గ్రాములుగా అమ్మినట్లయితే?
a) 20% నష్టం b) 25% నష్టం c) 25% లాభం
d) 20% లాభం

10. Find the Figure that represents groups:, విమానం, ఆకాశం, పైలట్
a) b) c) d)

11. రోహిత్, అమీత్‌కు తన కారును 10% తక్కువ చేసి అమ్మినాడు. అమీత్ 5000/–లతో రిపేర్ చేయించుకున్నాడు. ఆ తరువాత ఆ కారును రాజేష్‌కు 20% ధర పెంచి అమ్మినాడు. రాజేష్ కొన్నది సుమారు లక్ష రూపాయల కారు. వాస్తవిక ధర ఎంత?
a) 97,000 b) 87,000 c) 83,000 d) 93,000

12. 12 మంది వడ్రంగులు రోజుకు 6 గంటల చొప్పున పనిచేస్తూ 240 రోజులలో 460 కుర్చీలు తయారు చేస్తారు. 18 మంది వడ్రంగులు రోజుకి 8 గంటల వంతున పనిచేస్తూ 360 రోజుల్లో ఎన్ని కుర్చీలు తయారు చేయగలరు?
a) 920 b) 1320 c) 1260 d) 1380

13. ఒక పరీక్షలో 3 సబ్జెక్టులలో ఒక్కొక్క సబ్జెక్టు 100 మార్కులకు నిర్వహించబడింది. విద్యార్థి మొదటి సబ్జెక్టులో 60% మార్కులు, 2వ సబ్జెక్టులో 80% మార్కులు పొందాడు. అతను మొత్తం 70% మార్కులు సాధించిన 3వ సబ్జెక్టులో వచ్చిన మార్కుల శాతం ఎంత?
a) 80 b) 60 c) 65 d) 70

14. ఒక గ్రామంలో బాలురు, బాలికల నిష్పత్తి 3:2 ఒకవేళ 30% మంది బాలురు, 70% మంది బాలికలు పరీక్షలో పాల్గొన్నట్లయితే పరీక్షకు హాజరు కాని మరియు పరీక్షకు హాజరు అయ్యే విద్యార్థుల నిష్పత్తి ఎంత?
a) 23:47 b) 1:1 c) 9:14 d) 27:23

15. The value of [(.87)2+(0.13)2+(087)x(0.26)]2013 is:
a) –1 b) 0 c) 1 d) 2013

16. '10' ఆటలలో సగటు '32', ఆ తరువాత ఆట పూర్తయ్యే సమయానికి సగటు '6' పరుగులు పెరిగినవి. 11వ ఆటలో ఎన్ని పరుగులు చేసినారు?
a) 40 b) 6 c) 98 d) 38

17. ఒక రేడియో 20% లాభానికి అమ్మాలనుకున్నారు. ఒక వేళ అతను 30% లాభంకు అమ్మినట్లయితే 60 రూపాయలు అదనంగా వచ్చేవి. రేడియో కొన్న ధర ఎంత?
a) Rs.620 b) Rs.500 c) Rs.550 d) Rs.600

18. 2300, 3500లను ఏ గరిష్ఠ సంఖ్యచే భాగిస్తే శేషాలు వరుసగా 32, 56లు వస్తాయి?
a) 168 b) 42 c) 84 d) 136

19. A ఒక పనిని 25 రోజులలో చేస్తారు. B అదే పనిని 30 రోజులలో పూర్తి చేయగలరు. వారు ఇరువురు 5 రోజులు కలిసి పనిచేసిన పిమ్మట ఇంక ఎంత పని మిగిలి ఉంటుంది?
a) 19/30 b) 11/30 c) 12/30 d) 15/30

20. ఒక వస్తువు ధర 25% తగ్గించబడినది. వాస్తవిక ధరను తిరిగి పొందాలంటే ఎంత శాతం మేరకు ధరను పెంచగలము?
a) 11 1/9% b) 66 2/3% c) 33 1/3% d) 9 1/11%

21. రాజా, రాణీలు ఇద్దరు 10 సంవత్సరాల క్రితం పెళ్ళి చేసుకున్నారు. వారి వయసుల నిష్పత్తి 5:4. ఈ రోజు రాజు వయస్సు రాణి వయస్సు కంటే 1/6వ వంతు ఎక్కువ. రాజు, రాణి దంపతులకు ఒకే కాన్పులో ముగ్గురు, మరో కాన్పులో ఇద్దరు కవలలు, చివరి కాన్పులో ఒకరు జన్మించారు. వారి వయస్సుల నిష్పత్తి 3: 2: 1 అయితే ప్రస్తుతం ఆ కుటుంబం మొత్తం కావడానికి అవకాశమున్న గరిష్ఠ విలువ?
a) 79 b) 93 c) 101 d) 107

22. A.B.C.D అనే పూర్ణ సంఖ్యల లబ్ధము 3094. ఒకవేళ 1<A<B<C<D అయితే B మరియు C ల లబ్ధము
a) 26 b) 91 c) 133 d) 221

23. ఒక ఇనుప రాడ్డును మూడు సమాన భాగాలుగా ఒక్కో భాగము 12, 18, 32 ప్రమాణాలు ఉండే విధంగా విభజించిన కనిష్ఠంగా ఆ ఇనుప రాడ్డు పొడవు ఎంత ఉండేది?
a) 6,912 b) 864 c) 288 d) 240

24. 4 సెం.మీ. భుజంగా గల ఘనాన్ని ఒక సెం.మీ. భుజం గల ఘనాలుగా విభజించిన తర్వాత దాని యొక్క తల వైశాల్యములో పెరుగుదల శాతం ఎంత?
a) 4% b) 300% c) 75% d) 400%

25. 430 రూపాయల మొత్తాన్ని 45 మంది 12:15:16 నిష్పత్తిలో పురుషులు, స్త్రీలు మరియు పిల్లలకు పంచడం జరిగినది. కాని ప్రతి ఒక పురుషుడు, స్త్రీ, పిల్లవాడు వరుసగా 6:5:4 నిష్పత్తిలో డబ్బు తీసుకొనినారు. అయితే ప్రతి ఒక పురుషుడు, స్త్రీ, పిల్లవాడు తీసుకున్న సొమ్ము రూపాయల్లో తెలుపగలరు?
a) 12,10,8 b) 18,15,12 c) 120,150,160
d) 60, 75, 80

26. శ్రీనివాస్ వర్మ ఓ క్రికెట్ మ్యాచ్‌లో 50 ఓవర్లు ప్రతి బండి ఆడగలిగితే చేయు గరిష్ఠ, కనిష్ఠ పరుగుల బేధం
a) 1604 b) 1750 c) 1603 d) 1500

27. రెండు స్టేషన్ల మధ్య ప్రయాణించే ఒకటవ తరగతి, రెండవ తరగతి ప్రయాణికుల నిష్పత్తి 1:50 ఆ రెండు స్టేషన్ల మధ్య, ఒకటవ, రెండవ తరగతి ప్రయాణ చార్జీల నిష్పత్తి 3:1 ఒక ప్రత్యేకమైన రోజున ఆ రెండు స్టేషన్ల మధ్య వసూలు చేయబడిన చార్జీల మొత్తం 1328 రూ.లు. అయితే రెండవ తరగతి ప్రయాణికుల ద్వారా వసూలు చేయబడిన సొమ్ము ఎంత?
a) 750రూ.లు b) 850 రూ.లు c) 1000 రూ.లు
d) 1250 రూ.లు

28. 100 మీటర్ల పరుగు పందెంలో A పరుగు ప్రారంభించిన 20 మీటర్ల దూరంలో B పరుగు పందెం ప్రారంభించినట్లయితే A– B ని 5 సెకన్లలో ఓడిస్తాడు. మరో విధంగా A ప్రారంభమైన దగ్గర నుంచి 40 మీటర్ల దూరంలో B పరుగు ప్రారంభించిన ఈ పరుగు పందెం డ్రాగా ముగిసినది. A 200 మీటర్ల దూరాన్ని ఎన్ని సెకన్లలో చేరగలుగుతాడు.
a) 10 b) 20 c) 30 d) 40

29. A, B అనే ఇద్దరు సోదరుల వారి సోదరికి బహుమతిని కొనే ఉద్దేశంతో 4:5 నిష్పత్తిలో కొంత సొమ్ము పొదుపు చేశారు వారిరువురు. బహుమతిని కొనేందుకు భరించిన ఖర్చుల నిష్పత్తి 3:4 బహుమతిని కొన్న తరువాత A తను పొదుపు చేసిన మంఒత్తంలో 2/3 వంతు ఖర్చు చేశాడు. B వద్ద 145 రూ. మిగిలిన వారు కొన్న బహుమతి విలువ ఎంత?
a) 70 b) 105 c) 140 d) 175

30. A మరియు Bలు 10 నెలల పాటు గోవులు మేపడానికి పచ్చిక బయళ్ళను కిరాయికి తీసుకున్నారు. A 80 ఆవులను 7 నెలల పాటు మేపినట్లయితే A చెల్లించే సొమ్ములో B సగము చెల్లించినట్లయితే B మిగిలిన 3 నెలలో మొత్తం ఎన్ని ఆవులకు పచ్చిక బయళ్ళు మేపగలిగే సామర్థ్యాన్ని కలిగియున్నాడు.
a) 40 b) 80 c) 160 d) 280

31. గాలి గంటకు 5 కి.మీ.ల చొప్పున వీచునపుడు P అనువాడు సైకిల్‌పై కొంత దూరం గాలికి ఎదురుగా పోయాడు. అంతే కాలం గాలికి వాలుగా ప్రయాణం చేయగా రెట్టింపు దూరం పోయాడు. గాలి నిలకడగా ఉన్నప్పుడు అతని వేగం ఎంత?
a) 5 kmph b) 10kmph c) 15kmph
d) 20 kmph

32. ప్రకటన 1; ఆమె అందగత్తె. ప్రకటన 2; అనుష్క హీరోయిన్ సారాంశములు:
a) అనుష్క అందగత్తె
b) అందగత్తెలందరూ హీరోయిన్లు
c) హీరోయిన్లు అందంగా ఉంటారు d) ఏదీ కాదు

33. Xకు Y,Zలు ఇద్దరు భార్యలు X,Yకు ఉమ్మడి సంతానం లేదు. X,Zలకు 4గురు సంతానం P,Q,R,Sలలో చిన్నవాడు Sకు Y సంతానమైన Tకు గల సంబంధం
a) సోదరుడు b) వరుసకు సోదరుడు c) కజిన్
d) ఏమీ కాదు

34. కనీసం ఒక అంకె పునరావృతం అయ్యే విధంగా మొత్తం 8 అంకెల ల్యాండ్‌లైన్ టెలిఫోన్ నెంబర్ల సంఖ్య
a) 98185600 b) 97428800 c) 10000001 d) 98195600

35. 400 సంవత్సరాలలో నెలలో 29వ రోజు ఎన్నిసార్లు వస్తుంది?
a) 97 b) 6
c) 4400
d) 4497



– ముత్తినేని వీరయ్య
ఎంఫిల్, మ్యాథ్స్, బీఈడీ
గణిత విశ్లేషకులు,
అర్థమేటిక్& రీజనింగ్
షార్ట్ కట్స్ రచయిత,
సీనియర్ కాలమిస్ట్,
డైరెక్టర్, రామానుజన్ స్టడీ సర్కిల్


High risk medication

నర్సింగ్ పోటీ పరీక్షల కోసం

The International patient safety goals are important guidelines at the **international** level to promote specific improvements in the process of providing safe and high quality **patient** care.

ABSTRACT

High risk medication are the medications that are most likely to cause significant harm to the patient, even when used as required. The studies as per the **Institute for safe medication practices (ISMP)** shows that the incident ratio for this group of medications may not be necessarily higher than that of the other medicines, but hen the incidents occur the outcome on the patients would be fatal. In seeking to improve patient safety, the primary focus should be preventing errors with the greatest potential for harm. Many of the HRM like Insulin, Heparin, Morphine, profofol etc are delivered by IV infusion. Most of the fatal and serious adverse drug events (ADEs) are IV drug related. One of the most serious outcomes of medication errors are IV administration most of the times.



INTRODUCTION

ISMP defines high risk medication as, " the drugs that bear heightened risk of causing significant patient harm when they are used wrongly. Although mistakes may or may not be more common with these drugs, the consequences of an error are clearly more devastating to patients.

ERRORS IN THE MEDICATION CYCLE:



High risk medications: No nurse wants to be the cause of a fatal medication error, yet every shift we give medicines that are considered highrisk. The acronym **APINCH** is designed to serve as a reminder that even routinely administered medicines pose a high risk to patient safety.

APINCH

- A – Antiinfectives
- P – Potassium and other concentrated electrolytes
- I – Insulin
- N – Narcotics and other sedatives
- C – Chemotherapeutic agents
- H – Heparin and other anticoagulants.

In other category Look Alike and Sound Alike (LASA) group of drugs are also considered as high risk medication.

- A study was conducted to analyse the reasons for medication error at Abeer hospital, Sultanate of Oman.
- Multiple reasons were analyzed in the system, and an High alert policy was modified and implemented for the Reduction of harm from high risk medication

Guideline:

1. Training the staff (doctors, Pharmacists, nurses) about the high risk medication.
2. High alert medications to be prescribed in a separate medication chart
3. All the concentrated electrolytes must be stored in pharmacy only
4. All the narcotics should be stored in double lock system
5. The left out narcotic drugs to be discarded in the presence of two licensed practitioners and the empty ampoule to be returned to pharmacy in a black cover for further discarding from the hospital.
6. Policy guidelines in the form of flowchart prepared and displayed to make sure to have a double check to prevent any errors.
   a) Assembling counters; b) Verifying counters
   c) Packing counters; d) Dispensing counters
7. Counter check by the clinical pharmacologist or the senior pharmacist on duty before dispensing the medication
8. Assigned a separate dispensing staff for the high risk medication and no other medications will be dispensed while dispensing high risk medication.
9. Special appreciation to staff who follows the policy accurately
10. Counter check by the Ward Nurse Manager on duty while receiving the medication and before administering the medication to prevent errors.
11. The high risk medications to be administered in the presence of the witness.
12. After administering patient need to be monitored for any adverse drug events.
13. All the high risk medications must be dispensed with **HIGH RISK MEDICATION** label only.
14. Continuous training for the staff to update the knowledge and to the new joiners.
15. Adequate staff to be maintained at the pharmacy and nursing station
16. All the high risk medication to be placed in a separate cupboard and label it for easy identification.
17. High risk areas like critical units, PACU, HDU, chemo units to be concentrated.
18. A periodic audits and reviews to be done to make sure that the policy is followed at every level.
19. A 100% compliance would suggest that policy guideline are been followed in the hospital in a sustained manner and safe medication administration practices are delivered to the patient.

Post implementation: A similar study was done with the same criteria and it was analyzed that the number of errors has reduced with respect to the focused training, labelling, flow charts etc and none of the errors actually reached the patient.



– Mrs. Bindhu Varghese
Chief Nursing Officer
Abeer Hospital,
Sultanate of Oman

పండగ వేళ పట్టు ఎవర్‌గ్రీన్







పండుగ రోజుల్లో కట్టు, బొట్టులో స్పష్టమైన మార్పు కోరుకుంటారు మహిళలు. ఇక సంక్రాంతి లాంటి మెగా పండుగల గురించి ప్రత్యేకంగా చెప్పేదేముంటుంది. పట్టుచీర మొదలు పరికిణీ వరకు రకరకాల కాస్ట్యూమ్స్ ట్రై చేస్తారు. పంజాబీ డ్రస్ నుంచి చుడిదార్ వరకు... డ్రస్‌లు సింపుల్‌గా ఉన్నా లేదా భారీ డిజైన్లతో ఉన్నా వాటికి స్పెషల్ లుక్ వచ్చేది మాత్రం దుపట్టాతోనే. మెటీరియల్, డిజైన్ బట్టి రెండు భుజాల మీదుగా, ఒక భుజం మీదుగా, మెడ చుట్టూ స్కార్ఫ్.. ఇలా పలు రకాలుగా వేసుకోవచ్చు. పండగల వేళ మొదటి ప్రాధాన్యత పట్టు వస్త్రాలదే. సంప్రదాయ వేడుక లేదా పండగ అనగానే పట్టు చీరలు పట్టు లంగా ఓణీ తలపుకు వచ్చేస్తుంది. ఎప్పుడూ ఒకే టైప్ డ్రెస్ కోడ్ అనే నేటితరానికి మరికొంచెం కొత్తగా, మరింత ఆకర్షణీయంగా ఉండేలా ఇలాంటి ప్లెయిన్ డ్రెస్సులపైకి పట్టు దుపట్టాలను ఎంపిక చేయచ్చు. అయితే, కలర్ కాంబినేషన్స్, అలంకరణలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ప్లెయిన్ కలర్స్ అయినా కట్, కుట్టుతో ఇలాంటి కాంబినేషన్ ఆకట్టుకుంటుంది. సంప్రదాయ రంగులు అయితే పెద్ద పెద్ద ఆభరణాలు ధరించినా అందంగా కనిపిస్తారు.

పట్టు దుపట్టా

పండగ వేళ పసుపు, పచ్చ, ఎరుపు కాంతివంతమైన రంగులు ముంగిళ్లను కళకళలాడేలా చేస్తాయి. అందుకే ఆ హంగులు నింపుకున్న పట్టు డ్రెస్స్ లు పండగ అందాన్ని వెయ్యింతలు చేస్తాయి. పొడవాటి పటోలా గౌన్ మీదకు పట్టు దుపట్టా ఓ ప్రధాన ఆకర్షణ.

ప్లెయిన్ డ్రెస్‌లకు తోడు బనారస్ పట్టు



ప్లెయిన్ లాంగ్ అనార్కలీకి మెరుపు తీసుకురావాలంటే పువ్వుల ప్రింట్లు ఉన్న పట్టు దుపట్టా లేదంటే ఇక్కత్, పటోలా పట్టును ఎంపిక చేసుకుంటే ప్రత్యేకంగా కనిపిస్తారు.

పండగ వేళ పట్టు ఎప్పుడూ ఎవర్‌గ్రీన్ కాన్సెప్టే. సంక్రాంతి పండగ పూట ప్రతీది సంబరమే! ప్రతీది సంప్రదాయమే. పువ్వులుపండ్లు, మామిడితోరణాలు, పసుపు కుంకుమలతో పాటు పట్టు ఆభరణమై ఎన్నో విధాల జత కట్టచ్చు. పట్టు చీర కడితే చాలు అనుకునే రోజులు కావివి. పట్టును దేనితోనైనా జత కట్టవచ్చు అని ఆలోచించే రోజులు. అందుకు డిజైనర్లు సైతం తమ పనితనానికి మెరుగులు పెడుతుంటారు. పట్టును ఎలా ధరించినా కళ ఉట్టిపడుతుంది. కుర్తా, అనార్కలీ, పొడవాటి గౌను మీద పట్టు దుపట్టా, లెహెంగా మీదకు పట్టు ఓణీ జత చేసినా చాలు పండగ కళ వెయ్యింతలు అవుతుంది.







ఇయర్ కఫ్స్‌లుక్స్ సూపర్


చెవి బుట్టలు, రింగులు, హ్యాంగింగ్స్ ఎన్నో డిజైన్లు ట్రై చేసి బోరు కొట్టిందా. అయితే ఈ సంక్రాంతి పండగకు చెవి మొత్తాన్ని సింగారిస్తూ, చూడగానే ఆకట్టుకునే ఇయర్ కఫ్స్‌ని ట్రై చేయండి ఇక మీ లుక్ డిఫరెంట్‌గా ఉంటుంది. వీటిలో జుంకీలుగా వేలాడుతూ.. చెవి అంచుల వరకు ఉండేవి కొన్ని. మరికొన్ని దుద్దుల్లా చెవి భాగాన్ని పై వరకు పట్టి ఉంచుతాయి. ఈ కఫ్ ఇయర్ రింగ్స్ చెవి నుండి పక్కకి పడిపోకుండా పోగు పైభాగంలో చిన్న కొక్కెం ఉంటుంది. రంధ్రం అక్కరలేకకుండా దాన్ని చెవికి పట్టి ఉంచేలా నొక్కితే సరిపోతుంది. డిజైన్స్ విషయానికి వస్తే లతలూ, పువ్వులూ, చేపలూ, జంతువుల బొమ్మలతో పాటు ఎన్నో ఫంకీ డిజైన్లు వీటిలో వస్తున్నాయి. బంగారమే కాదు బ్రాస్, స్టీల్.. ఇతర లోహాలతోనూ ఇయర్ కఫ్స్ ఆకట్టుకుంటున్నాయి. వీటిని సందర్భాన్ని బట్టి ధరించవచ్చు.



















గోర్లపై పువ్వులు, కాయలు పండిద్దామా





కాస్త ఆసక్తి, అభిరుచి ఉంటే గోళ్ళను కూడా కాన్వాసుగా చేసుకోవచ్చు. నెయిల్ ఆర్ట్‌లో ప్రస్తుతం ఫ్లోరల్, ఫ్రూట్ ఫిల్ డిజైన్స్ ట్రెండ్ నడుస్తోంది. నియోన్, కూల్ రంగుల నెయిల్ పాలిష్లను ఉపయోగించి గోళ్ళపై రకరకాల పూలను డిజైన్ చేసుకోవచ్చు. మీ వ్యక్తిత్వం, మూడ్, వేడుకను బట్టి కూడా ఫ్లోరల్ డిజెన్లను గోళ్ళపై వేసుకోవచ్చు. మెనిక్యూర్ చేసిన తర్వాత గోళ్లను హైలైట్ చేస్తూ వాటిపై వివిధ రకాల పండ్లతో నచ్చిన పువ్వులను వేస్తే ఆ లుక్కే వేరు. అప్పుడు చేతికున్న పది వేళ్లు పది కాన్వాసులను తలపిస్తాయి.

చెట్లకి పండ్లు కాయడం మామూలే. కానీ ఇప్పుడు వేళ్లకి కూడా కాస్తున్నాయ్. ఫ్రూట్ ఫిల్ మానిక్యూర్ పుణ్యమా అని. ఒకప్పుడు చేతులకి, వేళ్లకి, గోళ్లకి గోరింటాకు పెట్టి ఆ రంగుకే మురిసిపోయేవారు. ఆ తరువాత నెయిల్ పాలిష్ లు వచ్చాయ్. వాటిని వేసుకుని భలే ఉన్నాయే అని సంబరపడేవారు. కానీ ఇప్పుడు ట్రెండ్ పూర్తిగా మారిపోయింది. నెయిల్ పాలిష్ ను మామూలుగా వేసుకోవడం లేదు. రకరకాల డిజైన్లను వేసుకుంటున్నారు. వాటిలో అత్యంత పాపులర్ అయిపోయింది ఫ్రూట్ ఫిల్ మానిక్యూర్.

ఆహా!



చిట్టి చిట్కాలు

- మాడిన ఆహారం కారణంగా కుక్కర్ లోపలి అడుగు నల్లగా మారితే వాడిన నిమ్మచెక్కలు, నీరుపోసి ఉడికిస్తే ఆ నలుపు పోతుంది.
- డ్రై ఫ్రూట్స్ డబ్బాలో 10 లవంగాలు వేస్తే వాటిలో పురుగు చేరదు. తాజాగానూ ఉంటాయి.
- గాజు గ్లాసులు ఒకదానిలో ఒకటి ఇరుక్కుని రాకపోతే వాటిని వేడినీటిలో పెట్టి పై గ్లాసులో చల్లని నీళ్ళు పోస్తే వెంటనే వచ్చేస్తాయి.
- కొత్త బియ్యంలో చెంచా నూనె, కంది పప్పు వేసి వండితే అన్నం ముద్దగాకుండా పొడి పొడిగా వస్తుంది.
- రెమ్మల నుంచి కరివేపాకును వేరు చేసి పొడిగా ఉండే గాజు సీసాలో పెట్టి మూతపెట్టుకుంటే నెలరోజులు పాడు కాదు.
- అట్లపిండిలో గుప్పెడు బంగాళాదుంప ముక్కలు కలిపి రుబ్బితే అట్లు రుచిగా వస్తాయి.
- పూరీలు కరకరలాడాలంటే పిండిలో అరకప్పు పాలు కలిపి ఒక గంట నాననివ్వాలి.

తీయటి వేడుక.. పంటల పండుగ

సంక్రాంతి సంబరాలతో ఊరూవాడా సందడిగా మారింది. పల్లె, పట్టణం, నగరం అనే తేడా లేకుండా పండగకు ముస్తాబయ్యాయి. రంగవల్లులు, హరిదాసులు, గంగిరెద్దులు, భోగిమంటలు, పిండి వంటలు, బంధుమిత్రుల సందడితో ఊళ్లన్నీ కళకళలాడుతున్నాయి. పిండి వంటలంటే కొన్ని ముందురోజే వండుకునేవి ఉంటాయి అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం.

బెల్లం బొబ్బట్లు



కావలసిన పదార్థాలు

శెనగపప్పు పావుకిలో, బెల్లం పావుకిలో, పచ్చికొబ్బరి అరకప్పు, నెయ్యి పావుకిలో, మైదాపిండి 200 గ్రా, యాలకులు 10, నూనె తగినంత

తయారు చేసే విధానం

ముందుగా మైదాపిండిని కొద్దిగా నీళ్లతో కలుపుకుని నూనెలో నానబెట్టుకోవాలి. ఇప్పుడు శెనగపప్పులను కుక్కర్‌లో మెత్తగా ఉడికించి అందులో బెల్లం, కొబ్బరి తురుము, యాలకుల పొడి వేసి కాసేపటి తరువాత దించేయాలి. ఈ మిశ్రమం చల్లారిన తరువాత దీన్ని మెత్తగా రుబ్బుకోవాలి. ఆ తరువాత చిన్న చిన్న ఉండలుగా చేసుకోవాలి. ఇప్పుడు మైదాపిండిని ఉండల్లా చేసుకుని నెయ్యిరాసి దాని మధ్యలో పూర్ణం ఉండ పెట్టుకుని నాలుగువైపులా మూసేసి చేత్తో చపాతిలా మెల్లగా ఒత్తుకోవాలి. ఆ తరువాత పెనంపై నెయ్యి వేసి బొబ్బట్టును వేసి దోరగా రెండు వైపులా వేయించుకోవాలి. అంతే... బొబ్బట్లు రెడీ.

నువ్వుల అరిసెలు



కావల్సిన పదార్థాలు

నువ్వులుపావు కప్పు, బియ్యం ఒక కేజీ, బెల్లంముప్పావు కేజీ, నూనె వేయించడానికి తగినంత, నీరుఒక కప్పు

తయారీ విధానం

బియ్యాన్ని శుభ్రంగా కడగాలి. మళ్లీ మంచి నీళ్లుపోసి 6 గంటల సేపు నానబెట్టాలి. తర్వాత నానిన బియ్యాన్ని పల్చటి వస్త్రంమీద పోసి కొద్దిగా తడి ఆరనివ్వాలి. కొంచెం తడిపొడిగా ఉండగానే పిండి మెత్తగా పట్టించుకుని పిండి ఆరిపోకుండా మూత పెట్టుకోవాలి. బెల్లాన్ని బాగా మెత్తగా దంచి ఒక పాత్రలో వేసి అందులో ఒక కప్పు నీళ్లు పోసి స్టౌమీద సన్నని మంటపై పెట్టాలి. తర్వాత దానిని గరిటెతో కలుపుతూ ముదరుపాకం వచ్చేవరకు ఉంచాలి. పాకం రాగానే స్టౌమీద నుండి దించి ఒకరు గరిటెతో పాకాన్ని తిప్పుతుంటే మరొకరు పిండిని అందులో పోయాలి. పిండి ఉండలు కట్టకుండా జాగ్రత్తగా త్వర త్వరగా గరిటెను తిప్పాలి. సరిపడినంత పిండి పోసి అది ఆరిపోకుండా మూత పెట్టుకోవాలి. తర్వాత పిండిని చిన్నచిన్న ముద్దలుగా చేసుకొని ఒక పాలిథిన్ కవరు మీద చేతితో గుండ్రంగా వత్తుకొని పెట్టుకోవాలి. తర్వాత బాణలిలో నూనె పోసి స్టౌపై పెట్టాలి. నూనె వేడి కాగానే అందులో వత్తి పెట్టుకున్న అరిసెలను వేయాలి. అవి బంగారు రంగులోకి వచ్చేంతవరకు వేయించి తీసి వాటిని ప్రెస్ చేసే దానితో నొక్కాలి. తర్వాత వాటిని నువ్వులలో వేసి వత్తితే అరిసెలు రెడీ.

గుమ్మడి బూరెలు




కావలసిన పదార్థాలు

తీపి గుమ్మడి తురుము 1 కప్పు, బెల్లం తురుము 1 కప్పు, యాలకుల పొడి 1 స్పూన్, జీడిపప్పు 1 స్పూన్, నెయ్యి పావుకప్పు, మినపప్పు 1 కప్పు, బియ్యం 2 కప్పులు, ఉప్పు చిటికెడు, నూనె సరిపడా.

తయారు చేసే విధానం

ముందుగా మినపప్పు, బియ్యాన్ని కలిపి నాలుగు గంటల పాటు నానబెట్టి మెత్తగా రుబ్బి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు గుమ్మడి తురుమును శుభ్రమైన వస్త్రంలో మూటకట్టి దానిపై బరువు పెట్టాలి. కాసేపటికి అందులో తడి పోతుంది. తరువాత స్టౌవ్ మీద బాణలి పెట్టి కొద్దిగా నెయ్యి వేసి జీడిపప్పు పలుకులు వేయించి తీసుకోవాలి. అదే బాణలిలో మిగిలిన నెయ్యి వేసి గుమ్మడి తురుము వేసి పచ్చి వాసన పోయేంత వరకు వేయించి అందులో బెల్లం తురుము వేసి కలుపుకోవాలి. ఆ తరువాత ఆ మిశ్రమంలో యాలకుల పొడి, జీడిపప్పు పలుకులు కలిపి దించేయాలి. ఈ మిశ్రమం చల్లారిన తరువాత నిమ్మకాయ పరిమాణంలో ఉండల్లా చేసుకుని పెట్టుకోవాలి. ఇప్పుడు ముందుగా రుబ్బిపెట్టుకున్న పిండిలో ఉప్పువేసి కలుపుకోవాలి. పూర్ణం ఉండల్ని ఒక్కోటి చొప్పున ఆ పిండిలో డిప్ చేసి నూనెలో వేసి వేయించి తీసుకుంటే.. టేస్టీ టేస్టీ గుమ్మడి బూరెలు రెడీ.

డ్రై ఫ్రూట్ కజ్జికాయలు



కావలసిన పదార్థాలు

మైదాపిండి మూడు కప్పులు, ఉప్పు చిటికెడు, నెయ్యి మూడు టేబుల్స్పూన్లు, గసగసాలు రెండు టేబుల్స్పూన్లు, ఎండుకొబ్బరిపొడి పావుకప్పు, పంచదార లేదా బెల్లం తురుము అరకప్పు, జీడిపప్పు, బాదం, పిస్తా, అక్రోటు ముక్కలు అరకప్పు (అన్నీ కలిపి), నూనె వేయించడానికి సరిపడా.

తయారు చేసే విధానం

ముందుగా మైదాపిండిలో చిటికెడు ఉప్పు, కాస్త నూనె, తగినన్ని నీళ్లు పోసి పూరీ పిండిలా కలపాలి. పాన్‌లో నెయ్యి వేసి జీడిపప్పు, బాదం, పిస్తా, అక్రోటుముక్కలు, గసగసాలు, ఎండు కొబ్బరిపొడి, అన్నీ వేసి కలిపి వేయించాలి. చల్లారాక బెల్లంతో కలిపి కచ్చాపచ్చాగా పొడి చేసుకోవాలి. మైదా ముద్దను చిన్న పూరీల్లా చేసుకుని పూరీని కజ్జికాయల చెక్కలో పెట్టి దాని మధ్యలో ఒక టేబుల్‌స్పూన్‌ను గ్రైండ్ చేసిన మిశ్రమాన్ని వేసి ఓ పక్క పూరీకి కాస్త తడిచేసి చెక్కను మూసి గట్టిగా నొక్కి తీయాలి. ఇలా అన్నీ చేసుకున్నాక కాగిన నూనెలో వేయించి తీయాలి.

హెల్త్

బేరిపండులోని ఆరోగ్య ప్రయోజనాలు..



చాలా మంది పండ్లను అనారోగ్యంతో ఉన్నప్పుడు మాత్రమే తీసుకోవాలనుకుంటారు. కానీ పండ్లు పోషక విలువలు కలిగినవి కాబట్టి అన్ని సమయాలలో అన్ని వేళలా తినొచ్చు. ఆరోగ్యంగా ఉన్నప్పుడు తింటే వ్యాధి సమస్యలు కూడా రాకుండా ఉంటాయి. పండ్లు రోగనిరోధక శక్తిని పెంచి, అనారోగ్య సమస్యల నుండి విముక్తి చేస్తాయి. కాబట్టి పండ్లన్నింటినీ, సీజన్‌లో లభించే వాటిని తినడం అలవాటు చేసుకోండి. ఒక్కోపండు ఒక్కో వ్యాధి నియంత్రణిగా పనిచేస్తుంది.

పియర్స్ పెళుసైనదిగా ఉండి, దాని లోపల ఉండే గుజ్జు తియ్యగా చాలా రుచిగా ఉంటుంది. ఆకుపచ్చ రంగును కలిగి ఉండే ఈ పండ్లు అసంఖ్యాకమైన ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. శరీరానికి అవసరమైన యాంటీ ఆక్సిడెంట్లను సరఫరా చేయడం ద్వారా, దీర్ఘకాలిక వ్యాధులతో పోరాడే శక్తిని కలిగి ఉంటాయి. పియర్స్‌లో ఎక్కువ ఫైబర్‌ను కలిగి ఉండటం వల్ల అది కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. వీటిలో ఫైటోన్యూట్రియంట్స్ ఉండటం వల్ల క్యాన్సర్‌కు వ్యతిరేక పాలీఫెనోల్స్ గానూ పనిచేస్తుంది. అలాగే ఇవి యాంటీ ఏజింగ్ ఫ్లేవానాయిడు, యాంటీ ఇన్ఫ్లమేటరీ ఫ్లేవనాయిడ్ల గానూ ఉండటం వల్ల మలబద్ధకం, అధిక కొలెస్ట్రాల్, డయాబెటిస్, మూత్రపిండాలలో ఉన్న రాళ్లను తొలగించేస్తాయి. వీటిలో కాపర్, మెగ్నీషియం, మాంగనీస్, బీ కాంప్లెక్స్ విటమిన్లు, పొటాషియం, విటమిన్–సి, విటమిన్–కెలు ఉన్నాయి.

జీర్ణ వ్యవస్థను మెరుగుపరుస్తుంది

పియర్స్‌లో ఉన్న ఫైబర్ కంటెంట్ కారణంగా మలబద్ధకం, అతిసారం, లూజ్ మోషన్స్ అయ్యే అవకాశాలను తగ్గిస్తుంది. పియర్స్ పెద్దపేగులో స్వేచ్ఛా రాశులుగా తిరిగే హానికరమైన క్యాన్సర్ ఏజెంట్లను నిర్బంధించడం వల్ల శరీర అవయవాలకు నష్టం వాటిల్లకుండా రక్షిస్తుంది.

రోగనిరోధక వ్యవస్థ

పియర్స్ విటమిన్–సి గల శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లను కలిగి ఉండటం వల్ల, స్వేచ్ఛగా తిరుగుతూ ఇతర అవయవాలకు నష్టాన్ని కలుగజేసే రాడికల్‌పై పోరాడుతుంది. ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తుంది. ఆరోగ్యవంతమైన జీవక్రియ కోసం, కణజాలాన్ని మరమత్తు చేయడం, కణ ఉత్పరివర్తనను ఆపడానికి విటమిన్–సి అనేది అత్యంత ఆవశ్యకమైనది. ఇది యాంటీ ఏజింగ్ ప్రభావ లక్షణాలను కలిగి ఉండడం వల్ల రోగనిరోధక వ్యవస్థను మెరుగుపరుస్తుంది.

ఫైబర్ శాతం ఎక్కువ..



బేరిపండులో అధికమైన ఫైబర్‌తో ఉండడం వల్ల, రోజువారీ అవసరమయ్యే 25 నుండి 30 గ్రాముల ఫైబర్‌ను అందిస్తుంది. ఫైబర్ సులభంగా జీర్ణమయ్యే కేలరీలను కలిగి ఉండడం వల్ల రక్తంలోని చక్కెర స్థాయిలను అదుపుచేయడంలో సహాయపడుతుంది. ఈ ఫైబర్ శరీర వ్యవస్థలో ఉన్న వ్యర్థాలను బయటకు పంపడానికి సహాయపడుతుంది. కొలెస్ట్రాల్‌ని నియంత్రించి, అలాగే ఆయువు, జీర్ణకోశాల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

బరువు తగ్గేందుకు



తక్కువ క్యాలరీలు గల పండ్లల్లో పియర్స్ కూడా ఒకటి. ఇది సహజమైన చక్కెర స్థాయిని కలిగి ఉంటుంది. ఒక్క పియర్‌లో 100 కేలరీలు ఉండడం వల్ల బరువు కోల్పోయేలా చేస్తుంది. బరువు తగ్గాలనుకునే వారు ఈ పండు తినే ప్రయత్నాన్ని చేస్తే, శరీరాన్ని ఫైబర్‌తోనూ, శక్తితోనూ పూర్తిగా నింపు తుంది. దీంతో కడుపు పూర్తిగా నిండడం వల్ల మీకు ఎక్కువ ఆకలి అనిపించదు.

ఎముకల ధృఢత్వానికి


పియర్స్ విటమిన్–కె బోరాన్‌లను కలిగిన ఉంటుంది. విటమిన్–కె లోపంతో బాధపడుతున్నట్లయితే, ఎముకలకు సంబందించిన రుగ్మతలు సంభవించవచ్చు. విటమిన్–కె అనేది ఫాస్పరస్, మెగ్నీషియం, కాల్షియం వంటి ఇతర ఖనిజాలతో కలసి పని చెయ్యటం వల్ల ఎముకల విచ్ఛిన్నమును, బోలు ఎముకల వ్యాధిని నిరోధిస్తుంది.

రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది

పియర్స్‌లో ఐరన్, కాపర్‌లను అధిక మొత్తం ఉండడం వల్ల రక్తహీనతను నిరోధిస్తుంది. ఐరన్, ఎర్ర రక్త కణాలను ఉత్పత్తి చేయడానికి అవసరమైన ముఖ్యమైన ఖనిజం. కాపర్ శరీరంతో కావలసినంత ఐరన్‌న్ను గ్రహించి శరీరంలోని ముఖ్యమైన అవయవాలు దానిని సరఫరా చెయ్యటంలో సహాయపడుతుంది. అందువలన రక్తప్రవాహమును అభివృద్ధి చేస్తూ, రక్తప్రసరణను నియంత్రిస్తుంది.

వాపులను తగ్గిస్తుంది

శరీరంలోని మంటను తగ్గించి, యాంటీఆక్సిడెంట్లను, ఫ్లేవనాయిడ్లు కలిగి ఉంటాయి. కీళ్ళనొప్పులు, గౌట్, రుమటాయిడ్ ఆర్థరైటిస్, ఇతర ఆరోగ్య పరిస్థితుల ప్రతికూల లక్షణాలను తగ్గించడంలో యాంటీ ఇన్ఫ్లమేటరీ ప్రభావాన్ని కలిగి ఉన్నందున కావలసిన చికిత్సను చేకూరుస్తుంది. అంతేగాక పియర్స్‌లో ఉండే ఆంథోసనియాన్లు కూడా వాపును తగ్గించడంలో బాగా సహాయపడతాయి.



గుండెని పదిలంగా

గుండెవ్యాధుల ప్రమాదపు రేటును తగ్గించే శక్తివంతమైన సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. వీటిలో ఉండే యాంటీఆక్సిడెంట్ ఫైటోకెమికల్స్ హృదయ వ్యాధులను, గుండెపోటు, స్ట్రోక్స్ వంటి ప్రమాదాలను తగ్గిస్తాయి. ఇది మీ ధమనులను ఎప్పుడు శుభ్రపరచ డంలో సహాయపడుతుంది. వాపులను, అధిక స్థాయి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తుంది.


స్వస్థతను చేకూరుస్తుంది

విటమిన్–సి, ఆస్కార్బిక్ యాసిడ్లను కలిగి ఉండటం వల్ల శరీరానికి స్వస్థత చేకూర్చే కొత్త కణజాలం సమీకరణ ప్రక్రియను వేగవంతం చేస్తుంది. వీటిలో ఉన్న ఆస్కార్బిక్ ఆమ్లం అధిక స్థాయిలు పాడైపోయిన రక్త నాళాలను సరిచేస్తాయి. గుండె మీద ఒత్తిడిని తగ్గించి, గుండె వ్యాధుల ముప్పును నిరోధిస్తుంది.

షుగర్ నియంత్రణ



వీటిలో ఫ్రక్టోజ్ రూపంలో సహజమైన చక్కెరలను కలిగి ఉంటాయి. గ్లైసెమిక్ సూచిక తక్కువ శాతంలో ఉండడంతో డయాబెటిస్‌తో బాధపడే వారు ఏ భయం లేకుండా ఈ పండ్లను తినవచ్చు. వీటిలో ఇన్సులిన్, సెన్సిటివిటీని అభివృద్ధి చేసే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి.ఇది మధుమేహాన్ని నిరోధించ డంలో, నివారించడంలో కీలక పాత్రను పోషిస్తుంది.



అనుష్కతో నటించడం లేదు – మాధవన్

ఒకపుడు హీరోగా నటించిన ఆర్.మాధవన్.. ఇపుడు సపోర్టింగ్ రోల్స్ చేస్తున్నాడు. ఇటీవల అక్కినేని నాగచైతన్య నటించిన 'సవ్యసాచి' చిత్రంలో విలన్ క్యారెక్టర్గా కనిపించాడు. ఇపుడు మరో చిత్రంలో నటిస్తున్నాడు. ఈ నేపథ్యంలో త్వరలో లేడీ టైగర్ అనుష్క ప్రధాన పాత్రలో తెరకెక్కనున్న చిత్రంలో మాధవన్ అత్యంత కీలక పాత్రను పోషించనున్నారనే వార్తలు హల్చల్ చేస్తున్నాయి. ఈ విషయాన్ని మాధవన్ స్వయంగా వెల్లడించారు. హే... గాయ్స్.. నేను అనుష్క చిత్రంలో నటించడం లేదు. దీనికి సంబంధించి వస్తున్న వార్తల్లో ఏమాత్రం నిజంలేదన్నారు. మాధవన్ క్లారిటీతో అనుష్క సినిమాలో మాధవన్ నటించడం లేదని అర్థమైంది. మాధవన్ చేస్తున్న రాకెట్రీ చిత్రం ఇస్రో సైంటిస్ట్ నంబీ నారాయణన్ జీవిత నేపథ్యంలో తెరకెక్కుతుంది. ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలే ఉన్నాయి. మరోవైపు అనుష్క నటిస్తున్న థ్రిల్లర్ చిత్రానికి ప్రముఖ కథా రచయిత కోన వెంకట్ నిర్మాతగా వ్యవహరించనున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ఈ చిత్రాన్ని నిర్మించనుంది. మూవీ చిత్రీకరణ ఎక్కువ శాతం అమెరికాలో జరగనుంది. ఈ చిత్రంలో హాలీవుడ్ నటులు కూడా నటిస్తారని సమాచారం. ఈ చిత్రానికి హేమంత్ మధుకర్ దర్శకత్వం వహించనుండగా, తెలుగు, తమిళ భాషల్లో తెరకెక్కనుంది.



చిరు చూసి అన్నాడా.. చూడక అన్నాడా..

చిరు బ్లాక్ బస్టర్ మూవీ ఘరానా మొగుడులో ఓ డైలాగ్ చాలా పాపులర్. చూసి చింపిందా చూడకుండా చింపిందా అని రావుగోపాల రావు అంటే దానికి బదులుగా చిరంజీవి ఎలా చింపితే ఏంటి మొత్తానికి చిరిగిందిగా అంటూ చెప్పడం బాగా పేలింది. ఇప్పుడీ ప్రస్తావన ఎందుకు అనుకుంటు న్నారా. వినయ విధేయ రామ చరణ్ ఇంత కష్టపడినప్పటికీ కథాకథనాలు ప్రేక్షకుల నుంచి విమర్శల వర్షాన్ని కురిపించు కున్నాయి. వసూళ్లు ఓ మోస్తరుగా ఉన్నా అదంతా పండగ సెలవుల ప్రభావమే తప్ప మరొకటి కాదు.

అయితే విడుదలకు ముందు జరిగిన ప్రీ రిలీజ్ లో చిరంజీవి దీని గురించి ఓ రేంజ్లో పొగుడుతూ రామ్ చరణ్ని బోయపాటి శీనుని ఆకాశాని కెత్తేసాడు. ఇవన్నీ ఈవెంట్లో సహజంగా అందరు మాట్లాడేవే అయినప్ప టికీ ఫ్యాన్స్ మాత్రం ఓ రేంజ్ లో ఊహించుకున్నారు. కట్ చేస్తే వినయ విధేయ రామ బొమ్మ తిరగబడింది. అప్పుడు ఆ వేదికలో చిరు మాట్లాడిన మాటలు మళ్ళి చర్చలోకి వస్తున్నాయి. అసలు చిరు సినిమాను చూసే పొగిడాడా లేక ట్రైలర్ బిట్లు ఓ రెండు మూడు యాక్షన్ సన్నివేశాలు చూసి సినిమా మొత్తం ఇలాగే ఉంటుంది అని ఊహించుకుని స్టేజి మీద అలా చెప్పేసాడా అనే అనుమా నాలు కలుగుతున్నాయి.

రంగస్థలం వేడుకలో చిరు చాలా స్పష్టంగా దాని విశేషాలు చెప్పాడు. ఆది పినిశెట్టి పాత్ర చనిపోయినప్పుడు చరణ్ యాక్టింగ్ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించాడు. అంటే చూసాడు కాబట్టే అంత కాన్ఫిడెంట్ గా చెప్పి ఉండవచ్చు. అయితే వినయ విధేయ రామ పూర్తిగా చూసి ఉంటే చిరు ఖచ్చితంగా కొన్ని మార్పులు చెప్పేవారని సైరాలో బిజీగా ఉండటం వల్ల ఫైనల్ కాపీ చూడకపోవడం వల్లే మరీ తీసికట్టుగా వివిఆర్ని బయటికి వదిలారని మెగా కాంపౌండ్ మాట.

అమెరికాలో అనుష్క సినిమా

భాగమతి సినిమా తర్వాత అనుష్క ఏ సినిమా చేయనుందో ఇప్పటి వరకు ఎనౌన్స్ చేయలేదు. కానీ... ఇటీవల అనుష్క సైలెన్స్ అనే సినిమా చేయనుంది అనే వార్త బయటకు వచ్చింది. ఈ చిత్రానికి హేమంత్ మధుకర్ దర్శకత్వం వహించనున్నారు. కోన ఫిల్మ్ కార్పోరేషన్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంయుక్తంగా ఈ సినిమాని నిర్మించనున్నాయి. వైవిధ్యమైన కథాంశంతో రూపొందే ఈ సినిమా అమెరికాలో షూటింగ్ జరుపుకోనుంది.

ఇలా వార్తలు ప్రచారంలోకి వచ్చాయి కానీ... అఫిషియల్గా ఎనౌన్స్మెంట్ మాత్రం రాలేదు. అయితే... స్టార్ రైటర్ కోన వెంకట్ ట్విట్టర్లో ఫాలోవర్స్ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెబుతూ.... ఈ సినిమా మార్చిలో ప్రారంభం కానుందని చెప్పారు. ఎక్కువ భాగం షూటింగ్ అమెరికాలోనే ఉంటుందట. అనుష్క మూగ అమ్మాయిగా నటించనుంది అనే టాక్ వినిపిస్తోంది నిజమేనా? అని అడిగితే... అఫిషియల్గా ఎనౌన్స్ చేసేవరకు ఏమీ నమ్మద్దు అన్నారు. ఈ సంవత్సరంలోనే రిలీజ్ చేయాలనుకుంటున్నారట. అదీ.. సంగతి..!





నేను వాళ్ళ స్థాయికి ఇంకా రాలేదు

– అనిల్ రావిపూడి

వెంకటేష్, వరుణ్తేజ్, తమన్నా, మెహరీన్ కౌర్ హీరో హీరోయిన్లుగా దిల్రాజు సమర్పణలో శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ పై అనిల్ రావిపూడి దర్శకత్వంలో శిరీష్, లక్ష్మణ్ నిర్మాతలుగా రూపొందిన చిత్రం 'ఎఫ్2.. ఫన్ అండ్ ఫ్రస్టేషన్'. జనవరి 12న సినిమా విడుదలైంది. ఈ సందర్భంగా దర్శకుడు అనీల్ రావిపూడి మాట్లాడుతూ... ఆసనం ఐడియా అలా వచ్చింది..

సాధారణంగా మనం రకరకాల ఆసనాలు వేస్తుంటాం. అలాంటిది మనలో ఉన్న ఒత్తిడిని దూరం చేసుకోవడానికి ఒక ఆసనం ఉంటే ఎలా ఉంటుంది. అనే ఆలోచన నుండి ఈ వెంకీ ఆసనం పుట్టుకొచ్చింది. అలాగే వెంకటేష్గారికి ఓ మేనరిజమ్ పెట్టి.. దాన్ని కథకు లింక్ చేస్తు బావుంటుందనిపించి ఈ వెంకీ ఆసనం కనిపెట్టాను. ఆడియెన్స్ దాన్ని బాగా ఓన్ చేసుకున్నారు. చాలా మంది థియేటర్లో ఆ ఆసనాన్ని వేస్తున్నారు. పాపులర్ అయ్యింది. వారి స్థాయికి ఇంకా చేరుకోలేదు..

సంక్రాంతి విన్నర్ అంటే పక్క సినిమాలతో పోటీ అనే భావన వచ్చేస్తుంది. అయితే నాకొక ఆలోచన ఉండేది. ఈవీవీగారి సినిమాలు, కృష్ణారెడ్డిగారి సినిమాలు.. జంధ్యాలగారి సినిమాలను చూస్తే.. అన్నీ వర్గాల ప్రేక్షకులు నవ్వుతూనే ఉండేవారు. వారి సినిమాలను బాగా చూసేవాడిని. అలా పూర్తిస్థాయి సినిమాను తీయాలనే కోరిక ఉండేది. అది ఈ సినిమాతో తీరింది. మెమొరబుల్ ఎక్స్పీరియెన్స్. అందరూ పగలబడి నవ్వుతున్నారు. సోషల్ మీడియాలో ఈవివిగారు, జంధ్యాలగారితో పోలుస్తూ కొందరు కామెంట్స్ కూడా చేశారు. అయితే వారి స్థాయికి నేను ఇంకా చేరుకోలేదు. అయితే ఎక్కడో ఒకచోట వాళ్ల ప్రభావం నాపై ఉంటుందనే మాట మాత్రం వాస్తవం. ఎందుకంటే వాళ్ల సినిమాలను నేను అలా చూసేవాడిని. వారి స్టయిల్ను నా స్టయిల్కు తగ్గట్టు మార్చుకుని సినిమాలు చేస్తున్నాను.

వరుణ్ చక్కగా చేశాడు...

వరుణ్ కూడా ఇప్పటి వరకు కామెడీ జోనర్లో సినిమా చేయలేదు. తను వెంకటేష్తో ఎలా కామెడీ టైమింగ్లో చేస్తాడోనని కాస్త ఆలోచించాను. తెలంగాణ యాస మాట్లాడుతూ వరుణ్ యాదవ్ అనే కుర్రాడి పాత్రలో కామెడీ జోనర్లో తొలిసారి చాలా చక్కగా నటించాడు. వెంకీగారితో కలిసి తను అద్భుతంగా నటించాడు.

కథాలోచన అక్కడ నుండే వచ్చింది..

'పటాస్' నుండి రాజాది గ్రేట్' వరకు కమర్షియల్ సినిమాలు చేశాను. అయితే రాజాది గ్రేట్ సినిమా చేసేటప్పుడు అసలు ఫైట్ లేకుండా ఓ కమర్షియల్ సినిమా చేద్దాం అనే ఆలోచన వచ్చింది. దానికి ఎలాంటి బేస్ తీసుకుద్దాం. అని ఆలోచన వచ్చింది. పెళ్ళాం చెబితే వినాలి, క్షేమంగా వెళ్ళి లాభంగా రండి జోనర్లో ఈ మధ్య సినిమాలు రాలేదనిపించి ఈ కథను రాసుకున్నాను. సాధారణంగా ఓ సినిమాను పూర్తి చేయడానికి ఏడాది సమయం పడుతుంది. కాబట్టి నాటీం సాయి, ప్రవీణ్, నారాయణలతో కథపై నాలుగైదు నెలలు వర్క్ చేశాం. సీక్వెల్గా చేస్తా...

హిందీలో గోల్మాల్, హౌస్ఫుల్ సినిమాల సిరీస్ ఉంది. మన తెలుగులో ఇలాంటి జోనర్లో సినిమాలు చేయాలని ఉంది. కచ్చితంగా ఎఫ్ 2కు సీక్వెల్గా ఎఫ్ 3 చేస్తాను. వెంకటేష్గారికి, వరుణ్కి చెప్పేశాను. వాళ్లు ఎప్పుడైనా రెడీ అన్నారు. చర్చల్లో ఉంది...

వెంకటేష్గారికి ఓ లైన్ చెప్పాను. ఆయనకు బాగా నచ్చింది. కథా చర్చలు జరుగుతున్నాయి. అది ఎప్పుడు ఓకే అవుతుందో ఇప్పుడే చెప్పలేను. కథను నమ్మారు..

వెంకటేష్గారు కథను బాగా నమ్మారు. డబ్బింగ్ చెప్పేటప్పుడు సినిమా అంతా చూసి.. బయటకు వచ్చి 'అదేంటమ్మా అలా చేయించేశావ్' డబ్బింగ్ ఎంత ఎనర్జీతో చెప్పాలో తెలుసా! రేపు వచ్చి డబ్బింగ్ చెబుతాను' అని వెళ్లిపోయారు. చాలా కేర్ తీసుకుని డబ్బింగ్ చెప్పారు. అక్కడే నుండే ఆ క్యారెక్టర్స్...

సూర్యకాంతంగారి నటనలో, డైలాగ్ చెప్పడంలో ఓ స్టయిల్ ఉంటుంది. ఆమె డైలాగ్ను చాలా అందంగా విరుస్తారు. అలాంటి క్యారెక్టర్ మోడ్రన్గా ఉంటే ఎలా ఉంటుందో అని ఆలోచించి ప్రగతి క్యారెక్టర్ను పెట్టాం. మా అమ్మమ్మ, నాయనమ్మలు ఉండేవారు. ఏ ఫంక్షన్కి వచ్చినా మంచంపై కూర్చుని అది.. ఇది అంటూ అందరినీ కామెంట్ చేస్తుంటారు. ఆ క్యారెక్టర్స్ నాకు బాగా రిజిష్టర్ అయ్యాయి. అందువల్ల అలాంటి క్యారెక్టర్స్ను అన్నపూర్ణమ్మ, వై.విజయలుగా సినిమాలో చూపెట్టాం.

తదుపరి చిత్రాలు..

ఇంకా ఏమీ అనుకోలేదు. పండుగకు ఊరెళ్లి ఎంజాయ్ చేసి.. మూడు వారాలు రిలాక్స్ అయ్యి.. ఓ జోనర్లో చేయాలనేది ఆలోచించుకుని చేస్తాను. బాలకృష్ణగారికి కూడా ఓ ఐడయా చెప్పాను. ఈసారి ఫుల్ లెంగ్త్ కామెడీ చేయను. అయితే నా సినిమాల్లో ఫన్ లేయర్ లేకుండా ఉండదు.

చివరి షెడ్యూల్లో నిఖిల్ ముద్ర

యంగ్ హీరో నిఖిల్ సిద్దార్థ్, లావణ్య త్రిపాఠి జంటగా తెరకెక్కుతున్న యాక్షన్ ఎంటర్ టైనర్ ముద్ర. ఈ చిత్రాన్ని టిఎన్ సంతోష్ తెరకెక్కిస్తున్నారు. వాస్తవిక సంఘటనల ఆధారంగా జర్నలిజం నేపథ్యంలో తెరకెక్కుతున్న సినిమా ఇది. ముద్ర షూటింగ్ చివరిదశలో ఉంది. ఐదు రోజుల టాకీ.. ఓ పాట ఈ నెలలో పూర్తి చేయనున్నారు. డబ్బింగ్ వర్క్స్, పోస్ట్ ప్రొడక్షన్ పనులు ఒకేసారి పూర్తి చేస్తున్నారు చిత్రయూనిట్. అద్భుతమైన ఔట్ పుట్ ఇవ్వడానికి చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు దర్శక నిర్మాతలు. ఈ చిత్రంలో గ్రాఫిక్స్ వరక్స్ కూడా ఉన్నాయి.. దాంతో పాటు భారీ యాక్షన్ సీక్వెన్సులు ఉన్నాయి.. అందుకే కాస్త సమయం ఎక్కువగా తీసుకుంటు న్నారు యూనిట్. ఇందులో జర్నలిస్ట్ పాత్రలో నటిస్తున్నారు నిఖిల్.. ఫస్ట్ లుక్కు కూడా అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. టీజర్ త్వరలోనే విడుదల కానుంది. స్యామ్ సిఎస్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. వెన్నెల కిషోర్, పోసాని కృష్ణమురళి, నాగినీడు, ప్రగతి, సత్య, తరుణ్ అరోరా, రాజా రవీంద్ర ఈ చిత్రంలో సహాయ పాత్రల్లో నటిస్తున్నారు. ఔరా సినిమాస్ పివిటి, మూవీ డైనమిక్స్ ఎల్ఎల్పి బ్యానర్స్పై కావ్య వేణుగోపాల్, రాజు కుమార్ నిర్మిస్తున్నారు. బి మధు ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు.





అదృశ్యం ట్రైలర్

వైష్ణవి ఎంటర్టైన్మెంట్స్ పతాకం పై రవిప్రకాష్ కృష్ణం శెట్టి నిర్మించిన చిత్రం అదృశ్యం. హారర్, థ్రిల్లర్, కామెడి, ప్రధానాంశముగా రూపొందిన ఈ చిత్రం సెన్సార్ పూర్తి చేసుకుని ఫిబ్రవరిలో విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ సందర్భంగా ఈ చిత్ర ట్రైలర్ను శనివారం ఫిల్మ్ఛాంబర్లో హీరో జాన్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా పాత్రికేయుల సమావేశంలో...

హీరో జాన్ మాట్లాడుతూ...

తెలుగులో ఇది నా మూడవ చిత్రం. అదే నువ్వు అదేనేను, బంటీ ద బ్యాడ్ బోయ్ తర్వాత నేను నటించే మూడవ చిత్రమిది. నాకు ఈ అవకాశం ఇచ్చిన డైరెక్టర్ రవిగారికి నా కృతజ్ఞతలు. తెలుగు ఇండస్ట్రీ చాలా పెద్దది. చాలా బావుంటుంది. ఈ రోజు లెజండరీ డైరెక్టర్ కె. విశ్వనాథ్గారిని కలిసి మా ఆడియోని రిలీజ్ చేశాము. ఆయన నన్ను చూసి ప్రభాస్లా ఉన్నావు అన్నారు. నాకు చాలా ఆనందంగా ఉంది. అంత పెద్ద డైరెక్టర్ నన్ను పొగడడం అంటే మాములు విషయం కాదు, అందరూ నన్ను తప్పకుండా ఆదరిస్తారని కోరుకుంటున్నాను అని అన్నారు.

దర్శకుడు రవిప్రకాష్ మాట్లాడుతూ...

ముందు నా కెరియర్ మొదలైంది కె.విశ్వనాథ్గారి దగ్గర. ఆయన దగ్గర కో డైరెక్టర్గా చాలా సినిమాలకు పని చేశాను. తర్వాత సింగీతం శ్రీనివాస్ గారు దగ్గర 14 సినిమాలకు పని చేశాను. నేను చాలా అదృష్టవంతుడిని అలాంటి లెజండరీ డైరెక్టర్ల దగ్గర పని చేయడం నాకు చాలా గర్వంగా ఉంది. హీరో జాన్ ఆల్రెడీ నా పిల్లల చిత్రం చేశారు. అందుకే ఆయన్నే హీరోగా ఎంచుకున్నా. నేను చేసిన బంటీ ద బ్యాడ్ బాయ్ కి ఎన్నో అవార్డులు వచ్చాయి. ఒక రివార్డు వచ్చే సినిమా చెయ్యాలని ఈ సినిమా చేస్తున్నాను. ఇది ఒక థ్రిలర్.చాలా అత్యాధ్భుతంగా ఉంటుంది. చిత్రంలో ఎక్కడా ల్యాగ్ ఉండదు. సినిమా ఇంట్రస్టింగ్గా ఉంటే చాలు బడ్జెట్ తో పనిలేదు. నా హీరోకి నేను ముందుగా కృతజ్ఞతలు చెప్పాలి. ఇందులో నలుగురు హీరోయిన్లు నటిస్తున్నారు. జయవాణి ఒక మాంత్రికురాలిగా ప్రత్యేక పాత్రలో చేశారు. చాలా బాగా చేశారు. టెక్నీషియన్లు అందరూ ఈ చిత్రం కోసం చాలా కష్టపడ్డారు. అందువల్లే ఈ చిత్రం చాలా బాగా వచ్చింది మీరందరూ తప్పకుండా ఈ చిత్రాన్ని ఆదరిస్తారని కోరుకుంటున్నాను అని అన్నారు.



ఉండిపోరాదే..

తరుణ్ తేజ్, లావణ్య లు హీరోహీరోయిన్స్ గా పరిచయం అవుతూ శ్రీమతి సత్య ప్రమీల కర్లపూడి సమర్పణ లో గోల్ టైమిన్ పిక్చర్స్ బ్యానర్ పై డాక్టర్ లింగేశ్వర్ నిర్మాత గా నిర్మిస్తున్న చిత్రానికి ఉండిపోరాదే.. అనే టైటిల్ ని ఖరారు చేశారు. ప్రముఖ నిర్మాత దిల్ రాజు బ్యానర్ లో అసోసియెట్ దర్శకుడి గా పనిచేసిన నవీన్ నాయని దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. ఇప్పటికే రాజమండ్రి, ఆత్రేయపురం పరిసర ప్రాంతాల్లో మెదటి షెడ్యూల్ షూటింగ్ ని పూర్తచేసుకుంది. సంక్రాంతి సందర్భంగా ఈ చిత్రం టైటిల్ ని మెదటి లుక్ ని విడుదల చేసారు.

ఈ సందర్బంగా నిర్మాత డా. లింగేశ్వర్ మాట్లాడుతూ.. కథ స్ట్రాంగ్ గా వుంటే కథకు తగ్గ నటీనటులు వుంటే.. ఆ కథని తెరకెక్కించే దర్శకుడు వుంటే కొత్త పాత అనే తేడా చూపకుండా ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. ఇదే బేస్ చేసుకుని చక్కటి కథని మా బ్యానర్ లో తెరకెక్కిస్తున్నాము. నవీన్ నాయని దర్శకుడు, తరుణ్ తేజ్, లావణ్య లు జంటగా కనిపిస్తారు. ఈ చిత్రానికి ఉండిపోరాదే అనే చక్కటి టైటిల్ ని ఖరారు చేశారు. సంక్రాంతి సందర్బంగా మా చిత్రం మెదటి లుక్ కి విడుదల చేశాము. రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో మెదటి షెడ్యూల్ ని పూర్తిచేసాము.అలాగే మా తదుపరి షెడ్యూల్ ని ఈ నెల 28 నుండి బెంగుళూరు, మైసూర్, కరీంనగర్, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఏకధాటిగా చిత్రీకరిస్తాము.

'మహా చంద్ర'

నైనా ఫిలిమ్స్ పతాకం పై యశ్ ,ప్రేమ్ కుమార్, శ్రీయ నటీనటులుగా రూప అయ్యర్ దర్శకత్వం లో షాన్వాజ్ నిర్మించిన చిత్రం ' మహా చంద్ర'.ఈ చిత్రం ప్రస్తుతం డబ్బింగ్ పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత షాన్వాజ్ మాట్లాడుతూ ' కన్నడలో సూపర్ హిట్ అయిన చంద్ర చిత్రాన్ని మహా చంద్ర పేరుతో తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నాం.యశ్ ఈ చిత్రంలో ఒక ప్రముఖ పాత్రను పోషిస్తున్నారు. అలాగే శ్రీయ తన అద్భుతమైన నటన తో ఆకట్టుకుంటుంది.ప్రస్తుతం డబ్బింగ్ పూర్తి చేసుకున్న మా చిత్రాన్ని ఫిబ్రవరి రెండో వారంలో ప్రేక్షకుల ముందుకు తీసుకు రానున్నాం. అన్నారు. దామోదర వనాఛార్య సమర్పణలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి సంగీతం: గౌతమ్ శ్రీ వాస్తవ, కెమెరా: దాస్, నిర్మాత:షాన్వాజ్, దర్శకత్వం:రూప అయ్యర్.





'యమ్6' సెన్సార్ పూర్తి

విశ్వనాథ్ ఫిలిం ఫ్యాక్టరీ, శ్రీలక్ష్మి వెంకటాద్రి క్రియేషన్స్ బ్యానర్స్పైవిశ్వనాథ్ తన్నీరు నిర్మించిన చిత్రం 'యమ్6'. ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకొని యు/ఎ సర్టిఫికెట్ పొందింది. ఈ సందర్భంగా నిర్మాత విశ్వనాథ్ తన్నీరు మాట్లాడుతూ "మా 'యమ్6' చిత్రం సెన్సార్ పూర్తి చేసుకొని యు/ఎ సర్టిఫికెట్ పొందింది. సస్పెన్స్ థ్రిల్లర్గా రూపొందిన ఈ చిత్రాన్ని ఎక్కడా రాజీ పడకుండా చాలా క్వాలిటీగా నిర్మించాం. ప్రేక్షకుల్ని థ్రిల్ చేసే ఒక అద్భుతమైన కథని దర్శకుడు జైరాం అంతే అద్భుతంగా తెరకెక్కించారు. ఈ సినిమా ప్రతి ఒక్కరినీ అలరిస్తుంది. ఫిబ్రవరి మొదటి వారంలో ఈ సినిమాను విడుదల చేస్తున్నాం" అన్నారు. దర్శకుడు జైరామ్వర్మ మాట్లాడుతూ "నిర్మాత విశ్వనాథ్గారు ఈ సినిమాను క్వాలిటీలో ఎక్కడా రాజీ పడకుండా నిర్మించారు. ఎలాంటి హంగులు ఆర్భాటాలు లేకుండా సినిమాను నేచురల్గా తెరకెక్కించాం. ప్రత్యేకంగా పోరాట ద శ్యాలు మన కళ్ళముందే జరుగుతున్నట్లు ఉంటూ అందరినీ అలరిస్తాయి.

ప్రోటీన్ల అవసరం ఎంతో తెలుసా..?

సమయానికి తింటున్నాం.. పనులు చక్కబెడుతున్నాం.. ఫరవాలేదు అనుకుంటారు చాలామంది. మీరు తినే ఆహారంలో పోషక విలువలను పట్టించుకుంటున్నారా... ముఖ్యంగా ప్రోటీన్ అవసరం యెంత ఉండాలో అవగాహన వుందా. మన శరీర బరువులో ఒక కిలో కి 0. 8గ్రాముల నుంచి 1 గ్రాము వరకు అంతకన్నా ఎక్కువ ప్రోటీన్ అవసరం ఉంటుంది. ఉదాహరణకి వ్యక్తి బరువు 60 కిలోలు ఉంటే 50 నుంచి 60 గ్రాముల ప్రోటీన్ అవసరం. ప్రోటీన్ శాతం తగ్గితే తొందరగా అలసట వస్తుంది. వ్యాయామం చేసేటప్పుడు నీరసంగా నిస్సత్తువగా ఉంటుంది. జుట్టు రాలడం, చర్మ కాంతి తగ్గిపోవడం జరుగుతుంది. ప్రోటీన్లను కోల్పోకూడదంటే ఎగ్ వైట్, పాల ఉత్పత్తులైన పనీర్ చీజ్ లాంటివి ఆహారంలో తప్పక చేర్చాలి. కొక్స్, ఫ్లేవర్డ్ డ్రింక్స్, వేపుళ్లకు దూరంగా ఉండాలి .







భోగీ.. భోగమ్మా రావే..!

సంక్రాంతి (సంక్రమణం) అంటే మారడం అని అర్థం. ఈ రోజున సూర్యుడు ఉత్తరాయణ పథంలో ప్రవేశిస్తాడు. అంటే ఉత్తరాయణ పుణ్యకాలం ఈ రోజు నుంచి ప్రారంభమవుతుంది. మన పురాణాల ప్రకారం ఈ రోజు నుంచి స్వర్గద్వారాలు తెరచి ఉంటాయి. పంట మంచి దిగుబడి సాధించిన రైతులు తమ ఇళ్లలో ధన, ధాన్యలక్ష్మిలు కొలువై ఉంటారని విశ్వసిస్తారు. అందుకని 'సంక్రాంతి'ని పంటల పండుగ అని కూడా చెప్పొచ్చు.



భోగి

ఈ రోజున ఇంటిల్లిపాది తెల్లవారుజామున లేచి భోగిమంటలు వేస్తారు. కొత్త ఆలోచనలు తోడుగా కొత్త జీవితం ఆరంభించడానికి ప్రతీకగా పాత వస్తువులను కాలుస్తూ భోగి మంటలు వెలిగిస్తారు. సంక్రాంతి నిలబెట్టిన నెలరోజుల నుంచి అంటే ధనుర్మాసం ప్రారంభం నుంచి వాకిట్లో ముగ్గులు వేసి, ఆవుపేడతో చేసిన గొబ్బెమ్మలు పెడతారు. పేడతో చేసిన పిడకలతో భోగి రోజున భోగి మంటలు వేసుకొని పాలు పొంగిస్తారు. ఇక ఆ తర్వాత పిల్లలకు నూతన వస్త్రాలు ధరింపచేసి రేగిపళ్లు, పూలు మొదలైన వాటితో భోగి పళ్ళు పోస్తారు. దీంతో పిల్లలకు ఉన్న దిష్టి దోషాలు తొలగి పెద్దల ఆశీర్వాదాలు లభిస్తాయి.

రేగుపండ్లు, నువ్వులు, బియ్యం, పచ్చి శెనక్కాయ గింజలు (దీనినే హరిబూట్ అని అంటారు) చెరుకు ముక్కలు, పాలకాయలు (వరిపిండి, నువ్వులు కలిపి గోళీల్లా వేయిస్తారు) చిల్లర పైసలు అన్నీ కలిపి పిల్లలను వరుసగా కూర్చోబెట్టి బుడబుడ పళ్లని వారి తలపై జాలువారేలా పెద్దలు తలంబ్రాలు పోస్తారు. పిల్లలకు దృష్టి దోషాలు ఏమైనా ఉంటే భోగి పళ్లతో తుడిచి పెట్టుకుపోతాయని పెద్దల నమ్మకం. ఆడపిల్లలు చిట్టిపొట్టి రంగురంగుల గౌన్లు వేసుకుంటే, అబ్బాయిలు పొట్టి లాగులు వేసుకొని జేబుల చొక్కాలతో బొమ్మల్లా తయారై ముచ్చట గొలుపుతారు.

బొమ్మల కొలువు

భోగిరోజున బొమ్మల కొలువు కొందరికి ఆనవాయితీ ఉంటుంది. ఉదయాన్నే పూజతో పాటు ముందురోజు పేర్చి పెట్టిన బొమ్మల కొలువు దగ్గర కూడా పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ముత్తయిదువలు సాయంకాలం పేరంటాళ్లను పిలిచి తమకు తోచిన, నచ్చిన స్టీలు, వెదురు, పింగాణీ వస్తువులను వాయినంగా ఇచ్చుకుంటారు. వాయినం ఇస్తూ, తీసుకుంటూ 'ఇస్తినమ్మా వాయినం – తీసుకుంటి వాయినం' అని ఇరువురూ అనుకుంటారు.

పిల్లలు స్నేహితురాళ్లకు బుజ్జి బుజ్జి బొమ్మలు కానుకలుగా ఇస్తారు. వచ్చిన వాళ్లకి నువ్వులు – పంచదార కలిపి 'నువ్వులు తిని నూరేళ్లు బతుకు, తీపి తిని తియ్యగా మాట్లాడాల'ంటూ నోరు తీపి చేస్తారు. ఇవన్నీ సరదాల ముచ్చట్లు. ఈ సరదాలలో సాంప్రదాయం ఇమిడి ఉండటం తెలుగింటి గొప్పదనం. ఈ ఇచ్చి పుచ్చుకోవడాలతో బంధుత్వాలు, బాంధవ్యాలు బలపడతాయి.

బొమ్మల కొలువులు మంచి చెడు, పేద గొప్పా చిన్నా పెద్దా భేదభావాలు లేని సామరస్యం, సామాజిక వాదం బొమ్మల అమరికలో కనిపిస్తుంది. పక్కనే మేక, ఏనుగుల మధ్య కుందేలు, పూరిల్లు – మేడ, రాజు, బంటు అన్నీ, అందరూ ఒక్కదగ్గరే కొలువై సంఘీభావాన్ని చాటడం ముచ్చటగా ఉంటుంది.

భోగి నుంచి ముక్కనుమ వరకూ గొబ్బి పాటలు, రంగవల్లులు, గంగిరెద్దుల ఆటలు, హరిదాసుల కీర్తనలు, భోగి మంటలు, సన్నాయి స్వరాలు, కొత్త పంటల వంటకాలతో ప్రతీ ఇల్లూ లోగిలీ సంక్రాంతి లక్ష్మిని కొలువుదీర్చి సంబురాలు జరుపుకోవడం తెలుగువారి సౌభాగ్యం.









నగలను ఇలా మెరిపించాలి!

ఆభరణాలను అలంకరించుకోవడంలో ఉన్నంత శ్రద్ధ వాటిని శుభ్రంగా ఉంచడంలో చాలామందికి ఉండదు. అందుకే ఆభరణాలు త్వరగా మెరుపు కోల్పోయినట్టుగా కనబడతాయి. బంగారు ఆభరణాలను శుభ్రపరచడానికి మేలైన చిట్కాలు...

ఆభరణాలను దాదాపుగా ఇంట్లోనే శుభ్రపరచుకోవడం శ్రేయస్కరం. ఖర్చు తక్కువ అవుతుంది. బయట శుభ్రపరచడానికి ఇచ్చినప్పుడు తలెత్తే మోసాలనూ అరికట్టవచ్చు.

నగలంటే ఇష్టపడని, ఇష్టముండని వారు ఎవరైనా ఉంటారా..? ఉండరు? అందరికీ ఇష్టమైనవే. మరి అంత ఇష్టపడే వారు ఎప్పుడో కొన్న వాటిని ఇప్పుడు పండుగలకు వేసుకోవాలంటే మెరుపు తగ్గిపోయి, పాతవాటిలా కనిపిస్తాయి. మరి ఈ పండుగకు మీ పాత నగలనే కొత్తవాటిలా మెరిపించాలంటే ఇలా చేయండి.



వేటికవి విడిగా..

విభిన్న రకాల ఆభరణాలు ఉంటాయి. వెండి, బంగారు, ప్లాటినమ్, పూసలు, రాళ్లు... ఇలా ఆభరణాలను వేటికవి విడివిడిగా ఉంచాలి. లిక్విడ్ సోప్స్ (మార్కెట్లో లభిస్తాయి) వీటిని ఆభరణాల మీద మృదువుగా రుద్ది, కడిగి, మెత్తని నూలు వస్త్రంతో తుడవాలి. ఇంకా దుమ్ము, జిడ్డు ఉన్నాయి.. పోవడం లేదు అనుకుంటే క్లబ్ సోడాను ఉపయోగించాలి. బంగారు ఆభరణాల జిడ్డు వదలాలంటే 15 నిమిషాల పాటు సబ్బు నీటిలో ఉంచి, తర్వాత శుభ్రపరచాలి.

మృదువైన టూత్ బ్రష్

ఆభరణాల మురికిని తీసివేయడానికి బ్రష్‌ను వాడుతుంటారు. ఇందుకు మృదువైన బ్రష్‌ను ఉపయోగించాలి. టూత్‌బ్రష్ కొనుగోలు చేసే ముందు లేబుల్‌పై 'సాఫ్ట్ బ్రిస్టల్స్' అని ఉన్నది తీసుకోవాలి. బ్రష్‌తో ఆభరణాలను శుభ్రం చేయడానికి ముందు దానిని 10 నిమిషాలు వేడి నీటిలో నానబెట్టి, ఆ తర్వాత ఉపయోగించాలి. దీనివల్ల బ్రష్ కుచ్చు మృదువుగా తయారవుతుంది. ఫలితంగా ఆభరణాలకు హాని కలగదు. మురికి కూడా వదులుతుంది. ఐబ్రో బ్రష్, హెయిర్ డై బ్రష్‌లను ఆభరణాల శుభ్రతకు ఉపయోగించకూడదు.

అమ్మోనియా ద్రావణం

అమ్మోనియా ద్రావణానికి ఆరు భాగాల నీళ్లు కలపాలి. ఆభరణాలను సబ్బు నీటితో శుభ్రపరిచిన తర్వాత వాటిని అమ్మోనియా నీటి ముంచి, తడి లేకుండా తుడవాలి. ఇలా చేస్తే ఆభరణాలకు మెరుపు వస్తుంది. అయితే ధరించిన ప్రతీసారి అమ్మోనియాతో శుభ్రపరచకూడదు. ఒక్కోసారి అమ్మోనియా కారణంగా ఆభరణం రంగు మారే అవకాశం ఉంటుంది.

వెచ్చని నీరు

ఆభరణాన్ని బ్రష్‌తో రుద్దుతున్నప్పుడు గోరువెచ్చని నీటిని పోస్తూ రబ్ చేస్తూ ఉంటే మురికి వదులుతుంది. ఎక్కువసేపు రుద్దాల్సిన అవసరం ఉండదు. అయితే, ఆభఱణాలను అన్నింటినీ కలిపి కాకుండా విడివిడిగా శుభ్రపరచాలి.

రత్నాలను నీటిలో ఉంచరాదు

రత్నాలు పొదిగి ఉండే ఆభరణాలను ఎక్కువసేపు నీళ్లలో ఉంచకూడదు. సబ్బు నీటిలో ముంచి, వెంటనే తీయాలి. గోరువెచ్చని నీటిని పోస్తూ మృదువుగా రుద్దాలి. తర్వాత మెత్తని వస్త్రంతో తడి లేకుండా తుడవాలి. ఆభరణం వెనక వైపు కూడా తడి లేకుండా తుడిచి, భద్రపరచాలి.

టూత్‌పేస్ట్ ఉపయోగం


టూత్‌బ్రష్‌కి కొద్దిగా పేస్ట్ అద్ది, దాంతో బంగారు ఆభరణాలను శుభ్రపరచాలి. గోరువెచ్చని నీళ్లు పోస్తూ రుద్దుతూ కడిగితే, చక్కగా శుభ్రపడతాయి.

మరిగితే మెరుపు

మైనం, గ్రీజ్ వంటివి ఆభరణాలకు అంటితే త్వరగా పోవు. ఇలాంటప్పుడు మరుగుతున్న నీటిలో ఆభరణాలను వేసి, తర్వాత సబ్బు నీటితో శుభ్రపరచాలి.

ముంగిట్లో ముగ్గు













ఇంటికి ఆరోగ్యం.. ఇండోర్ ప్లాంట్స్!

పెరట్లో పెంచే మొక్కలు చాలానే ఉన్నాయి. వీటిలానే ఇంట్లోనూ పెంచే ప్లాంట్స్ కూడా ఉన్నాయి. అందుకే అందం, ఆహ్లాదం, స్వచ్ఛమైన గాలి అన్ని రకాలుగానూ ఉపయోగకరంగా ఉండే ఇండోర్ ప్లాంట్స్‌ను మీరు ఎంపిక చేసుకోండి.

మనం పెరట్లో రకరకాల మొక్కలు పెంచుతుంటాం. దానివల్ల ఎన్నో లాభాలున్నాయని మనకు తెలుసు. అయితే మొక్కలను ఇంట్లోనూ పెంచడం వల్ల కొన్ని లాభాలున్నాయి. వీలయినంత ఎక్కువ సేపు మనం ఉండేది ఇంట్లోనే. కాబట్టి అక్కడ గాలి కాలుష్య రహితంగా ఉండాలి. కొన్ని ప్రాంతాల్లో బయటి గాలి కన్నా ఇంట్లో 12 శాతం అదనంగా కాలుష్యం ఉంటుందట. దీనికి కారణం ఇంటికి వాడిని పెయింట్‌లూ, భవన నిర్మాణ సామగ్రి, ఫర్నీచర్ వంటివే. ఆ ప్రభావం తగ్గాలంటే ఇంట్లో చిన్న చిన్న మొక్కల్ని పెంచుకోవడం చక్కని మార్గం. అలాగే మొక్కలు ఇంట్లో తేమను పెంచి దుమ్ము లేకుండా చేస్తాయి. దుమ్ముతో వచ్చే జలుబూ, అలర్జీ, గొంతునొప్పి, దగ్గు వంటి వాటిని 30 శాతం తగ్గిస్తాయని అధ్యయనాలు చెబుతున్నాయి. చెట్టు ఎక్కడ ఉంటే అక్కడ సంతోషం ఉంటుంది. ఇదీ మానసిక నిపుణులు చెప్పిన మాటే. ఇంట్లో ఒక చిన్న మొక్కను పెంచుకుంటే అది ఆందోళనా, ఒత్తిడి నుంచి ఉపశమనాన్ని అందిస్తుంది. ఆశావహ దృక్పథం పెరిగేలా చేస్తుంది. ఏకాగ్రతా, జ్ఞాపకశక్తి పెరగడంలో సాయపడుతుంది.

మనం శ్వాస తీసుకునేప్పుడు ఆక్సిజన్ తీసుకుని కార్బన్ డయాక్సైడ్‌ని వదులుతాం. మొక్కలైతే... కార్బన్ డయాక్సైడ్‌ని తీసుకుని ఆక్సిజన్‌ని వదులుతాయి. మొక్కలు ఇంట్లో ఉంటే ఈ ప్రక్రియ చాలా త్వరగా జరిగిపోతుంది. స్వచ్ఛమైన గాలి మనకు అందుతుంది. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉండదు. స్వచ్ఛమైన గాలి ఇంట్లోని వ్యర్థాలను దూరం చేస్తుంది కూడా. శస్త్ర చికిత్సలు చేసిన వారికీ, అనారోగ్యంతో బాధపడుతున్న వారికీ పూలూ లేదంటే ఓ మొక్కని కానుకగా ఇస్తుంటాం. కిటికీల వద్ద కుండీల్లో, వేలాడే కుండీల్లో మొక్కల్ని పెంచితే, అవి మానసికంగా ప్రభావం చూపిస్తాయి. తద్వారా రక్తపోటూ, ఆందోళన వంటివి తగ్గుముఖం పడతాయి. ఇన్ని లాభాలున్న మొక్కల్ని ఇంట్లో పెంచేద్దామా మరి!





కోడిగుడ్లు రిటైల్ ధర (100కు)			
హైదరాబాద్	443	విజయవాడ	453
ముంబయి	495	ఢిల్లీ	470
చెన్నై	460	బెంగుళూరు	455



బ్రాయిలర్ చికెన్ ఫామ్‌గేట్ ధర (కిలో) రూ.			
హైదరాబాద్	120	ఢిల్లీ	130
కరీంనగర్	115	ముంబయి	125
వరంగల్	120	చెన్నై	135



సెన్సెక్స్	నిఫ్టీ	రూపాయి	పసిడి
−96.66	−26.65		
36,009	10,794	₹69.68 (ఒక అమెరికా డాలర్‌కు)	32,823.53 (హైదరాబాద్‌లో) 24 క్యా..10 గ్రాములకు/(రూ.)లలో







కొత్త ఆఫర్ ప్రకటించిన అమెజాన్

ఢిల్లీ: తమ వినియోగదారులను ఆకట్టుకునేందుకు అమెజాన్ ఇండియా మరో కొత్త ఆఫర్ ప్రకటించింది. ఆమెజాన్ గ్రేట్ ఇండియా సేల్ పేరుతో కొన్ని వస్తువులపై డిస్కౌంట్ ఆఫర్ ప్రకటించింది. జనవరి 20 నుంచి 23 వరకు ఈ డిస్కౌంట్ ఆఫర్ అందుబాటులో ఉంటుందని కంపెనీ పేర్కొంది. నాలుగు రోజుల పాటు ఉండే ఈ ఆఫర్‌లో స్మార్ట్‌ఫోన్స్ , ల్యాప్‌టాప్స్, కెమెరాలు, హెడ్‌ఫోన్‌లతోపాటు ఇతర వుస్తువులపై ఆఫర్ ఇస్తున్నట్లు అమెజాన్ తెలిపింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ డిబెట్, క్రిడెట్ కార్డుల ద్వారా కొనుగోలు చేసిన కస్టమర్లకు తక్షణ డిస్కౌంట్ 10 శాతం లభిస్తోందని కంపెనీ వెల్లడించింది. జనవరి 19 మధ్యాహ్నం 12 గంటల నుంచి ప్రైమ్ మెంబర్లను అవకాశం ఉంటుంది.

ముద్ర పథకంతో బ్యాంకింగ్‌లో..
ఎన్‌పీఏలు పెరుగుతున్నాయి: ఆర్‌బీఐ

ఢిల్లీ: చిన్న పరి శ్రమలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రధాన మంత్రి ముద్ర పథకం కారణంగా బ్యాంకింగ్ రంగంలో ఎన్‌పీఏలు పెరుగుతున్నాయని ఆర్‌బీఐ హెచ్చరించింది. భవిష్యత్తులో ఆ పథకం ఎన్‌పీఏలకు మూలంగా మారుతుందని పేర్కొంది. ఈ పథకం కింద ఇప్పటికే దాదాపు రూ. 11,000 కోట్ల మేరకు మొండి బకాయిలు ఉన్నాయని వెల్లడించింది. ఒక్క 2017–18 సంవత్సరాల్లోనే ఈ పథకం కింద రూ. 2.46లక్షల కోట్ల మేరకు రుణాలు పంపిణీ చేశారు. వీటిల్లో మొత్తం 40శాతం మహిళలకు పంపిణీ చేశారు. మరో 33శాతం సామాజికంగా వెనుకబడిన వర్గాలకు అందజేశారు. ఈ పథకం మొత్తం 4.81 కోట్ల మంది లబ్ధి పొందారు. ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ సంక్షోభం కొనసాగుతున్న సమయంలో ఆర్బీఐ ముద్ర రుణాలపై కూడా హెచ్చరికలు జారీ చేసింది. 2015లో పీఎంఎంవై పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం కింద చిన్న పరిశ్రమలు, వాణిజ్య సంస్థలకు బ్యాంక్లు రూ. 10లక్షల వరకు రుణాలు ఇవ్వాలి. మొత్తం మూడు విభాగాల్లో ఈ రుణాలను మంజూరు చేస్తారు.



కార్పొరేట్ వర్గాలకు 25శాతం
పన్నులు తగ్గించాలి: ఫిక్కీ



ఢిల్లీ: త్వరలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టబోయే మధ్యంతర బడ్జెట్‌లో కార్పొరేట్ వర్గాలకు మేలు చేకూరేలా పన్నులు తగ్గించాలని పరిశ్రమల సంస్థ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఫిక్కీ) కోరింది. ఆర్థిక వృద్ధి , పన్ను ఆదాయం పెరగాలంటే టర్నోవర్‌తో సంబంధం లేకుండా కార్పొరేట్ పన్నును 25శాతానికి తగ్గించాలని ప్రతిపాదించింది. అంతేకాకుండా పన్ను శ్లాబులను సైతం సవరించాలని కోరింది.

ప్రస్తుతం వ్యాపార రంగం ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటోంది. వాటిలో అధిక పన్నులు ఒకటి. దీని వల్ల ఉత్పత్తి వ్యయం పెరుగుతోంది. పెట్టుబడులు పెట్టడానికి, వ్యాపార విస్తరణకు అవకాశం లేకుండా పోతోంది. ప్రాథమికంగా 30శాతం పన్ను రేటుతో పాటు డివిడెంట్ డిస్ట్రిబ్యూషన్ ట్యాక్స్ రూపంలో మరో 20శాతం పడుతోంది. దీంతో కంపెనీలు అత్యధిక పన్ను చెల్లించాల్సి వచ్చింది.' అని ఎఫ్ఐసీసీఐ పేర్కొంది. బడ్జెట్‌కు ప్రభుత్వానికి పంపించే అభ్యర్థనల్లో భాగంగా ఫిక్కీ ఈ మేరకు కోరింది. ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో పన్ను రేట్లు తగ్గిస్తున్న నేపథ్యంలో భారత్ కూడా వాణిజ్యాన్ని ప్రోత్సహించే విధంగా అదే బాటలో పయనించాలని సూచించింది. ప్రస్తుతం కనీస ప్రత్యామ్నాయ పన్ను (మాట్) రేటు 18.5 శాతంగా ఉందని.. ఇది కూడా చాలా ఎక్కువ అని పేర్కొంది. దీనిని కూడా క్రమంగా తగ్గించాలని ఫిక్కీ ప్రభుత్వాన్ని కోరింది. పరిశోధనలకు, కార్పొరేట్ సామాజిక బాధ్యతగా వెచ్చించే మొత్తానికి మినహాయింపులను కొనసాగించాలని పేర్కొంది. దీంతోపాటు ఆదాయ పన్ను కనీస మినహాయింపు పరిధిని రూ. 3లక్షలకు పెంచాలని సూచించింది.

పేరు మార్చుకున్న ఐడిఎఫ్‌సీ బ్యాంక్

ముంబై: ప్రైవేటు రంగ ఐడీఎఫ్‌సీ బ్యాంక్ పేరు ఇక ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌గా మారింది. నేటి నుంచి కొత్త పేరు అమల్లోకి వస్తుందని ఐడీఎఫ్‌సీ బీఎస్ఈ ఫైలింగ్ ద్వారా వెల్లడించింది. ఐడీఎఫ్‌సీ బ్యాంక్, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ(ఎన్‌బీఎఫ్‌సీ) కేపిటల్ ఫస్ట్‌లో విలీనమైన నేపథ్యంలో బ్యాంకు పేరును మార్చినట్లు బీఎస్ఈ ఫైలింగ్‌లో పేర్కొన్నారు. విలీనానంతరం సంస్థ మొత్తం రుణ ఆస్తుల పుస్తకం రూ.1.03లక్షల కోట్లకు చేరింది. కొత్తగా ఏర్పడ్డ ఐడీఎఫ్‌సీ ఫస్ట్‌బ్యాంక్ లిమిటెడ్‌కు ఎండీగా కేపిటల్ ఫస్ట్ వ్యవస్థాపకులు, ఛైర్మన్ వి.వైద్యనాథన్ బాధ్యతలు నిర్వహించనున్నారు. అలాగే ఐడీఎఫ్‌సీ బ్యాంక్ వ్యవస్థాపక ఎండీ, సీఈవో రాజీవ్ లాల్‌ను తాత్కాలిక నాన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా నియమితులయ్యారు.

ఐడీఎఫ్‌సీ, కేపిటల్ ఫస్ట్ విలీనం గతేడాది డిసెంబరు 18న జరిగింది. విలీనం తర్వాత ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ తన 203 బ్యాంక్ బ్రాంచ్‌ల ద్వారా 7.2మిలియన్ల ఖాతాదారులకు సేవలు అందిస్తోంది. ఆ బ్యాంక్‌కు మొత్తం 129 ఏటీఎంలు ఉండగా.. 454 గ్రామీణ వ్యాపార కరస్పాండెంట్ కేంద్రాలు ఉన్నాయి. కేపిటల్ ఫస్ట్ సంస్థకు చెందిన ప్రతి 10 షేర్లకు 139 ఐడీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లను బదలాయించేలా విలీన ఒప్పందం జరిగింది.

మళ్లీ పెరిగిన పెట్రోల్ ధరలు
- హైదరాబాద్‌లో రూ 73.47

ముంబై: పండగ వేళ ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలు పెట్రో భారాలు మోపాయి. గత నాలుగు రోజులుగా స్వల్పంగా పెరిగిన పెట్రో ఉత్పత్తుల ధరలు ఆదివారం మరింతగా భారమయ్యాయి. పలు చమురు మార్కెటింగ్ కంపెనీలు పెట్రోల్ ధరలను లీటర్‌కు 49 నుంచి 60 పైసల మధ్య పెంచగా, డీజిల్ ధరలు లీటర్‌కు 59 నుంచి 75 పైసల వరకూ భారమయ్యాయి. తాజా పెంపుతో హైదరాబాద్‌లో పెట్రోల్ లీటర్ రూ 73.47కు ఎగబాకింది. ఇక డీజిల్ ధర లీటర్‌కు రూ 69.24కు చేరింది. దేశ రాజధాని ఢిల్లీలో పెట్రోల్ లీటర్ రూ 69.75కు పెరిగింది.

డీజిల్ ధర లీటర్‌కు రూ 63.69కు చేరింది. ముంబైలో పెట్రోల్ ధర లీటర్ రూ 75.39 పలికితే, డీజిల్ ధర 62 పైసలు పెరిగి రూ 66.66కు చేరింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరగడంతో పాటు ముడిచమురు ఉత్పత్తులను రోజుకు ఎనిమిది లక్షల బారెల్స్‌కు పరిమితం చేయాలన్న సౌదీ అరేబియా నిర్ణయంతో పెట్రో ఉత్పత్తుల ధరలు భారమయ్యాయి.



48 మెగాపిక్సెల్ కెమెరాతో రియల్‌మి 3 స్మార్ట్‌ఫోన్

న్యూఢిల్లీ: చైనాకు చెందిన ప్రముఖ మొబైల్ తయారీ సంస్థ రియల్‌మి మరో కొత్త స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేసేందుకు కసరత్తు చేస్తోంది. చైనా మార్కెట్లో 48 మెగాపిక్సెల్ కెమెరా గల రియల్‌మి 3 స్మార్ట్‌ఫోన్‌ను ప్రవేశపెట్టనున్నట్లు కంపెనీ పేర్కొంది. ప్రస్తుతం 48 మెగాపిక్సెల్ కెమెరాను తయారు చేస్తున్నట్లు సంస్థ వెల్లడించింది. రియల్‌మి 3 స్మార్ట్‌ఫోన్ ధర ఎంత ఉంటుందనేది సంస్థ అధికారికంగా ప్రకటించలేదు. రియల్‌మి సిరీస్‌లో నాలుగు వేరియంట్లలో స్మార్ట్‌ఫోన్‌లు అందుబాటు ఉన్నాయి. రియల్‌మి యూ1 రూ. 11,999, రియల్‌మి 2 రూ. 10,249, రియల్‌మి 2 ప్రో రూ. 13,990, రియల్‌మి సీ1 స్మార్ట్‌ఫోన్‌లు కస్టమర్లకు లభిస్తాయని కంపెనీ స్పష్టం చేసింది. ఇటీవల చైనా మార్కెట్లో రెడ్‌మి నోట్ 7 స్మార్ట్‌ఫోన్‌ను కూడా విడుదల చేశారు.



న్యూ ఆఫర్‌ను ప్రకటించిన బెల్కిన్

ఢిల్లీ: అమెరికాకు చెందిన ప్రముఖ ఎలక్ట్రానిక్స్ సంస్థ బెల్కిన్ మరో ఆఫర్ ప్రకటించింది. సీఈఎస్ 2019లో నిర్వహించనున్న ఓ కార్యక్రమంలో కారు చార్జర్, కేబుల్స్, పవర్ బ్యాంక్‌ను విడుదల చేసేందుకు బెల్కిన్ సంస్థ కసరత్తు చేస్తోంది. 20,000ఎంఏహెచ్ పవర్ బ్యాంకుతోపాటు యూఎస్‌బీసీ, యూఎస్‌బీఏ పోర్టు, యూఎస్‌బీసీ కారు చార్జర్‌తో పాటు కేబుల్, యూఎస్‌బీసీ హోమ్ చార్జర్‌తో పాటు కేబుల్, పవర్ బ్యాంకు యూఎస్‌బీసీ కేబుల్‌తో పాటు మరికొన్ని ఎలక్ట్రానిక్ వస్తువులను విడుదల చేయనున్నట్లు సంస్థ తెలిపింది.



స్పోర్ట్స

రాహుల్, పాండ్య స్థానాలలో
గిల్, విజయ్ శంకర్‌లకు చోటు

న్యూఢిల్లీ: ఇటీవల ఓ టీవీ ఛానల్‌లో జరిగిన కార్యక్రమంలో మహిళల పట్ల అనుచితంగా మాట్లాడినందుకు కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యాలపై బీసీసీఐ వేటు వేసిన సంగతి తెలిసిందే. తొలి వన్డేలో 34 పరుగుల తేడాతో టీమిండియా ఓటమి పాలవడంతో బీసీసీఐ జట్టులో కొన్ని మార్పులు చేసింది. సస్పెండైన ఆటగాళ్లు రాహుల్, పాండ్య స్థానాలలో శుభమన్‌గిల్, విజయ్ శంకర్‌లను భర్తీ చేసేందుకు బీసీసీఐ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆల్‌ఇండియా సీనియర్ సెలక్షన్ కమిటీ బ్యాట్స్‌మెన్ శుభమన్‌గిల్, ఆల్‌రౌండర్ విజయ్ శంకర్‌లను జట్టులో స్థానం కల్పించినట్టు బీసీసీఐ ఒక ప్రకటనలో తెలిపింది. ఆస్ట్రేలియాతో మంగళవారం అడిలైడ్‌లో రెండో వన్డే జరుగనుంది.

ఈ మ్యాచ్‌లో విజయ్ శంకర్ టీమిండియా జట్టుతో కలువనున్నాడు. ఆస్ట్రేలియా సిరీస్ అనంతరం న్యూజిలాండ్‌తో జరుగనున్న వన్డే, టీ20 సిరీస్‌లో శుభమన్‌గిల్ జట్టుతో కలవనున్నాడు. గత ఏడాది జరిగిన అండర్ 19 క్రికెట్ వరల్డ్‌కప్‌లో శుభమన్‌గిల్ ఆల్‌రౌండర్‌గా మంచి ప్రదర్శన కనబరిచి జట్టును విజేతగా నిలిపాడు. అండర్ 19 ప్రపంచకప్‌లో టోర్నమెంట్‌లో ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్ అవార్డును గిల్ అందుకున్నాడు.

న్యూజిలాండ్‌తో జరగనున్న వన్డే, టీ20 సిరీస్‌లో గిల్ ఆడనున్న గిల్ తన సంతోషాన్ని పంచుకున్నాడు. శనివారం తనకు బీసీసీఐ నుంచి సమాచారం రాగానే ఆశ్చర్యపోయినట్టు గిల్ తెలిపాడు. తొలుత తన అదృష్టాన్ని తానే నమ్మలేకపోయానని పేర్కొన్నాడు. "నేను అప్పుడే నిద్రపోయా. రాత్రి ఒంటిగంట సమయంలో రిపోర్టర్ల నుంచి ఒకటే మెసేస్‌లు. వాట్సాప్ ఓపెన్ చేసి చూస్తే కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యా స్థానాలను నన్ను, విజయ్ శంకర్‌తో భర్తీ చేయనున్నట్టు మెసేజ్‌లు ఉన్నాయి. వాటిని చూశాక 20 సెకన్లపాటు షాక్‌తో తేరుకోలేకపోయా" అని గిల్ వివరించాడు.







హార్ధిక్ పాండ్యాకు మరో ఎదురుదెబ్బ

ముంబై: టీం ఇండియా ఆల్ రౌండర్ హార్థిక్ పాండ్యా ఇప్పట్లో కష్టాలు తప్పేలా కనిపించడం లేదు. కాఫీ విత్ కరణ్ షోలో.. మహిళల పట్ల అసభ్యంగా వ్యాఖ్యలు చేసిన కారణంగా టీం ఇండియా క్రికెటర్ హార్థిక్ పాండ్యాపై వేటు పడిన విషయం తెలిసిందే. ఈ షోలో హార్థిక్ మాట్లాడుతూ.. "సెక్స్ విషయంలో నేను చాలా ఓపెన్‌గా ఉంటా. అన్ని విషయాలు మా అమ్మా, నాన్నలతో పంచుకుంటా. నా వర్జినిటీ కోల్పోయిన విషయం కూడా వారితో చెప్పాను" అంటూ హార్థిక్ పేర్కొన్నాడు. దీంతో సోషల్ మీడియాలో తీవ్ర స్థాయిలో దుమారం రేగింది.

ఈ నేపథ్యంలో హార్థిక్ పాండ్యా, కేఎల్ రాహుల్‌పై బీసీసీఐ నిషేధం విధించింది. ఈ విషయం నుంచి తేరుకొనే లోపే హార్థిక్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. హార్థిక్ పాండ్యాను తమ బ్రాండ్ అంబాసిడర్‌గా తప్పిస్తున్నట్లు 'జిల్లెట్' సంస్థ ప్రకటించింది. కాగా ప్రస్తుతం న్యూజిలాండ్ పర్యటన నుంచి హార్థిక్, రాహుల్ని తప్పించిన బీసీసీఐ వారి స్థానంలో విజయ్ శంకర్, శుభ్‌మాన్ గిల్లను జట్టులోకి తీసుకుంది.



విజయక్రాంతి, హైదరాబాద్: యువ బాడ్మింటన్ క్రీడాకారిణి కేయూర మోపటి ఆదివారం విజయక్రాంతి దినపత్రిక ఛైర్మన్ సీఎల్ రాజం గారిని మర్యాద పూర్వకంగా కలిశారు.

రాయుడు బౌలింగ్ శైలిపై ఐసీసీకి ఫిర్యాదు

సిడ్నీ: టీమిండియా క్రికెటర్, హైదరాబాద్ ఆటగాడు అంబటి రాయుడు అనుమానాస్పద బౌలింగ్‌శైలిపై ఐసీసీకి ఫిర్యాదు అందింది. శనివారం ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే మ్యాచ్‌లో రాయుడు రెండు ఓవర్లు బౌలింగ్ చేసిన సంగతి తెలిసిందే. రాయుడు బౌలింగ్ యాక్షన్ అనుమానాస్పదంగా ఉందని మ్యాచ్ అధికారులు నివేదిక ఇచ్చారు. ఈ ఫిర్యాదును స్వీకరించిన ఐసీసీ రాయుడు 14 రోజుల్లో బౌలింగ్ పరీక్షకు వెళ్లి నిరూపించుకోవాలని పేర్కొన్నది. అంబటి రాయుడు కెరీర్లో ఇప్పటి వరకూ 46 వన్డే మ్యాచ్‌లు ఆడి 20.1 ఓవర్లు బౌలింగ్ చేశాడు. అతను ఆడిన ఆరు టీ20 మ్యాచ్ల్లో బౌలింగ్ చేయలేదు. ఆస్ట్రేలియాతో జరిగిన తొలివన్డే మ్యాచ్‌లో రెండు ఓవర్లు బౌలింగ్ చేసిన రాయుడు 13 పరుగులు ఇచ్చాడు. రాయుడు విషయంపై బీసీసీఐ నుంచి ఇంకా ఎలాంటి ప్రకటన అందలేదు.





ఆడిలైడ్ చేరుకున్న కోహ్లీ సేన

అడిలైడ్: రెండో వన్డే కోసం భారత క్రికెట్ జట్టు ఆదివారం అడిలైడ్ చేరుకుంది. ఈనెల 15న ఆతిథ్య ఆస్ట్రేలియాతో భారత్ తలపడనుంది. తొలి వన్డేలో ఆసీస్ బౌలర్ల దెబ్బకు కుదేలైన భారత బ్యాటర్లు నెట్స్‌లో కఠోర సాధన చేయనున్నారు. అడిలైడ్ వన్డేలో భారత్ గెలిస్తేనే.. సిరీస్‌లో నిలుస్తుంది. రెండో వన్డేలోనూ చేతులెత్తేస్తే ఇంకో వన్డే మిగిలుండగానే ఆసీస్ సిరీస్ కైవసం చేసుకుంటుంది. ఈ నేపథ్యంలో ఎలాగైన విజయం సాధించాలని పట్టుదలతో ఉంది. అందుకు తగ్గట్లుగా కోహ్లీసేన వ్యూహాలు రచిస్తోంది. తొలి వన్డేలో టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్స్ వైఫల్యంపై సమీక్ష చేస్తోంది.

కొత్తగా జట్టులో కొచ్చిన కుర్రాళ్లు పరీక్షించాలని టీం మేనేజ్‌మెంట్ భావిస్తోంది. ముఖ్యంగా ఓపెనర్ శిఖర్ ధావన్ వైఫల్యంపై ఆందోళన చెందుతోంది మేనేజ్‌మెంట్. తొలి వన్డేలతో ధావన్ డకౌట్ కావడంతో ఆ ప్రభావం జట్టుపై బాగా పడింది. కనీసం 5ఓవర్లు కూడా క్రీజులో నిలబడలేక పోవడంతో జట్టుకు ఆదిలోనే కష్టాలు వచ్చిన విషయం విధితమే. అంబటి రాయుడు నెట్స్‌లో చాలా సేపు శ్రమించాడు, స్లో బంతులు, షార్ట్. బంతులు, స్వింగ్ ఫాస్ట్ బౌలింగ్‌పై ప్రాక్టీస్ చేశాడు. రెండో వన్డేలో రాయుడు గాడిలో పడుతాడని ఆశాభావం వ్యక్తం చేస్తుంది టీమిండియా.



పంత్ ఉండి ఉంటే ఫలితం మరోలా ఉండేది

సిడ్నీ: మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా సిడ్నీ వేదికగా జరిగిన తొలి వన్డేలో టీం ఇండియా 34 పరుగుల తేడాతో పరాజయం పాలైన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో రోహిత్ శర్మ 133, ధోనీ 51 పరుగులు చేసినప్పటికీ.. భారత్‌కు పరాజయం తప్పలేదు.

అయితే ఈ జట్టులో ఒక ఆటగాడు ఉంటే.. టీం ఇండియా ఓడిపోయేది కాదని ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైఖేల్ వాగన్ అభిప్రాయపడ్డారు. జట్టులో ఎంఎస్ ధోనీకి బదులు రిషబ్ పంత్ ఉంటే టీం ఇండియా కచ్చితంగా విజయం సాధించేదని ఆయన అన్నారు. "ఎటువంటి అనుమానం లేకుండా.. రిషబ్ పంత్ ఈ ఇండియా జట్టులో ఉండాలి. అది కేవలం బ్యాట్స్‌మెన్‌గా అయినా" అంటూ మైఖేల్ వాగన్ ట్వీట్ చేశారు. ప్రస్తుతం ఈ ట్వీట్ వైరల్ అవుతోంది. ఎంఎస్ ధోనీ, దినేశ్ కార్తీక్ లాంటి సీనియర్లను జట్టులోకి తీసుకుంటున్న బీసీసీఐ.. రిషబ్ పంత్ వంటి యువకులకు ఎందుకు అవకాశం ఇవ్వడం లేదని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు.



Printed and Published By Chilappagari Laxmi Rajam, on behalf of Intercontinental Publications Private Limited, Printed at Intercontinental Publications Private Limited, Survey No .713/P, Dundigal Grama Panchayat, Qutubullapur Mandal, Medchal – Malkajgiri District 500043, Published at Plot No. 1267/A, Road No. 63/A, Jubilee Hills, HYDERABAD-500033, Telangana State. Editor: Chilappagari Laxmi Rajam, RNI NO: TELTEL /2018/75203, Ph: +91 40 2355 6603, Fax No. +91 4023556604, Toll Free: 1800 599 3399.